ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



16

ఖమ్మం

గురువారం 31 ఆగస్టు 2017

రైతు బాంధవుడు కేసీఆర్

- రైతు కమిటీల్లో నెంబర్‌వన్‌గా నిలవాలి
- భవిష్యత్తు అవసరాల కోసం కరెంటుని నిల్వ చేసుకుంటున్నాం..
- పాలేరు నియోజకర్గ సమావేశంలో మంత్రి తుమ్మల

16



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఇష్టముంటే ఉండండి.. లేకుంటే వెళ్లిపోండి

- టీఆర్‌ఎస్ మధిర నియోజకవర్గ సమావేశంలో బేగ్
- ఆగ్రహం వ్యక్తంచేసిన కార్యకర్తలు

3



మాటలే.. మూటలు లేవు..!

- నీరుగారుతున్న 'వ్యవసాయ యాంత్రీకరణ' లక్ష్యం
- ఏటా కేటాయింపులే తప్ప నిధులు కరువు
- గతేడాదీ పైసలివ్వని ప్రభుత్వం
- ఈసారీ అమలుపైనా అనుమానాలు
- ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలు

11

చాయ్, సమోసా కోసమా?

'పనులు చేస్తారనే మిమ్మల్ని మేయర్‌గా ఎన్నుకున్నాం... కానీ ఒక్క సమస్య కూడా పరిష్కారం కావడం లేదు. డివిజన్లలో ప్రజలు నిలదీస్తున్నారు.. సమస్యలు పరిష్కరించలేని సమావేశాలెందుకు చాయ్, సమోసా తిని వెళ్లిపోయేందుకా..? అంటూ ఖమ్మం కార్పొరేషన్ పాలకవర్గం సమావేశంలో స్వపక్ష కార్పొరేటర్లే గళమెత్తారు. గత సమావేశంలో గుర్తించిన ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేపోయామని నిరసన తెలిపారు. ఇక ఇంతకాలమైనా 'సారథీ నగర్ అండర్ రైల్వే అండర్ బ్రిడ్జీ సమస్యను పరిష్కరించలేకపోయామని, అందుకు కౌన్సిల్ సభ్యులకు సారీ చెబుతున్నాను'. అని ఎమ్మెల్యే బాలసాని సంచలన వ్యాఖ్యలు చేశారు. వెరసి ఆరునెలల తరువాత బుధవారం జరిగిన కార్పొరేషన్ సమావేశం గరంగరంగా సాగింది.

- ఖమ్మం కార్పొరేషన్

11

- సమస్యలు పరిష్కరించలేనప్పుడు సమావేశాలెందుకు?
- ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నాం..
- నగర మేయర్‌పై స్వపక్ష కార్పొరేటర్ల ధ్వజం
- అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అసంతృప్తి
- వాడీవేడిగా నగర పాలక సంస్థ పాలకవర్గ సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అజయ్



మేయర్‌ను ప్రశ్నిస్తున్న సభ్యులు



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి, చిత్రంలో ఇరు జిల్లాల కలెక్టర్లు

'స్థానికా'నికి సమాయత్తం కావాలి

- ఎన్నికల పకడ్బందీ నిర్వహణకు కృషి చేయాలి
- అవినీతి, అక్రమాలపై ఉక్కుపాదం మోపాలి
- ఇరుజిల్లాల అధికారులతో సమీక్షలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి

7



సీపీఎస్ రద్దు కోరుతూ ఖమ్మంలో ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు

సీపీఎస్.. నో

- కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దుకు మూకుమ్మడి ఆందోళన
- రేపు ఉద్యోగుల సామూహిక సెలవు
- జేఏసీ ఆధ్వర్యంలో విస్తృత పోరాటానికి సమాయత్తం

8

ఉద్యోగం

గ్రూప్- 4, క్లాస్- 4 ఉద్యోగాలలో
దివ్యాంగుల నియామకానికి నోటిఫికేషన్



ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం: ఉమ్మడి జిల్లాల (ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం)తోపాటు గార్ల, బయ్యారం, వాజేడు, వెంకటాపురానికి చెందిన దివ్యాంగుల (అంధులు, బధిరులు, శారీరక) కోసం రిజర్వు చేయబడిన గ్రూప్ -4, క్లాస్ -4 ఉద్యోగాల నియామకానికి ప్రత్యేక నోటిఫికేషన్ జారీచేసినట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి బి. ఝాన్సీ లక్ష్మీబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-4 నుంచి టైపిస్ట్, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ స్టెనో, ఎంసీహెచ్ఎ (స్త్రీ), లైబ్రేరియన్ కేటాయించామన్నారు. క్లాస్ -4నుంచి ఆఫీస్ సబార్డినేట్, ఫిషర్‌మెన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు, అర్హత, వయస్సు, ఇతర నిబంధనలకు www.khammam.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని వివరించారు. జిల్లాకు చెందిన దివ్యాంగులు జిల్లా సంక్షేమ శాఖాధికారి, మహిళ, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖలలో అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మికం

జయవిఘ్నశిలతో ఎనిమిది విఘ్నాలు



బోనకల్: జయవిఘ్నశిల అనేది పురాణాల ప్రకారం విశుక్రుడు మనుషులపై ప్రయోగిస్తాడు. దీని ద్వారా ఎనిమిది రకాల దుష్టశక్తులు ఆవహిస్తాయి. అవి 1. అలసట, సోమరితనం 2.దీన(దీనత్వం) 3. కృపన (బేలతనం) 4. నిద్ర 5.తంద్ర(కునికిపాట్లు) 6.క్లీబా (కర్తవ్యాన్ని మరవడం) 7.ప్రమీలిక (సంకోచించడం) 8.నిరంహకార(నిరుత్సాహం) ఈ శక్తులను జయించే దైవ మే విఘ్నేశ్వరుడు. కావున వినాయకుడిని ఆరాధించడం వల్ల పై శక్తులు మానవుల దరి చేరవు. ఇదే విఘ్నేశ్వర ఆర్చనలోని పరమార్థం. సాధారణంగా ప్రతీ రోజు గణనాథుణ్ని పూజిస్తే ఎలాంటి చెడు ఫలితాలు జరగ వు. అంతా మంచే జరుగుతుంది. హిందువులు ఇళ్లలో ఏ శుభ కార్యం ప్రారంభించినా, ఏ దేవుడి పూజ చేసినా, వ్రతం ప్రారంభించినా తొలుగ వినాయకుడిని స్తుతిస్తారు. ఆయన పూజ చేశాకే మిగతా పనులు ప్రారంభిస్తారు. దీన్ని బట్టి ఆయనకు ఉన్న శక్తిని అర్థం చేసుకోవచ్చు.



రాజేశ్వరశర్మ సిద్ధాంతి, బోనకల్

ఆసక్తి ఉంటే దేనిలోనైనా రాణించవచ్చు

ఘంటసాల మార్తాండ నర్సింహం, సింగరేణి గణాంకాల ఉద్యోగి, కొత్తగూడెం



ఇంటర్వ్యూ Interview

- కొత్తగూడెం అర్బన్

ఆసక్తి ఉంటే దేనిలోనైనా రాణించడానికి అవకాశం వీలుంటుంది. సామాజిక సేవా దృక్పథాన్ని అదృష్టంగా భావించాలని హోమియో వైద్యులు, యోగ అధ్యాపకులు ఘంటసాల మార్తాండ నర్సింహం అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆయన వృత్తి సింగరేణిలోని గణాంకాల విభాగంలో ఉద్యోగం చేస్తూ ఖాళీ సమయంలో తాను తరతరాలుగా నేర్చుకున్న హోమియో వైద్యం చేస్తున్నారు. యోగ గురువుగా సుపరిచితుడైన ఆయనను 'ఆంధ్రజ్యోతి' పలుకరించగా ఆత్మీయంగా ముచ్చటించారు.

వారసత్వంగా వైద్యం..

దశాబ్దాలుగా వారసత్వంగా సంక్రమించిన హోమియో వైద్యం..నేనూ చేస్తున్నా. కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో నన్ను వైద్యుడిగా గుర్తుపడతారు. మా తాతగారు, నాన్నగారు హోమియో కళాశాలలో అధ్యాపకుల., వారి నుంచి నేర్చుకున్న వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నా. వైద్యంతో వ్యాపారం చేస్తే అది సేవ కానేకాదు.

చదివింది టీచర్ కోర్సు..

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెడన మా సొంతూరు. అక్కడే 10వ తరగతి వరకు చదివా. ఇంటర్మీడియట్, బీఎస్సీ, బీఈడీ బందరులో పూర్తిచేశా. మరోవైపు హోమియో విద్య నేర్చుకుంటూ మరో వైపు యోగలో ప్రావీణ్యత సాధించా. కృష్ణా జిల్లాలో ఉపాధ్యాయుడిగా పనిచేసి, తర్వాత సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరా.

పలు రకాలుగా సేవలు

అల్లోపతి, ఆయుర్వేదం, యునాని, హోమియో రకాల్లో వైద్యం చేస్తుంటా. రోగి శరీరాన్ని బట్టి వైద్యం ఉంటుంది. ప్రాణిక్ హీలింగ్, ఆక్యుప్రెషర్ చేస్తుంటా. ప్రాణిక్ హీలింగ్ పాత విధానమైనా.. దాని ద్వారా శరీరంలోని నెగెటివ్ ఎనర్జీని బయటికి వీలవుతుంది. మానసికంగాను, శారీరకంగాను రోగికి సేవలందిస్తే తొందరగా ఉపశమనం పొందడానికి వీలు కలుగుతుంది.

వైద్యం - వ్యాపారం కారాదు....

వైద్యులకు వ్యాపార దృక్పథం ఉండొద్దు. రోగిని పూర్తిగా అర్థం చేసుకునే తత్వం ఉండాలి. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. అయితే ప్రతి వ్యక్తి వైద్యులు కాలేరు. ఆహారపు అలవాట్లు, జీవన శైలి, పాజిటివ్ ఆలోచన రోగికి వివరించాలి. తన మీద తనకు నమ్మకం కలిగించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతుడవుతాడు.



చదువు నేర్చుకుంటున్న పల్లె మహిళలు
ఓనమాల నుంచి సంతకాల వరకు
వేలి ముద్రలకిక చెల్లుచీటీ

ఇంతుల.. అక్షర కాంతులు

● సత్తుపల్లి/వేంసూరు

చదువు విలువ తెలియని రోజులవి. చదువుకోకపోతే వచ్చే ఇబ్బందులు కూడా వారికి తెలియదు. కాని కాలం గడుస్తూ వయస్సు పెరుగుతున్న సమయంలో చదువు విలువ తెలిసింది. చదువుకుందామంటే ఒక పక్క బాధ్యతలు పెరిగిపోయి మరో పక్క చదువుకోవాలంటే వయస్సురీత్యా బిడియం దీంతో సంతకం చేయలేని స్థితి ఒకవైపు. వేలి ముద్ర వేయాల్సి రావటంతో పది మందిలో తలొంపులు మరోవైపు. ఈ నేపథ్యంలో తమ గ్రామంలో ఇంటికి సమీపంలో ప్రారంభించిన సాక్షరభారత్ కేంద్రాల్లో చదువు నేర్పుతున్నారని తెలిసి అక్షరాలు నేర్చుకొని అక్షరంతో పరిచయం లేని స్థితి నుంచి ప్రస్తుతం చదవటం, రాయగలిగిన స్థాయికి చేరిన వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సాక్షరభారత్ కేంద్రాల్లో చదువు నేర్చుకొని ప్రస్తుతం వారు సమాజంలో తలెత్తుకొని తిరగ్గలిగే స్థాయికి చేరుకున్నారు.

మహిళలు అక్షరాలు దిద్దుతున్నారు. పలకపై ఓనమాలు నేర్చుకుంటూ సంతకాలు పెడుతున్నారు. నలుగురిలోకి వెళ్లినప్పుడు, రేషన్ బియ్యం తీసుకునేసమయంలో ఓటు వినియోగించుకునే సందర్భంలో గర్వంగా సంతకాలు పెడుతున్నారు. చదువుకుంటూ వారి ఇంటికి వెలుగులు తెస్తున్నారు.గతంలో అనేక సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే తలంపుతో అక్షరదీపం, వయోజన విద్య తదితర పథకాలను ఆమలు చేసింది. ఆ తరువాత 2010 నుంచి సాక్షరభారత్‌ను ప్రారంభించి దీని ద్వారా గ్రామాల్లో రెండు చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముందుగా నిరక్షరాస్యులను గుర్తించారు. వారిని దశలవారీగాఅక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. గ్రామ కో-ఆర్డినేటర్లు నిరక్షరాస్యులకు సాయంత్రం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకూ అక్షరాలు నేర్పిస్తారు. వేలి ముద్రలు వేసే వారు సాక్షరభారత్ కేంద్రాల్లో అక్షరాలు నేర్చుకొని చదవటం, రాయటం వరకూ చేరుకున్నవారు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారు. సత్తుపల్లి మండలం గంగారం సంసద్ ఆదర్శ్ గ్రామం కావటంతో ఆ గ్రామంలో అత్యధికంగా 54 కేంద్రాల ద్వారా అక్షరాస్యులు గా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టారు. గంగారంలో రికార్డు స్థాయిలో 1,070 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ గ్రామం నుంచి అతి తక్కువ సమయంలో చదవటం, రాయటం నేర్చుకున్న గంగారం గ్రామానికి చెందిన మానికల సత్యనారాయణ రెండేళ్ల క్రితం రాష్ట్రపతి సమావేశానికి హాజరయ్యారు.

చిన్నతనంలో పాఠశాలకు వెళ్లలేదు
-బెజవాడ లక్ష్మి, గంగారం



చిన్నతనంలో పాఠశాలకు వెళ్లలేదు. పెళ్లై అత్తారింటికి వచ్చిన తర్వాత సాక్షరత భారత్‌లో విద్యాభ్యాసం గురించి తెలుసుకొని ఇక్కడ చదువుకున్నాను. అక్షరం ముక్క రాని నేను వయోజన విద్య ద్వారా సంతకం నేర్చుకున్నాను.

ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమయ్యా
-బి.రాణి, గంగారం



చిన్నతనంలో ఆర్థిక ఇబ్బందులు నా తల్లిదండ్రులు బడికి పంపలేదు. పెళ్లైన తర్వాత అందరూ చదువుకోవడం చూసి నాకు చదువుకోవాలనిపించింది. దీంతో గ్రామంలోని సాక్షర భారత్ కేంద్రానికి వెళ్లి అక్షరాలు నేర్చుకున్నాను.

వయోజన కేంద్రంలో సంతకం నేర్చుకున్నా
దానే శాంతమ్మ, మర్లపాడు, వేంసూరు



సాక్షరభారత్ కేంద్రాల్లో అక్షరాలు నేర్చుకున్నా. పేరు రాయడం, చదవడం, వార్తా పత్రికలు చదవగలుతునాన్ను. బాల్యంలో చదువుకోకుండా తప్పుచేశా. కేంద్రాల్లో విద్యను అభ్యసించడం ఆనందంగా ఉంది.

ఊరిపేర్లు చదవడం, రాయడం వచ్చింది
వనపర్ల డేజమ్మ, వేంసూరు



సాక్షరభారత్ కేంద్రాల్లో చదివే అవకాశం లభించింది. గతంలో ఊరి ప్రయాణాలు చేసేటప్పుడు పక్కనున్న వారిని అడిగి ఏ బస్సు ఎటు పోతుందో తెలుసుకునే దాన్ని. ప్రస్తుతం నేనే పక్కవారికి చెబుతున్నా.

5,205మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాం
-డి.రమేష్, సాక్షర భారత్ కోఆర్డినేటర్, వేంసూరు




మండలంలో 2010లో మొత్తం 12వేలకు పైగా నిరక్షరాస్యులను గుర్తించాం. 5,205 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాం., రానున్న కాలంలో మండలంలో నూరుశాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి చేస్తున్నాం. మండలంలోని 19 పంచాయితీల్లో 38 గ్రామ కో ఆర్డినేటర్లను నియమించి వయోజనులకు విద్యను అందిస్తున్నాం.

రాష్ట్రపతి సమావేశానికి వెళ్లా
మానికల సత్యనారాయణ, బి.గంగారం



ఆదర్శ సంసద్ గ్రామం గంగారం నుంచి ఖమ్మం జిల్లా తరపున ఎంపికచేసి రాష్ట్రపతి సమావేశానికి పంపారు. ఈ సమావేశానికి హాజరు కావటం సంతోషంగా ఉంది. చదవడం, రాయడం రాని నాకు వయోజనవిద్య ద్వారా ఓనమాలు నేర్చుకొని గర్వంగా నలుగురిలో తలెత్తుకుని తిరుగుతున్నాను.

నూరుశాతం అక్షరాస్యత సాధిస్తాం
పి.హరిబాబు, సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్, సత్తుపల్లి



సత్తుపల్లి మండలంలో నాలుగు వేలకు పైగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాం. మండలంలో నూరుశాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఇప్పటికే గంగారం గ్రామంలో నూరు శాతం అక్షరాస్యతను సాధించాం. అన్ని గ్రామాల్లో నిరక్షరాస్యులు లేకుండా చేసి మండలాన్ని ఆదర్శంగా నిలుపుతాం.

మినీ లోకం



ఇష్టమైతే ఉండండి .. లేకుంటే వెళ్లండి

రసాభాసగా .. టీఆర్ఎస్ మధిర నియోజకవర్గస్థాయి సమావేశం
బేగ్ వ్యాఖ్యలతో కార్యకర్తల్లో ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బేగ్, పక్కన ఎంపీ తదితరులు

మధిర టౌన్: "బంగారు తెలంగాణనే లక్ష్యంగా వివిధపార్టీలనుంచి టీఆర్ఎస్‌లోకి చేరారు.. వీరికి వేర్వేరు అభిప్రాయాలు ఉంటాయి.. అందరూ పార్టీ విధివిధానాలు, ప్రభుత్వ విధానాలకు తలొగ్గి పనిచేయాల్సిందే.. గలాబా సృష్టించటం తగదు.. ఇందుకు ఇష్టమైనవాళ్లే టీఆర్ఎస్‌పార్టీలో ఉండాలి, లేనివారు పార్టీనుంచి బయటకు వెళ్లిపోవచ్చు..' అని టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుడాన్‌బేగ్ తన ప్రసంగంలో అన్నారు. దీంతో కార్యకర్తలంతా ఒక్కసారిగా లేచి, బేగ్ వ్యాఖ్యలను తప్పుపడుతూ.. అక్కడినుంచి వెళ్లిపోయేందుకు లేచారు. ఈ ఘటన మధిర టీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశంలో జరిగింది.

మధిర పట్టణంలో బుధవారం రెడ్డిగార్డెన్స్‌లో నిర్వహించిన టీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశం రసాభాసగా మారింది. సమావేశం ప్రారంభంకాగానే వేదికపైకి ముందుగా నాయకులను ఆహ్వానించలేదంటూ.. పార్టీనియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంమ్మూర్తి వైఖరిని కొందరు కార్యకర్తలు తప్పుపట్టారు. ప్రభుత్వపథకాల గురించి గ్రామాలు, మండలాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారపార్టీ నాయకుల మాటకు విలువలేదని, పార్టీకోసం పనిచేసేవారికి సర్కారు ఇచ్చే సహాయాన్ని ఇప్పించుకోలేకపోతున్నామని ఆగ్రహావేశాలు వ్యక్తం చేయటంతో సభగందరగోళంగా మారింది. దీంతో ఎవరైనా ఒక్కరు వచ్చి మాట్లాడాలని నాయకులు సూచించారు. టీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు చీదిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ అభివృద్ధికోసం ఇతర రాజకీయపార్టీల దాడుల నుంచి తట్టుకుంటూ అనేకమంది ఆర్థికంగా చితికిపోయారని, కనీసం 'డబుల్‌బెడ్‌రూం' ఇళ్లు, గొర్రెలపంపిణీ వంటి ప్రభుత్వపథకాలపై లాటరీ విధానాన్ని ప్రవేశపెడితే నాయకులుగా తాము ఏంచేయలేకపోతున్నామంటూ.. ఈ విషయాన్ని పార్టీలో చర్చించాలన్నారు. దీంతో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బేగ్ మాట్లాడుతూ.. బంగారు తెలంగాణే లక్ష్యంగా వివిధపార్టీలనుంచి టీఆర్ఎస్‌లోకి చేరారని, అందరూ పార్టీ విధివిధానాలు, ప్రభుత్వవిధానాలకు తలొగ్గి పనిచేయాల్సిందేనటూ.. ఇష్టమైనవాళ్లే పార్టీలో ఉండాలని, లేనివారు బయటకెళ్లిపోవచ్చనటంతో కార్యకర్తలంతా ఒక్కసారిగా లేచి బేగ్‌వ్యాఖ్యలను తప్పుపడుతూ.. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ దశలో నాయకులు కార్యకర్తలకు సర్దిచెప్పినా వినేపరిస్థితి లేకుండాపోయింది. కొందరు కార్యకర్తలు కుర్చీలను పైకిలేపారు. ఈదశలో వేదికపై ఉన్న ఎంపీ కార్యకర్తల వద్దకువచ్చి శాంతించాలని, ఇబ్బందులపై సమగ్రంగా చర్చిద్దామని సర్ది చెప్పే ప్రయత్నంచేశారు. అయినా, వినకపోవడంతో వేదికపైకివచ్చి ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎట్టకేలకు గొడవ సద్దుమణగటంతో సభ సజావుగా సాగింది.

రైతుకు భరోసా కల్పించటమే సీఎం లక్ష్యం: ఎంపీ పొంగులేటి

రైతులకు భరోసా కల్పించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వినూత్నమైన పథకాలను రైతులకోసం తీసుకువస్తున్నారని ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మధిర రెడ్డిగార్డెన్స్‌లో రైతుల గ్రామ, మండల సమాఖ్యలను ఏర్పాటుచేసేందుకు మధిర నియోజకవర్గస్థాయి సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీ పొంగులేటి మాట్లాడుతూ.. సమగ్ర భూవివరాలు రూపొందించేందుకు సీఎం రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూసర్వే చేపట్టారన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆయా ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించారని, ఎమ్మెల్యేలు లేనిచోట ఎంపీలు, ఎమ్మెల్సీలకు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. మధిర నియోజకవర్గానికి తనను ఇన్‌చార్జ్‌గా నియమించారని ఎంపీ తెలిపారు. భూరికార్డులను ప్రక్షాళనచేసే కార్యక్రమాన్ని సెప్టెంబరు 15నుంచి మూణ్నెళ్లపాటు నిర్వహిస్తారని, రెవెన్యూ గ్రామాలవారీగా సర్వే నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చి.. భూయజమానికి స్మాట్‌కార్డును అందజేస్తారు. దీనిలో తనభూమికి సంబంధించిన వివరాలన్నీ ఉంచుతారన్నారు. రైతుకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వంఇచ్చే అన్నిరకాల సహాయాన్ని ఈ కమిటీలద్వారానే అందజేయనున్నారన్నారు. పార్టీ నాయకులకు అధికారులతో ఇబ్బందులున్నమాట వాస్తవమేనని, దీని నివారణకు ప్రయత్నిస్తామన్నారు.

భూముల వివరాల భద్రతకే సర్వే.. కొండబాల కోటేశ్వరరావు

ఎప్పుడో నిజాంహయాంలో 1936లో భూసర్వే జరిగిందని, 70ఏళ్ల తర్వాత సమగ్ర భూసర్వే నిర్వహించి పకడ్బందీగా భూముల వివరాలు భద్రపర్చేందుకు కేసీఆర్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు అన్నారు. ప్రతి మండలంలో ధాన్యం నిల్వకోసం గోదాంలు నిర్మిస్తున్నారన్నారు. 'సీతారామ'ద్వారా వైరా చెరువుకు ఎన్నెస్పీ కెనాల్‌ను అనుసంధానించి, జిల్లాలో నీటిసమస్యను నివారించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు.

పూర్వవైభవం తేవటమే ప్రభుత్వ లక్ష్యం: బుడాన్ బేగ్

గ్రామాలకు పూర్వవైభవం తెచ్చేవిధంగా సీఎం కేసీఆర్ అనేక ప్రణాళికలను రూపొందించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు కృషిచేస్తున్నారని పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ బుడాన్‌బేగ్ పేర్కొన్నారు. సమావేశంలో టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొమ్మెర రాంమ్మూర్తి, విజయడెయిరీ ఖమ్మంజిల్లా చైర్మన్ సామినేని హరిప్రసాద్, అయిదు మండలాల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



సర్దిచెబుతున్న నాయకులు .. బేగ్ వ్యాఖ్యలకు నిరసనగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు

పురుగు ఉధృతి తెలుసుకునేందుకు లింగాకర్షణ బుట్టలు

పత్తిపంటను పరిశీలనలో జేడీఏ ఝాన్సీలక్ష్మీకుమారి



పత్తిపంటను పరిశీలించి సూచనలిస్తున్న జేడీఏ ఝాన్సీలక్ష్మీకుమారి

కొణిజర్ల: పత్తిపంటలో లింగాకర్షణ బుట్టలను ఏర్పాటుచేయడంద్వారా గులాబి రంగు పురుగు ఉధృతినితెలుసుకోవచ్చని.. తద్వారా రైతులు నివారణచర్యలను చేపట్టాలని జేడీఏ ఝాన్సీలక్ష్మీకుమారి రైతులకు సూచించారు. కొణిజర్లలోని పత్తిపొలాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ.. పత్తిచేను చుట్టూ రైతులు బెండమొక్కలు వేస్తే తొలగించాలన్నారు. గులాబిరంగు పురుగు ఉధృతి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. పురుగు ఉన్న చేలకు ఎకరానికి 5ఎంఎల్ చొప్పున లీటరునీటితో పిచికారీ చేయాలని తెలిపారు. ఉధృతి ఎక్కువగా ఉంటే క్వినాలీ పాస్ లీటరునీటితో కలిపి పిచికారీచేయాలని సూచించారు. రైతులు ఇలాంటి నివారణచర్యలు చేపట్టి పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. 'ఆత్మ' పీడీ విజయనిర్మల, ఏడీఏలు సరిత, శోభన్‌బాబు, వైరా నియోజకవర్గ ఆత్మ చైర్మన్ బోడపోతుల బాబు, మండల వ్యవసాయాధికారిని అరుణజ్యోతి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రవాణాశాఖ కార్యాలయానికి.. 'విద్యుత్ సరఫరా' అంతరాయం

ఖమ్మంకమాన్‌బజార్: ఖమ్మంనగరంలోని రవాణాశాఖ కార్యాలయంలో అనివార్య కారణాలతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగింది. దీంతో కార్యాలయంలో బుధవారం పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. కార్యాలయంలో సర్వర్ అంతంతమాత్రంగానే పనిచేస్తుంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. మధ్యాహ్నం తరువాత స్లాట్ చేసుకున్న వాహనదారులను మరుసటిరోజు రావాలని అధికారులు సూచించారు. దీంతో వారు చేసేదిలేక ఇంటిదారి పట్టారు. ఇన్వర్టర్‌లు కూడా కాలిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని అధికారులు తెలిపారు.

ప్రజలకు 'సినిమా' చూపిస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు

ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఎద్దేవా

ఖమ్మం అర్బన్: బంగారు తెలంగాణ సాధిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్.. మాటలతోనే కాలయాపనచేస్తున్నారు.. ప్రధానిమోదీ సైతం అదే బాటలో పయనిస్తున్నారని ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకివచ్చి మూడున్నరేళ్లవుతున్నా, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సాధించిన అభివృద్ధిశూన్యమన్నారు. ప్రజావ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ ప్రజలకు అభివృద్ధి సినిమా చూపిస్తున్నారని ఎద్దేవాచేశారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు కేంద్రం నోట్లరద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాలను ప్రకటించగా.. కేసీఆర్ మియాపూర్ భూకుంభకోణం, నేరెళ్ల ఇసుకమాఫియావంటివి కప్పిపుచ్చేందుకు సమగ్రభూసర్వే, రైతుకమిటీలు ప్రకటిస్తున్నారన్నారు. పోలవరం ముంపుప్రాంతాలు పెరగకుండా రాష్ట్రప్రభుత్వం అడ్డుకోవాలన్నారు. ప్రాజెక్టు పట్ల తమకు వ్యతిరేకంలేకున్నా జిల్లాకు ముంపు గండాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పాలేరు రిజర్వాయర్ పాతకాల్వకు అంచనాలుపెంచి టెండర్లు నిర్వహించటంద్వారా కాంట్రాక్టర్లకు లబ్ధికలిగించారని తనకు ఫిర్యాదుచేశారని, దీనిపై ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. అభివృద్ధిలో ఖమ్మం కార్పొరేషన్ విఫల మైందన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అయితం సత్యం, నాయకులు కట్ల రంగారావు, తోట సత్యం, మైనార్టీసెల్ నాయకులు తాజుద్దీన్, ఫజల్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

వక్తృత్వ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

వేంసూరు: స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వక్తృత్వ పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వేంసూరు ఎంపీడీవో బండి గోవిందరావు బుధవారం తెలిపారు. పోటీలలో విజయం సాధించిన అభ్యర్థులకు అక్టోబర్ 2వ తేదీన జిల్లా స్థాయిలో పురస్కారాలు అందచేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను దగ్గర్లోని మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించవలసిందిగా తెలిపారు. దరఖాస్తులకు అక్టోబర్ 2వతేదీ దరఖాస్తులకు చివరి తేదీగా తెలిపారు.

రేపటినుంచి రైతు సమన్వయ సమితి గ్రామసభలు

కల్లూరు: రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన, వ్యవసాయ రంగాన్ని పటిష్టం చేసే చర్యల్లో భాగంగా కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నుంచి రైతు సమన్వయ సమితి గ్రామసభలు నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి కమతం సురేష్ తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. మండలపరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ శాఖ తరపున రెవెన్యూ గ్రామాలవారీగా రైతు జాబితాలను రూపొందించి సిద్ధంచేసినట్టు ఆయన వివరించారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా రైతు సమన్వయ సమితిలు ఏర్పాటుచేసేందుకుగాను సెప్టెంబర్ ఒకటవతేదీనుంచి 9వ తేదీవరకు మండలంలోని రెవెన్యూ గ్రామాలవారీగా గ్రామ సభలు నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందిస్తున్నామని తెలిపారు. ఈగ్రామసభల్లో గతంలో జరిపిన సమగ్ర సర్వే ప్రకారం రైతుల జాబితా వివరాలను తెలియపరుస్తామన్నారు. గతంలో వ్యవసాయశాఖ చేసిన సర్వే ఆధారంగా మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 39వేల ఎకరాలను సాగుభూమిగా గుర్తించగా, 14,756 మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని సర్వేలో తేలిందన్నారు. రైతు సమన్వయ సమితిల ఏర్పాటుపై గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ అధికారుల సదస్సులో తీసుకునే నిర్ణయాల ఆధారంగా శుక్రవారం నుంచి జరిగే గ్రామసభల్లో విధి, విధానాలు అవలంభిస్తామన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామం నుంచి అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని రైతు సమన్వయ సమితిలో అన్ని సామాజికవర్గాల నుంచి 15 మంది రైతులను ఎంపికచేస్తూ రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీల్లో ఐదుగురు మహిళా రైతులకు కూడా ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. సెప్టెంబర్ 15 నంచి డిసెంబర్ 31వరకు భూముల రీసర్వే, రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం జరుతుందన్నారు. ఈ ప్రక్రియ ఆధారంగా రైతులకు వ్యవసాయ సాగులో ప్రభుత్వం తరపున పంటలు పండించేందుకు సగటున ఎకరానికి రూ.4వేలు ఆర్థిక సాయం అందుతుందన్నారు.

వ్యవసాయాధికారి కమతం సురేష్


సురేష్

స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన కళాశాల విద్యార్థులు

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వ కళాశాలకు చెందిన 2016-17 విద్యాసంవత్సరంలో సీఈసీ గ్రూపుకు చెందిన ముగ్గురు విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనిత తెలిపారు. సీఈసీ గ్రూపు విద్యార్థులు ఎస్‌కె.ఆరిఫ్ పాషా, బి.శిరీష, వై.నాగరాణి ఎంపికయ్యారని తెలిపారు. వీరికి డిగ్రీలో సంవత్సరానికి రూ.10వేల చొప్పున, పీజీలో రూ.20వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ను అందజేస్తుందని తెలిపారు. స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులకు కూడా కష్టపడి చదవాలన్నారు. ఆరిఫ్‌పాషాకు 863, బి.శిరీషకు 824, వై.నాగరాణికి 801మార్కులు సాధించినట్టు తెలిపారు. వీరిని కళాశాలలో అభినందించారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు విద్యాభారతి విద్యార్థుల ఎంపిక

సత్తుపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్ అవార్డుకు సత్తుపల్లి పట్టణంలోని విద్యాభారతి జూనియర్ కళాశాలకుచెందిన గాయం దీప, నీలం దేవీపుష్ప ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ జీవీ.లింగారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరక్టర్ ఎం.సత్యనారాయణ, అధ్యాపకులు దీప, దేవి విద్యార్థులను అభినందించారు.

నరుకుళ్ల కుటుంబాన్ని పరామర్శించిన మువ్వా

పెనుబల్లి: కారాయిగూడెం గ్రామానికి చెందిన నరుకుళ్ల రాధాకృష్ణ తల్లి వెంకటనర్సమ్మ మృతిచెందగా ఆయన కుటుం బాన్ని గురువారం డీసీసీబీ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తంచేశారు. వెంకటనర్సమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో నీలాద్రి దేవాలయం కమిటీ ఛైర్మన్ చింతనిప్పు సత్యానారాయణ, కారాయిగూడెం సొసైటీ ఛైర్మన్ చింతనిప్పు శ్రీనివాసరావు, పెనుబల్లి సొసైటీ ఉపాధ్యక్షుడు మరకాల నరోత్తమరెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు చీకటి మోహన్‌రావు, తోటకూరి రామకృష్ణ, మొగలిపువ్వు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


నరుకుళ్ల కుటుంబాన్ని పరామర్శిస్తున్న మువ్వా

కరాటేలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

పెనుబల్లి: అంతర్జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించిన కేదాసి పవన్‌కృష్ణ, బోడ పుట్ల శివ, బానోతు నరసింహనాయక్‌ను అభయ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీవేద పాఠశాలలో సన్మానించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ కరాటేలో ప్రతిభచూపి పతకాలు సాధిస్తున్న విద్యార్థులు, మాస్టర్ శ్రీకాంత్‌ను క్లబ్‌సభ్యులు అభినందించారు. రానున్న రోజుల్లో పలు పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి కళాశాల, పాఠశాల, గ్రామానికి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో అభయ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అన్నపురెడ్డి సుంకయ్య, కార్యదర్శి చలమాల నరసింహారావు, డీసీ సభ్యులు ముక్కర భూపాల్‌రెడ్డి, వేముల నరసింహారావు, బైరెడ్డి రాఘవరెడ్డి, మునేశ్వరరావు, నాగేశ్వరరావు, శ్రీవేద పాఠశాల ప్రిన్సిపాల్ జోసెఫ్ చౌదరి పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక


లాటరీ తీస్తున్న దృశ్యం

సత్తుపల్లి రూరల్: ఎస్సీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులను లాటరీ పద్ధతి ద్వారా ఎన్నుకున్నారు. బుధవారం సత్తుపల్లి పట్టణంలోని ఐకేపీ కార్యాలయం వద్ద పట్టణ ఎస్సీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులను నగరపంచాయతీ ఛైర్‌పర్సన్ దొడ్డాకుల స్వాతిగోపాలరావు లాటరీ పద్ధతి ద్వారా ఎంపికచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 190 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయితీ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు అద్దంకి అనిల్ కుమార్, వరలక్ష్మి పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

తల్లాడ: క్రీడలు మానసికోల్లాసానికి తోడ్పడతాయని తల్లాడ జడ్పీటీసీ సభ్యుడు మూకర ప్రసాద్ అన్నారు. బుధవారం మండలస్థాయి బాలుర పాఠశాలల క్రీడలను తల్లాడ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చదువుతోపాటు క్రీడల్లో రాణించటంవల్ల ఉజ్వలభవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతిభకనబరిచిన పాఠశాలల విద్యార్థులను జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికచేశారు. ఈకార్యక్రమంలో ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్, మండలస్థాయి పాఠశాలల క్రీడల కన్వీనర్ రామారావు, పీఈటీలు సీహెచ్ రాంబాబు, నర్సింహారావు, కవిత, పాపారావు, స్టీఫెన్, జగన్నాథరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

దిరైజ్‌ఆఫ్ తెలంగాణ హీరోగా కాంపల్లి

తల్లాడ: తెలంగాణ కళాపరిషత్ ఆధ్వర్యంలో అమ్మలు ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న దిరైజ్‌ఆఫ్ తెలంగాణ సినిమాలో హీరోగా తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కాంపల్లి బాలకృష్ణ(బాలు)కు అరుదైన అవకాశం దక్కింది. సినిమాకు వర్ధమాన దర్శకుడు పగిడిపల్లి రాజారావు దర్శకత్వం వహిస్తున్నారు.

సత్తుపల్లిలో భారీవర్షం


కాకర్లపల్లి రోడ్డుపై పారుతున్న వరదనీరు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంతో పాటు మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. ఎడతెరపి లేకుండా గంటన్నరకుపైగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణ శివార్లలోని కాకర్లపల్లి రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న వంతెన వద్ద వరదనీరు రోడ్డుపై పొంగిపొర్లడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మంగళవారం రాత్రి 39.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

సత్యనారాయణపురంలో పట్టపగలే చోరీ


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం పాకలగూడెం గ్రామపంచాయతీ శివారు గ్రామమైన సత్యనారాయణపురంలో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధరావత్ బాలాజీ ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాడు. భార్య బంధువుల ఇంటికి గంగారం వెళ్లగా... ఇంటి వెనుక తలుపును బద్దలుకొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడి, బీరువాను కొల్లకొట్టి రూ.80వేలు నగదు అపహరించినట్టు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఖమ్మం నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలను సేకరించారు.

మీ సేవలో 'ఆంధ్రజ్యోతి'

పాఠకులకు 'ఆంధ్రజ్యోతి'ని మరింత చేరువ చేయడానికి స్థానిక విలేకరుల ఫోన్ నంబర్లను ఇస్తున్నాం.. అవినీతి, అక్రమాల సమాచారాన్ని అందించండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం

సత్తుపల్లి	9985411343
సత్తుపల్లి రూరల్	8501943215
వేంసూరు	9966944799
పెనుబల్లి	9949931415
కల్లూరు	9491541765
తల్లాడ	9866673481

ఘనంగా గణేష్ నవరాత్రులు


అన్నదానం దృశ్యం

తల్లాడ: మండలకేంద్రమైన తల్లాడలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ కొత్తకాంప్లెక్స్ వద్ద ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ ఎంపీపీ సరికొండ లక్ష్మీపద్మావతి, వ్యాపార ప్రముఖులు కటికి నర్సింహారావు, కొత్తగుండ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక దగ్గుల పుల్లారెడ్డి మండపం వద్ద హనుమాన్‌చాలీసా పారాయణం, కూరగాయలతో గణేష్ అలంకరణ కార్యక్రమం నిర్వహించారు.

కల్లూరులో: కల్లూరులోని ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు సమీపాన గల భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా భక్తులు నిర్వహించిన కోలాటం పలువురుని ఆకట్టుకుంది. స్థానిక సర్పంచి భరోతు సుజాత, మండల టీఆర్ఎస్ నాయకులు కీసర వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కృష్ణయ్య బంజర్ గ్రామంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు భూక్యా రాము నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ద బోయిన దుర్గాప్రసాద్, మద్దినేని లోకేష్, దేవర శేషులు పాల్గొన్నారు.

వేంసూరులో: మర్లపాడు గ్రామంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో బీమిరెడ్డి చెన్నకేశవరెడ్డి, గొర్ల రాంమోహన్‌రెడ్డి, కొండేటి చెన్నయ్య పాల్గొన్నారు.


తల్లాడలో పూజలు చేస్తున్న ఎంపీపీ లక్ష్మీపద్మావతి, కల్లూరులో అన్నదానం

సినిమాలు

సత్తుపల్లి

● శ్రీనివాస	జయ జానకీ నాయక
● శ్రీబాలాజీ	అర్జున్‌రెడ్డి
● సాయి బాలాజీ	నేనే రాజు నేనే మంత్రి
శ్రీకృష్ణ	వివేకం

జ్వరాల తీవ్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టాలి

● పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి: సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్

చింతకాని: ప్రజలు జ్వరాలతో ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రభుత్వం వెంటనే ప్రత్యేక దృష్టి పెట్టి ఆయాగ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలపరిధిలోని నాగులవంచ గ్రామంలో బుధవారం జ్వరపీడుతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండి జ్వరాలు సోకిన గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి పారుశుధ్య పనులు చేయించాలన్నారు. నిధులు కేటాయించకుండా.., కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే పారుశుధ్య లోపంతో జ్వరాలు వస్తున్నాయని వారిని బలిచేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నాగులవంచ గ్రామంలో ప్రతిరోజూ విద్యుత్ గంటల కొద్దీ కోతలు పెట్టడం వల్లే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని తెలిపారు. ఫలితంగా గ్రామం లో జ్వరపీడుతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం స్పందించి గ్రామంలో సమస్యలను పరిష్కరించి జ్వరపీడుతులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు సామినేని రామారావు, మడుపల్లి గోపాల్‌రావు, పడిశాల లక్ష్మీనారాయణ, తోటకూరి వెంకటనర్సయ్య, అనగాని యల్లయ్య పాల్గొన్నారు.


జ్వరపీడుతులను పరామర్శిస్తున్న దృశ్యం

పర్యాటక ప్రాంతంగా జమలాపురం పెద్దచెరువు

ఎర్రుపాలెం: జమలాపురం పెద్దచెరువును త్వరితగతిన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. బుధవారం మండల నాయకులు అధికారులతో కలసి పెద్దచెరువు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూపురేకలు లేకుండా దట్టమైన ముళ్లచెట్లతో రైతులు పడుతున్న ఇబ్బందులు చూసి తాను ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయించి చెరువుకు సిమెంట్‌వాల్స్, విశాలవంతమైన రోడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం చెరువును పరిశీలించి అధికారులతో పనులపై చర్చించి సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీటీవో సుమన్ చక్రవర్తి ఈఈ సంషుద్దీన్, ఏఈఈ రామకృష్ణ, మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బండారి నరసింహారావు, కడియం శ్రీనివాసరావు, శీలం నర్శిరెడ్డి, యన్నం వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారావు పాల్గొన్నారు.


పెద్దచెరువును పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

పత్తిలో పురుగు ఉధృతిని నిర్ధారించేందుకు లింగాకర్షక బుట్టలు

తల్లాడ: పత్తిపంటను ఆశించే గులాబిరంగు పురుగు ఉధృతిని నిర్ధారించేందుకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేయాలని వ్యవసాయశాఖ సత్తుపల్లి డివిజన్ సహాయ సంచాలకుడు యు.నర్సింహారావు సూచించారు. బుధవారం తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో పత్తిపైరును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శీలం చంద్రశేఖర్‌రెడ్డి, ఆత్మ డైరెక్టర్ సామినేని రామఅప్పారావు, గొల్లమందల రామారావు, రైతులు పాల్గొన్నారు.


బుట్టలను ఏర్పాటుచేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మీనవోలు పాఠశాలకు బెంచీల అందజేత

ఎర్రుపాలెం: మండలపరిధిలోని మీనవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గ్రామస్థులు పదిహేను వేలరూపాయల బెంచీలను బుధవారం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీపీ చావా ఆరుణ మాట్లాడుతూ పాఠశాల ఆభివృద్ధికి కృషిచేసిన దాతలను అభినందించారు. ఈకార్యక్రమంలో దాతలు స్టాలిన్, దువల రవి, విలిప్ ఎం.వెంకటేశ్వర్లు పాలొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శిక్షణ కలెక్టర్

వైరా: ట్రైనీ కలెక్టర్ జెండగే హన్మంతు కొండిబా రెండువారాల శిక్షణ కోసం బుధవారం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ కోట రవికుమార్‌తోపాటు ట్రైనీ కలెక్టర్ జెండగే హన్మంతు కొండిబా కూడా తహసీల్దార్ బాధ్యతలు నిర్వహిస్తారు. రెండువారాలు ఇక్కడ శిక్షణ పొందుతారు. రెవెన్యూ అంశాలపై శిక్షణ తీసుకుంటారు.

ఆధ్వానంగా ఓసీ రోడ్డు

ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు

కారేపల్లి: మండలపరిధిలోని ఉసిరికాయలపల్లి పంచాయతీ పరిధిలోని ఓసీ వద్ద రహదారి ఆధ్వానంగా తయారైందని వెంటనే రోడ్డును ఏర్పాటుచేయాలని ఈప్రాంతప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, విద్యార్థులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు.. ఇల్లెందు-కారేపల్లి ప్రధాన రహదారిలో ఈద్ధ వద్ద నుంచి ఇలెందు వరకు గల రెండు కిలోమీటర్ల వరకు సింగరేణి సంస్థ గతంలో ఏర్పాటుచేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదగా మారి వాహనాలు ప్రమాదాలకు గురౌతున్నాయని గ్రామస్థులు రోస్తారోకోకు దిగారు. రోడ్డుపై రాస్తారోకో జరుగుతున్న విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మదన్‌లాల్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పర్సా పట్టాభిరామారావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో మాటాడ్లి వెంటనే సింగరేణి సంస్థ అధికారులను సంఘటన స్థలానికి పిలిపించి మాట్లాడారు. వారం పదిరోజుల్లో కొత్త రోడ్డు ఏర్పాటు చేస్తామని సింగరేణి సంస్థ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందళన విరమించారు.

గణితశాస్త్రం ప్రాముఖ్యతను తెలియజేసేందుకు మ్యాథ్స్‌క్లబ్

మధిర: గణితశాస్త్రం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేస్తూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయటానికి మ్యాథ్స్ క్లబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఈవో వై.ప్రభాకర్ తెలిపారు. బుధవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో మ్యాథ్స్‌క్లబ్ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మ్యాథ్స్‌క్లబ్ లోగోను ఆవిష్కరించారు. మ్యాథ్స్ యొక్క మెళకువలను చిన్ననాటి నుంచే విద్యార్థులకు చేర్పించటం వల్ల ఉన్నత చదువుల్లో రాణించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కిరణ్‌కుమార్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


లోగోను ఆవిష్కరిస్తున్న ఎంఈవో

తహసీల్దార్‌కు కోఆర్డినేటర్ల వినతి: తహసీల్దార్

బోనకల్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సాక్షరభారత్ కోఆర్డినేటర్లు బుధవారం తహసీల్దార్ జి.సుదర్శన్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మండల కోఆర్డినేటర్ మాట్లాడుతూ 12నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో వాణి, షబానా, స్వర్ణ పాల్గొన్నారు.

పింఛన్లలో పారదర్శకత కోసమే ఆన్‌లైన్ అనుసంధానం

బోనకల్: ఫించన్లలో పారదర్శకత కోసమే ఆన్‌లైన్ అనుసంధానం వేగవంతం చేస్తున్నట్టు డీఆర్‌డీవో డీపీఎం శ్రీకాంత్ తెలిపారు.బోనకల్ మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన డీఆర్‌డీఏ ఎపీవో రమణతో కలసి మండల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్‌దారుల ఆధార్, ఖాతాలతోపాటు ఫోన్ నంబర్లను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. అర్హులైన వారికి సకాలంలో పింఛన్ అందజేస్తామన్నారు. ఈసమావేశంలో ఎంపీడీవో ఎం.విద్యాలత, ఏపీఎం పద్మాలత పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

తల్లాడ: ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తల్లాడలో ప్రదర్శన, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు తాతా భాస్కర్‌రావు మాట్లాడుతూ పోడు, ఇనామ్, పంచరాయి భూములను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేద రైతులకు భూములపై యాజమాన్య హక్కు కల్పించి ప్రభుత్వ సబ్సిడీ అందేలా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, గుంటుపల్లి వెంకటయ్య, నారికొండ అర్జున్‌రావు, ఐనాల రామలింగేశ్వరరావు, సూరంపల్లి గోపాలరావు, నల్లమోతు మోహన్‌రావు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

దాచాపురం విద్యార్థులకు పాదరక్షలు, పుస్తకాల ఎంపిణీ

వైరా: మండలంలోని దాచాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు తమ తండ్రి, స్వాతంత్ర్య సమరయోధుడైన అయిలూరి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం కుమారులు శ్రీనివాసరెడ్డి, మాధవరెడ్డి బుధవారం ఎమ్మెల్యే మదన్‌లాల్ చేతులమీదుగా పాదరక్షలు, పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమంలో అయిలూరి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ వేల్పుల శౌరి, ఎస్ఎంసీ చైర్మన్ గరిడేపల్లి శ్రీను, హెచ్ఎం కె.గురవయ్య, గరికపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు అయిలూరి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొమర్రాజు పాండురంగారావు, కూరగాయల వెంకయ్య, గూడూరు మాధవరెడ్డి, టీఆర్ఎస్ నాయకులు మచ్చా వెంకటేశ్వరరావు, వనమా విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.


పాదరక్షలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

విద్యారంగ సమస్యలను పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

మధిర: రాష్ట్రంలో, జిల్లాలో విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు ఆరోపించారు. స్థానిక బోడేపూడి భవన్‌లో బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి వర్క్‌షాపు జిల్లా అధ్యక్షుడు చింతల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ గత మూడుసంవత్సరాల టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో విద్యారంగం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టివేయబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల బకాయిలు రాష్ట్రంలో రూ.4వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, కొత్తగా ఏర్పాటుచేసిన గురుకులాల్లో విద్యార్థులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని, హాస్టల్స్‌లో మెస్‌బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వ కళాశాలలకు నిధులు విడుదల చేయటం లేదని విమర్శించారు. ఇలా అనేక సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటున్నప్పటికీ రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో కాని ప్రజాప్రతినిధులు ఎవరూ కూడా కనీసంగా స్పందించటం లేదని విమర్శించారు. కేవలం సంపాదన కోసమే ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నారన్న భావన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి.నాగరాజు, జిల్లా నాయకులు అశోక్, హేమంత్, గోవర్ధన్, భవాని, మధు, రమ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

రోడ్డుప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎదిరగుట్టల వద్ద మోటార్ సైకిల్, ఆర్టీసీ బస్ ఢీ

మృతుల్లో ఒకరు సూరవీడు పంచాయతీ గుమస్తా

చర్ల:మోటార్‌సైకిల్, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు చనిపోయారు. ఈ విషాద సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పరిధిలోని ఎదిరుగుట్టల వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. చర్ల నుంచి సూరవీడు వెళ్తున్న మోటార్ సైకిల్ వెంకటాపురం నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్‌టీసీబస్ ఢీ కొట్టుకోవడంతో మోటార్ సైకిల్ పై వెళ్తున్న వెంకటాపురం మండలం సూరవీడు గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. గ్రామానికి చెందిన కెక్కెం శివ (25) సూరవీడు పంచాయతీ గుమస్తాగా పనిచేస్తున్నాడు. బుధవారం బ్యాంకు పని నిమిత్తం చర్ల వచ్చాడు. అదేగ్రామానికి చెందిన ముక్కెర లక్ష్మణ రావు (50) కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంగా ఉండండతో ఉదయం చర్లకు వచ్చాడు. వైద్య పరీక్షలు చేయించుకుని సూరవీడు బయలు దేరాడు. కాగా ఇదే క్రమంలో కెక్కెం శివ కలవడంతో ఆ మోటార్ సైకిల్‌పై ఇద్దరూ ఇంటికి బయలుదేరారు. మరో 10 నిమిషాల్లో సూరవీడు చేరుకుంటారు అనగా ఎదురు గుట్టల మలుపు వద్ద భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్, మోటార్ సైకిల్ ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ఉన్న శివ, లక్ష్మణ రావు అక్కడికక్కడే మృతి చెందారు. చర్ల ఎస్ఐ సత్యానారాయణ ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతుడు శివకి భార్య, రెండేళ్లకుమార్తె ఉన్నారు.లక్ష్మణరావుకి భార్య ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు.



ఘటన ప్రదేశంలో మృతదేహాలు

రహదారిపై విచ్చలవిడిగా నిలిపిన లారీలు

పోలీసులు అద్దాలు ధ్వంసం చేశారని డ్రైవర్ల నిరసన

సారపాక: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ పీఎస్ పీడీ కర్మాగారానికి వచ్చే లారీలు రహదారిపై ఇష్టానుసారంగా నిలుపుతుండటంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ సమయంలో లారీలు రహదారిపై నిలిపి ఉండటం, మరో వైపు గణేష్ నిమజ్జనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వాహనాలు వచ్చే అవకాశం ఉండటంతో అక్కడికి చేరుకున్న బూర్గంపాడు పోలీసులు వాటిని అక్కడ నుంచి తరలించాలని హెచ్చరించినట్టు సమాచారం. ఈ క్రమంలో పలు లారీల అద్దాలను సైతం పోలీసులు ధ్వంసం చేశారని ఆరోపిస్తూ డ్రైవర్లు నిరసన తెలిపారు. తాము మణుగూరు క్రాసు రోడ్డు అటవీ ప్రాంతంలో నిలిపివేసిన లారీలపై పోలీసులు అద్దాలు ధ్వంసం చేశారని డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సారపాక ఐటీసీ కర్మాగారానికి రోజూ వందల సంఖ్యలో లారీలు వస్తూ పోతూ ఉన్న నేపథ్యంలో ఐటీసీ కర్మాగారానికి వచ్చిన లారీలు పార్కింగ్ చేసేందుకు లారీ యార్డు లేకపోవడం ఉన్న లారీ యార్డు వివాదాస్పదంగా ఉండటంతో వచ్చిన లారీలు రోడ్డుపైనే రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి నెలకొంటోంది. ఈ క్రమంలో బుధవారం క్రాసు రోడ్డు అటవీ ప్రాంతంలో రోడ్డుపై ఉన్న లారీల అద్దాలు పోలీసులు ధ్వంసం చేసినట్లు లారీ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయం వాట్సప్‌లో హల్‌చల్ చేయడంతో వివాదాస్పదమైంది. ఈవిషయంపై బూర్గంపాడు ఎస్ఐ గుర్రం ఉదయ్‌కిరణ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా గణేష్ నిమజ్జన పార్కింగ్ ఏర్పాట్లలో భాగంగా బందోబస్తును పరిశీలన సమయంలో జాతీయ రహదారిపై రెండు లారీలు నిలిపి ఉన్నాయన్నారు. డ్రైవరును పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి చేసి మరోసారి పార్కింగ్ చేస్తే అపరాధ రుసుం వేస్తామని, అనంతరం కేసు నమోదు చేస్తామని హెచ్చరించామన్నారు. అంతే కానీ తాము రోడ్డుపై ఉన్న ఏ ఒక్క లారీ అద్దాలు కూడా ధ్వంసం చేయలేదని తెలిపారు.



రోడ్డుపై నిలిపిన లారీలు

అశ్వారావుపేట మీదుగా గంజాయి రవాణా

- సేఫ్‌జోన్‌గా ఎంచుకున్న స్మగ్లర్లు
- ఛత్తీస్‌గఢ్, రంపచోడవరం, ఒడిషా నుంచి సరఫరా
- నిఘాపెంచిన పోలీసులు

అశ్వారావుపేట:ఇటీవల గంజాయి, పలు రకాల మాదక ద్రవ్యాల అక్రమ రవాణా భారీగా పెరిగింది. దీంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసులు దీనిపై నిఘాను పెంచారు. ఛత్తీస్‌గఢ్, భద్రాచలం, రంపచోడవరం అటవీ ప్రాంతాలు, ఒడిషా రాష్ట్రాల నుంచి గంజాయి వివిధ ప్రాంతాలకు నిత్యం భారీ ఎత్తున అక్రమరవాణా అవుతోంది. స్మగ్లర్లు ఎన్నిసార్లు పట్టుబడినప్పటికీ కొత్తకొత్త విధానాలు, కొత్త రూట్లలో రవాణా చేస్తునాన్రు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇటీవల మాదక ద్రవ్యాలపై రైళ్ళు, రోడ్డు మార్గాలలతో తరలించే గంజాయిపై దాడులు అధికమయ్యాయి. దీంతో స్మగ్లర్లు అశ్వారావుపేట రూట్‌ను సేప్‌జోన్‌గా ఎంచుకున్నారు. ఇటు ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి భద్రాచలం, కుక్కునూరు, అశ్వారావుపేట మీదుగ హైదరాబాదు, చెన్నై వంటి పట్టణాలకు భారీగా అక్రమరవాణా చేస్తున్నారు. ఒడిషా, తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం, నర్సీపట్నం, విశాఖపట్టణం ఏజెన్సీ ప్రాంతాల నుంచి అశ్వారావుపేట మీదుగ రాజధానికి గంజాయిని రవాణా చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఏడాది క్రితం ఒక వ్యాన్‌లో సుమారుగా రూ.ఐదులక్షల విలువైన గంజాయి ప్యాకింగ్‌లను రవాణా చేస్తూ సరిహద్దులోని చెక్‌పోస్టువద్ద దొరకటం తెలిసిందే. అశ్వారావుపేట ప్రాంతంలో ఈ తరహా వ్యాపారం జరగదని, పోలీసుల నిఘా ఉండదని అక్రమ వ్యాపార లావాదేవీలు, రవాణాకు సేప్‌జోన్‌గా స్మగ్లర్లు భావిస్తుంటారు. అవసరమైతే ఈ ప్రాంతానికి వీటిని ముందుగా చేరవేసి, అక్కడ నుంచి వేరే ప్రాంతానికి చేరవేసుకునేలా నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు స్మగ్లర్లు ఈ ప్రాంతంలోని ఏజెంట్లుగా నియమించుకొని, వారి సహకారంతో గంజాయి వ్యాపార లావాదేవీలను నిర్వహిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. నిత్యం లక్షల్లో ఈ అక్రమ వ్యాపారం జరుగుతుందని అంటున్నారు. పోలీసులు దీనిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయకపోతే భవిష్యత్‌లో ఈ ప్రాంతంలోను ఈ అక్రమ వ్యాపారలావాదేవీల జోరు పెరిగిపోతుందనే ఆందోళన వ్యక్తం అవుతుంది.

నిఘా కొనసాగుతుంది

●అశ్వారావుపేట సీఐ రవికుమార్

నిత్యం నిఘా కొనసాగుతుంది.తరుచూ వాహనాల తనిఖీ చేస్తున్నాం. గంజాయి రవాణా చేస్తూ దొరికితే కఠిన చర్యలు తీసుకుంటాం.

'పైసల వసూల్'పై తహసీల్దార్‌కు నివేదిక

దుమ్ముగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం తూరుబాక వీఆర్‌వో రమేష్‌పై విచారణ నివేదికను తహసీల్దార్ లక్ష్మణ్‌సింగ్‌కు అందజేశారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన పైసల వసూల్ కథనంపై తహ సీల్దార్ విచారణకు ఆదేశించారు. ఐర్ఐ ఆనంద్ బుధవారం బాధితుల ఆరోపణలపై మంగళవారం సింగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఈ నివేదికను తహసీల్దార్‌కు అందజేయగా, దీన్ని ఆర్డీఓకు అందజేస్తామని తెలిపారు. కాగా దీనిపై జిల్లాస్థాయి అధికారిచే మరోమారు సమగ్ర విచారణ జరిపించాలని బాధిత గిరిజనులు బుధవారం తహసీల్దార్ లక్ష్మణ్‌సింగ్‌ను కలసి డిమాండ్ చేశారు. రెవిన్యూ అధికారులు జరిపిన విచారణ ఆద్యంతం తప్పుచేసిన వాళ్లను సమర్థించేలా ఉందని వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మ్యుటేషన్లు, సాదాబైనామాల పేరిట ఎవరెవరి వద్ద ఎంతెంత వసూలు చేశారో పూర్తిస్థాయి వివరాలతో కూడిన దరఖాస్తును తహసీల్దార్‌కు అందజేశారు. సమగ్రవిచారణ జరిపి వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని బాధితులు నూపా శీతయ్య, వర్సా వెంకటేష్, నూపా రాంబాబు వినతిపత్రం ఇచ్చారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

పోలీస్‌స్టేషన్ ఎదుట యువతి ఆత్మహత్యాయత్నం

కామేపల్లి: పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన కామేపల్లి మండల పరిధిలోని తాళ్ళగూడెంలోని ఇల్లెందు-ఖమ్మం ప్రదాన రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని జాస్తిపల్లి గ్రామానికి చెందిన నంద్రు సురేష్ అనే యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడితే పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించలేదని, అన్యాయంగా తమ కుటుంబసభ్యులపై కేసులు పెట్టారని కన్నీటిపర్యంతమైంది. పోలీసుల తీరును నిరసిస్తూ కిరోసిన్ పోసుకోని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎస్ఐ రంజిత్‌కుమార్ ఆమెతో మాట్లాడి ఆందోళనకారులను శాంతింపజేశారు.

కోతుల దాడిలో యువకుడికి గాయాలు

ఏన్కూరు: మండల పరిధిలోని టీఎల్‌పేట గ్రామంలో బుధవారం సాయంత్రం కోతుల దాడిలో కొవ్వూరి మహేష్ అనే యువకుడికి గాయాలయ్యాయి. మహేష్ తన ఇంట్లోనుంచి బయటకు వస్తుండగా కోతులు దాడిచేశాయి. దీంతో చేతికి రెండుచోట్ల గాయాలవటంతో వెంటనే ఏన్కూరులోని పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు. ఇప్పటికే టీఎల్‌పేటతో పాటు ఏన్కూరు, తిమ్మారావుపేట తదితర గ్రామాల్లో కోతుల దాడిలో పలువురు గాయాల పాలైన సంగతి తెలిసిందే. పంచాయతీ పాలకులు స్పందించి కోతుల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



గాయపడిన మహేష్

శిఖం ఆక్రమణపై వీఆర్వో మౌనం

ఆగ్రహం వ్యక్తం చేసిన కప్పలకుంట గ్రామస్థులు

జూలూరుపాడు: చెరువు శిఖాన్ని కొంత మంది రైతులు ఆక్రమించుకొని సాగు చేపట్టినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో కొందరు రైతులు రెవెన్యూ అధికారుల తీరును ఎండగట్టారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు గ్రామాన్ని వీఆర్వో బీక్లూ,వీఆర్‌ఏ రామారావు సందర్శించారు. చెరువు శిఖం ఆక్రమణకు గురైనా ఎందుకు పట్టించు కోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 15మంది రైతులు చెరువు శిఖాన్ని ఆక్రమిం చుకొని పంటలను సాగు చేయడం తో తమ పశువులు మేతకు వెళ్లె పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కనీసం నీళ్లు తాగేందుకు దారి లేకుండా పోయిందని చెప్పారు. పశువులు తోలుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నామని వివరించారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే చెరువు శిఖానికి రక్షణ లేకుండా పోయిందని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా వీఆర్‌వో మాట్లాడుతూ చెరువు శిఖాన్ని ఆక్రమించుకున్న రైతులను గుర్తించి భూమిని స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో రైతులు యల్లంకి చిన్న నాగేశ్వరరావు, గాదె గోవర్ధన్, సాయిల కృష్ణార్జున్‌రావు, సీహెచ్.రామారావు, ఎస్. రామారావు, నున్నా రంగారావు పాల్గొన్నారు.



జూలూరుపాడులో వీఆర్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 4

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. పెద్దల ఆరోగ్యం కొంత కలవరపెడుతుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బోధన, రవాణా రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సాంకేతిక కోర్సుల్లో చేరేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. కీలక సమాచారం అందుకుంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంటికి అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం కలవరపెడుతుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు, సంభాషణలు ఉల్లాసం కలిగిస్తాయి. భాగస్వామ్యాలు లాభిస్తాయి. విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఎంతో కాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబ వ్యవహారాల కారణంగా అ శాంతికి గురవుతారు

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): విద్యార్థులకు శుభప్రదం. విలువైన పత్రాలు అందుకుంటారు. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. రవాణా, బోధన రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. అదనపు ఆదాయం సమకూర్చుకుంటారు. బ్యాంకులు, చిట్‌ఫండ్‌ల రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. కొత్త వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయగలుగుతారు. కళలు, సాహిత్యం, బోధన రంగాల వారికి ప్రోత్సాహకరం. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పైచదువులు, విదేశీ ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. రుణాలు మంజూరవుతాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. గతం గుర్తు చేసుకుంటారు. ఆరోగ్యం మందగించే అవకాశం ఉంది.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వేడుకల్లో బంధుమిత్రులను కలుసుకుంటారు. షాపింగ్‌కు అనుకూలం. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఆలయ సమాచారం..

● జమలాపురం వెంకన్న



కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
టీటీడీ సత్రం	12	00
సీహెచ్ఎన్ఎస్	10	08

సంప్రదించాల్సిన ఫోన్ నెం: 08749-279855
ఈవో రమణమూర్తి: 94910 00705
ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ : 99895 07300

- తెల్లవారుజామున 4.30గంటలకు ఆలయాన్ని తెరుస్తారు.
- 5గంటలకు తీర్థబిందెలు తెచ్చే కార్యక్రమం.
- 6.30కి మంగళహారతి, మంత్రపుష్పం సమర్పణ.
- ఉదయం 7.00గంటలకు బాలభోగ నివేదన.
- 7.10 నుంచి 12గంటల వరకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు.
- 10.30 గంటలకు స్వామివారి నిత్య కల్యాణం.
- సాయంత్రం 3గంటల నుంచి తిరిగి ఆర్జిత సేవలు.

కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
కాటేజీలు	26	18
వందగదుల సదనం	62	25
శ్రీరామ సదనం	18	13
టీటీడీ సదనం	26	16
సౌమిత్రి సదనం	30	08

సంప్రదించండి..
దేవస్థానం కేంద్రీయ విచారణ కార్యాలయం : 08743-232467, 7660007671

● భద్రాచలం రామయ్య



తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 వరకు, ఉదయం 7 గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 8.30 వరకు సర్వదర్శనం.

ప్రత్యేక దర్శనం టిక్కెట్టు ధర ఒకటికి : రూ.20

స్థానికానికి సమాయత్తం కావాలి

ఎన్నికల్లో అవినీతి, అక్రమాలను నిరోధించాలి ● స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్షించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి



సమావేశానికి హాజరైన ఇరుజిల్లాల అధికారులు

ఖమ్మం కలెక్టరేట్: 'భావితరాలకు నీతివంతమైన సమాజాన్ని అందించేందుకు స్థానికసంస్థల్లో అవినీతి అక్రమాలకు తావివ్వకుండా సన్నాహాలు చేయాలి.. స్థానికసంస్థల ఎన్నికలకు మూడు నెలల ముందుగానే సిద్ధం కావాలి' అని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి నాగిరెడ్డి అధికారులకు ఉద్భోదించారు. బుధవారం ఖమ్మంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో ఖమ్మ, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు లోకేష్‌కుమార్, రాజీవ్‌గాంధీ హన్మంతుతో పాటు ఖమ్మం పోలీస్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారులతో వచ్చే ఏడాది నిర్వహించనున్న స్థానిక పోరు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన వనరులను సమకూర్చుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సుల ను, ఈవీఎంలను ముందుగానే సిద్ధంచేసుకోవాలన్నారు. రెండు జిల్లాలో అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు ఎన్నికల నిర్వహణ సిబ్బంది, పోలీస్ అధికారుల వివరాలను ముందుగానే సమర్పిం చాలన్నారు. పోలింగ్ కేంద్రాల జాబితా, ఓటర్ల జాబితా జనవరి 2018 నాటికి ముందస్తుగానే సిద్ధం చేయాల న్నారు. ఎన్నికల ఖర్చుకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని దీనికి షాడో రిజిస్టర్ నిర్వహించాలన్నారు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులు అవినీతికి పాల్పడినట్లు రుజువైతే వారిని పోటీకి అనర్హులుగా పరిగణిస్తామన్నారు. రిగ్గింగ్, పోలింగ్ కేంద్రాల నిర్భంధం వంటి చర్యలకు పాల్పడే వారిపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గత స్థానికసంస్థల ఎన్నికలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించినట్లు ప్రస్తుతం జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఆయా జిల్లాల కలెక్టర్లు తమ వనరులకు అనుగునంగా ఎన్ని విడతల్లో ఎన్నికలు నిర్వహించాలన్న సమాచారాన్ని అందించాలని కమిషనర్ ఆదేశించారు. రెండు జిల్లాల గ్రామపంచాయతీలు, పంచాయతీల్లో విలీనమైన తండాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ కేంద్రాల పూర్తి వివరాలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని నాగిరెడ్డి సూచించారు.

ప్రశాంత నిర్వహణకు చర్యలు: ఖమ్మం కలెక్టర్ లోకేష్‌కుమార్

ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందు కు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లోకేష్‌కుమార్ స్పష్టం చేశారు. జిల్లాలో గత ఎన్నికల మాదిరిగానే మూడు విడతల్లో ఎన్నికలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 7,59,470 మంది పంచాయతీ ఓటర్లు ఉన్నారని, 1,495 బ్యాలెట్ బాక్సులు, 337 ఈవీఎంలు సంసిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ముందస్తుగానే శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన పోలీస్ యంత్రాంగాన్ని ఆయా ప్రాంతాల్లో కేటాయించనున్నట్లు కలెక్టర్ తెలపారు. జనవరి 2018 నాటికి ఓటర్ల జాబితాను సవరణ పూర్తిచేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విధులకు జిల్లాలో సుమారు 6,500 మంది సిబ్బందిని 13వందల మంది పోలీస్ యంత్రాంగాన్ని నియమించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచన లు, ఆదేశాల మేరకు జిల్లాలో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా చేపట్టన్నునట్లు కలెక్టర్ లోకేష్‌కుమార్ తెలిపారు.

భద్రాద్రి జిల్లాలో 3,500 వార్డులు: కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తండాలు గ్రామపంచాయతీలో విలీనం అయ్యాయని వీటి ఫలితంగా ప్రస్తుతం ఉన్న 2,292 వార్డులకు ప్రస్తుతం 3,500 వార్డులు అయ్యాయని భద్రాద్రి జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు చెప్పారు. జిల్లాలో మానవ వనరులు, రక్షణ సిబ్బందని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో నాలుగువిడతలుగా ఎన్నికలను నిర్వహించేం దుకు నిర్ణయించినట్లు తెలిపారు. దీనికోసం ప్రతిపాదనలను సమర్పించనున్నట్లు దీనికి అనుమతించాలని ఎన్నికల కమిషనర్‌ను ఆయన కోరారు. ఈ సమీక్ష సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ కిషోర్ ఝా, శిక్షణ కలెక్టర్ జి హన్మంతు కొడింబా, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి అశోక్‌కుమార్, సహాయకార్యదర్శులు జయసింహారెడ్డి, విష్ణుప్రసాద్, రెండు జిల్లాల జేసీలు టి వినయ్‌కృష్ణారెడ్డి, రాంకిషన్, జడ్పీ సీఈవో మారుపాక నాగేశ్, డీఆర్వో జె శివశ్రీనివాస్, రెండు జిల్లాల పంచాయతీ అధికారులు కె శ్రీనివాసరెడ్డి, ఆర్‌వి ఎస్పీ లత, డీసీపీ పీవి గణేష్, ఏసీపీలు షేక్ ఇస్మాయిల్, సురేష్‌కుమార్, ఖమ్మం ,భద్రాచలం కల్లూరు, కొత్తగూడెం ఆర్డీవోలు పూర్ణచంద్రం, నారాయణరెడ్డి, ఆర్ కుముదినీ సింగ్, రవీంద్రనాథ్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సహకారశాఖలో ఉద్యోగోన్నతులు

ఖమ్మం డీసీవో అప్పిరెడ్డికి జాయింట్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగోన్నతి ● ఇరుజిల్లాల్లో 10 మంది సహకార ఉద్యోగులకు కూడా



ఉద్యోగోన్నతి పొందిన అప్పిరెడ్డి

ఖమ్మం వ్యవసాయం: ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సహకార సంఘాల ఉద్యోగులకు ఉద్యోగో న్నతులు లభించాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా కో ఆపరేటివ్ అధికారి డీసీవోగా పనిచేస్తున్న శీలం అప్పిరెడ్డికి జాయింట్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఆయనతోపాటు సహకార శాఖలో ఉమ్మడి జిల్లాల్లో పనిచేస్తున్న నలుగురు సీనియర్ ఇన్స్‌పెక్టర్లకు అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా, ఆరుగురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా ఉద్యోగోన్నతుల ఉత్తర్వులు జారీ అయ్యాయి. వారికి పోస్టింగ్‌లు త్వరలో కల్పించనున్నారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్ నుంచి డిప్యూటీ రిజిస్ట్రార్లు ఉద్యోగోన్నతులు పొందిన వారు

1. ఎ. అవధానుల శ్రీనివాస్, ఖమ్మం
2. పి. కృష్ణ, ఖమ్మం.
3. ఎన్. వెంకటేశ్వర్లు, ఖమ్మం
4. ఎ. విజయకుమారి, ఖమ్మం
5. బుద్దా నాయుడు, ఖమ్మం
6. శ్రీనివాస్ సింగ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

సీనియర్ ఇన్స్‌పెక్టర్ నుంచి అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా

1. కే. సందీప్, ఖమ్మం
2. ఎంఎస్. మురళీధర్‌రావు , ఖమ్మం
3. ఎస్‌కే. అన్వర్, ఖమ్మం
4. జీవి. రంగాచార్యులు, ఖమ్మం



మీకు తెలుసా?
వేడి నీటికన్నా చల్లటి నీరు బరువుగా ఉంటుంది.



ఔనా!
మనుషుల్లో లాగానే..పిల్లులు, శునకాల్లోనూ ఎడమ చేతివాటం, కుడి చేతివాటం ఉంటాయి.

సూక్తి
అస్తమించిన సూర్యుడు తిరిగి ఉదయించినట్లే. పోరాడి ఓడినవాడు తిరిగి గెలుస్తాడు.

ప్రపంచం నిదురోయింది ఇలా..

తుంపరలు తుంపరలుగా వర్షం పడుతున్న వేళ.. మెత్తని పరుపుపై... నులివెచ్చని దుప్పటి కప్పుకుని పడుకుంటే... ఆ సుఖమే వేరు కదా! చరిత్రలోకి తొంగి చూస్తే.. మంచాలు ఉండవు, పరుపులు కానరావు. 'గచ్చు' కూడా కనిపించదు. కటిక నేలపైనే కంటి నిండా నిద్రపోయేవారు. ఆనాటి ఆదిమ మానవుడి నుంచి.. ఈనాటి ఆధునిక మానవుడి వరకు ఎలా నిద్రించారో ఓ సారి చూద్దామా!

ప్రారంభం



క్రీపూ. 10000
ఈ కాలంలో ఎక్కువ శాతం గుహల్లో నివసించేవాళ్లు. నేలపైన జంతువుల చర్మం వేసుకుని నిద్రించేవారు



క్రీపూ. 3600
ఈజిప్షియన్లు కర్రతో చేసిన మంచాలపై పడుకునేవారు.



క్రీపూ. 3400
పర్షియన్లు 'వాటర్ బెడ్స్'ను ఉపయోగించేవారు. వీటిని గొర్రె చర్మంతో తయారు చేసేవారు.



క్రీపూ. 27
ఈ కాలంలో ఉన్ని లేదా పక్షుల ఈకలతో రూపొందించిన విలాసవంతమైన బెడ్స్ వచ్చాయి. రోమన్లు వీటిపైనే నిద్రించేవారు.

క్రీ.శ. 1300
మొదటిసారిగా 'మాట్రస్' అనే పదం ఈ కాలంలోనే వాడారు. 'మాత్రహ్' అనే అరబిక్ పదం నుంచి 'మాట్రస్' వచ్చింది.

యూరోపియన్లు గడ్డితో తయారుచేసిన 'ఫ్యాబ్రిక్ పరుపు'లపై కునుకు తీసేవారు.



1500
(పునరుజ్జీవన కాలం)



18వ శతాబ్దం
ఇదే కాలంలో కాటన్ పరుపులు వచ్చాయి. ప్రజలు వాటిని ఉపయోగించడం అలవాటు చేసుకున్నారు. అమెరికాలో కాటన్ ఉత్పత్తి పెరిగింది ఈ సమయంలోనే.



1865
'కాయిల్ స్ప్రింగ్ మాట్రస్' ప్రజలకు అందుబాటులోకి వచ్చింది ఈ కాలంలోనే. 'సామ్యూల్ పీ కిటిల్' ఈమాట్రస్‌పై పేటెంట్ హక్కులు పొందాడు.

1879
థామస్ అల్వా ఎడిసన్ ప్రపంచానికి 'బల్బు'ను పరిచయం చేసిన సంవత్సరం. ఈ ఆవిష్కరణతో అమెరికా సగటు పౌరుని నిద్ర దాదాపు మూడు గంటలు తగ్గింది.



1950
విలాసవంతమైన పరుపులు వచ్చిన కాలం. కన్జ్యూమర్ మార్కెట్‌లోకి ఇవి విరివిగా రావడంతో అందరినీ ఆకట్టుకున్నాయి



1960
మోడ్రన్ వాటర్ బెడ్స్ వాడటం మొదలైంది.

1970
స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తొలిసారిగా 'స్లీప్ రీసెర్చ్ సెంటర్'ను ప్రారంభించింది.



1990
నాసా 'విస్కో ఎలాస్టిక్ ఫోమ్' పరుపుల స్ఫూర్తితో, 'మెమొరీ ఫోమ్ మాట్రస్'లు రూపొందాయి.

ప్రస్తుతం



2012
ఎక్కువ లేయర్లతో సాఫ్ట్ కుషన్‌తో, ఎంతో సౌకర్యంగా ఉండే విలాసవంతమైన పరుపులు అందుబాటులోకి వచ్చాయి.

పదాలు కనుక్కోండి


L	E	A	F	Y	E	Y	P	N
Y	O	A	Y	E	K	L	E	C
C	R	U	E	K	A	D	N	R
E	A	T	L	R	R	L	W	I
I	N	U	L	U	T	O	O	S
P	G	M	O	T	F	C	R	P
C	E	N	W	R	E	D	B	W
E	L	P	P	A	P	M	A	J
B	C	H	A	N	G	E	Q	K

YELLOW PIE BROWN RAKE ORANGE	COLD CRISP AUTUMN RED	LEAF CHANGE APPLE TURKEY

చెప్పగలరా?
ఉడతలో ఉన్నా కానీ మిడతలో లేను
వాద్యంలో ఉన్నా కానీ వాదంలో లేను
మంచిలో ఉన్నా కానీ కంచిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జవాబులు
చెప్పగలరా?: ఉద్యమం
జంతరమంతర్: 1. ఉమ్మడి 2. శ్రీకారం 3. సౌభాగ్యం 4. మెరుపు

రంగులు నింపండి



టంగ్ ట్విస్టర్స్
1. Excited executioner exercising his excising powers exces-sively.
2. Pail of ale aiding ailing Al's travails.
3. Double bubble gum, bubbles double.
4. Salty broccoli, salty broccoli, salty broccoli



జంతరమంతర్
ఈ కింది పదాలను సరిచేయండి
1. మ్మఉడి ▸ ....
2. శ్రీరంకా ▸ ....
3. రూసౌభ్యం ▸ ....
4. రుపుమె ▸ ....

చాయ్, సమోసా కోసమా.. ?

ఖమ్మం కార్పొరేషన్: 'పనులు చేస్తారనే మిమ్మల్ని మేయర్‌గా ఎన్నుకున్నాం... కానీ ఒక్క సమస్య కూడా పరిష్కారం కావడం లేదు. డివిజన్లలో ప్రజలు నిలదీస్తున్నారు.. సమస్యలు పరిష్కరించలేని సమావేశాలెందుకు చాయ్, సమోసా తిని వెళ్లిపోయేందుకా.. అని కొందరు పాలకపక్ష కార్పొరేటర్లు నగర మేయర్ డాక్టర్ జి. పాపాలాల్‌ను నిలదీశారు. నగర పాలక సంస్థ పనితీరుపై ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరు నెలల అనంతరం నగర పాలక సంస్థ పాలకవర్గం సమావేశం మేయర్ అధ్యక్షతన బుధవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాలులో నిర్వహించారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లతో పాటు టీఆర్ఎస్ కార్పొరేటర్లు కూడా గత కౌన్సిల్ సమావేశంలో పేర్కొన్న పనులు కార్యరూపం దాల్చలేదని నిలదీయడంతో సమావేశం వాడివేడిగా సాగింది. ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి, పాలకవర్గ సమావేశానికి హాజరయ్యారు. నగర పాలక సంస్థ అధికారుల పనితీరుపై అధికార పక్ష ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కూడా అసంతృప్తి వ్యక్తంచేయడం గమనార్హం.

సారథీనగర్ ఆర్‌యూబీపై చర్చ...

'సారథీనగర్ అండర్ రైల్వే అండర్ బ్రిడ్జి విషయంలో విఫలమయ్యాం. అందుకు కౌన్సిల్ సభ్యులకు సారీ చెబుతున్నాను'. అని ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాలకవర్గ సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. సమావేశం ప్రారంభం కాగానే నిరుపయోగంగా ఉన్న సారథీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి విషయాన్ని కాంగ్రెస్ కార్పొరేటర్లు నాగండ్ల దీపక్‌చౌదరి ప్రస్తావించారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని మేయర్ పాపాలాల్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి కోరారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ భూమి విషయంలో వివాదం ఉందని, కేవలం 100 చదరపు గజాల స్థలం ఉంటే సమస్య తీరుతుందని మేయర్ సమాధానం ఇచ్చారు. స్థలం నిమిత్తం రూ.22లక్షలు డిపాజిట్ చేశామని పేర్కొన్నారు. సమస్యను రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ కార్పొరేటర్లపై మేయర్ వ్యాఖ్యానించారు. దీనిపై బాలసాని లక్ష్మీనారాయణ స్పందించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ సారథీనగర్ ఆర్‌యూబీ ప్రారంభించిన తరువాత అక్కడ నీళ్ల నిలిస్తే వాటిని తొలగించలేదన్నారు. అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. 'ఆర్‌యూబీ విషయంలో మనం విఫలం అయ్యాం... అందుకు సారీ చెబుతున్నా' అని బాలసాని పేర్కొన్నారు. కాగా వచ్చే నెల 5న ఆర్‌యూబీ సమస్య పరిష్కారానికి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

మేయర్‌పై పాలకపక్ష కార్పొరేటర్ల ధ్వజం

నగర పాలక సంస్థ పాలకవర్గ సమావేశంలో పాలకపక్ష కార్పొరేటర్లు మేయర్‌పై ధ్వజమెత్తారు. తొలుత టీఆర్ఎస్ కార్పొరేటర్ తోట రామారావు సమస్యలపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలకు ఒకసారి సమావేశం పెడతారు. సమావేశానికి వచ్చేది ఎందుకు ? సమోసా తిని టీ తాగడానికా ? అని తీవ్రంగా ప్రశ్నించారు. త్రీటౌన్ ప్రాంత ప్రజలు మురుగు కూపంలో మగ్గిపోతున్నారని గత కౌన్సిల్ సమావేశాల్లో పేర్కొన్నా పట్టించుకోలేదని మేయర్‌ను నిలదీశారు. '43మంది కార్పొరేటర్లు ఉన్నాం... అయినా అభివృద్ధి లేదు. అధికారులకు చెప్పినా పట్టించుకోరు'. అని తోట రామారావు పేర్కొన్నారు. మరో టీఆర్ఎస్ కార్పొరేటర్ మచ్చా నరేందర్ మాట్లాడుతూ డివిజన్లలో సమస్యలు వినకుండా సమావేశంలో చర్చించకుంటే మేయర్‌ను కదలనిచ్చేదిలేదని హెచ్చరించారు. టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పాలకపక్ష కార్పొరేటర్లు కొత్తపల్లి నీరజ, మాటేటి నాగేశ్వరరావు, చేతుల నాగేశ్వరరావు తదితరులు ధ్వజమెత్తారు. నగర పాలక సంస్థలో డ్రాయింగ్ బ్రాంచ్ పనితీరు ఘోరంగా ఉందని పేర్కొన్నారు. జమ్మిబండలో పైపులైన్ ధ్వంసమై సమస్య ఏర్పడినా ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని పాలకపక్ష కార్పొరేటర్ కర్నాటి కృష్ణ పేర్కొన్నారు. కాగా ఓడీఎఫ్ నగరంగా ప్రకటించిన అధికారులు తన డివిజన్‌లో వ్యక్తిగత మరుగుదొడ్లను ఎందుకు రద్దుచేశారని, ఎందుకు బిల్లులు చెల్లించలేదని పాలకపక్ష కార్పొరేటర్ పగడాల నాగరాజు అధికారులను నిలదీశారు. సమస్యలు పరిష్కరించలేక ప్రజల్లో తిరగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

విపక్షాల ధ్వజం

విపక్ష కార్పొరేటర్లు పాలకవర్గ సమావేశంలో సమస్యలపై ప్రశ్నించారు. చెత్త తరలించే ట్రాక్టర్లకు జీపీఎస్ విధానం అమలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా, ట్రాక్టర్లు ఒక్క ట్రిప్పు కూడా తిరగడం లేదని సీపీఎం కార్పొరేటర్ అఫ్రోజ్ సమీనా దుయ్యబట్టారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా షాదీఖానా నిర్మాణ పనులు నాసిరకంతోపాటు విపరీతమైన జాప్యం జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. సీపీఐ కార్పొరేటర్ బీజే క్లైమెంట్, కాంగ్రెస్ కార్పొరేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ సమస్యలపై మేయర్‌ను ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి



మాట్లాడుతున్న కార్పొరేటర్ తోట రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బాలసాని

అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే అసంతృప్తి



నిధులు ఉన్నా మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు ఇవ్వలేదు. అసలు నగరాన్ని ఓడీఎఫ్‌గా ఎలా ప్రకటించారని ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు ఉంటే ఎందుకు బిల్లులు ఇవ్వడం లేదని కమిషనర్ బి. శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. అధికారులు సరిగా పనిచేస్తేనే అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే అజయ్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలో పబ్లిక్ టాయ్‌లెట్లు, షీ టాయ్‌లెట్లు నిర్మాణంపై ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. ఏ ప్రభుత్వ శాఖకు చెందిన ఖాళీ స్థలం ఉన్నా పబ్లిక్ టాయ్‌లెట్లు నిర్మించవచ్చని ప్రభుత్వం చెబుతోందని, అయినా వివాదాలున్నాయని పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణం నిలిపివేయడం సరికాదన్నారు.



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు

మొద్దునిద్ర పోతున్న టీఆర్ఎస్ ప్రభుత్వం

● టీపీసీసీ నేత భట్టి విక్రమార్క

మధిర టౌన్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోతోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బుధవారం ఆయన మధిర చెరువు కట్టపై జరుగుతున్న ట్యాంకుబండ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ మధిర చెరువుకట్టను ట్యాంకుబండ్‌గా అభివృద్ధి చేసేందుకు 2013లో అప్పటి యూపీఏ మంత్రివర్గంలో టూరిజంశాఖ మంత్రిగా ఉన్న చిరంజీవిని ఒప్పించి రూ.ఐదుకోట్లు నిధులు మంజూరు చేయించానని తెలిపారు. దానికి సంబంధించిన 20శాతం నిధులు రాష్ట్రప్రభుత్వం ఖాతాకు జమఅయ్యాయని, ఆ నిధులు ఖర్చు చేసిన తర్వాతనే మిగతా నిధులు విడుదలవుతాయన్నారు. నిధులు విడుదలై మూడున్నర సంవత్సరాలైనా పనులు ప్రారంభించకుండా రాష్ట్రప్రభుత్వం మొద్దునిద్రపోతోందని ఆరోపించారు. తన వత్తిడి మేరకు ఎట్టకేలకు రూ.40లక్షలు విడుదల చేశారని, అధికారులు వెంటనే పనులు పూర్తిచేసి నవంబర్ 14న ట్యాంకుబండ్ ప్రారంభమయ్యేటట్లు చూడాలన్నారు. అనంతరం ఎన్నెస్పీ గెస్ట్‌హౌజ్ వద్ద తన క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. తాను చెప్పిన ప్రకారం కాకుండా నిర్మాణం ముందుకు ఎందుకు జరిపారని ఆర్‌అండ్‌బీ జేఈని ప్రశ్నించారు. నిర్మాణ పనులు తాను చెప్పినట్లే జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ నారాయణ, జిల్లా టూరిజం అధికారి సుమన్‌చక్రవర్తి, ఆర్‌అండ్‌బీ జేఈ రాజేష్, కాంగ్రెస్ నాయకులు సూరంశెట్టి కిషోర్, మిరియాల రమణ, చావా వేణు, కర్నాటి రామారావు, తలుపుల వెంకటేశ్వర్లు, మిరియాల కాశీ, గుత్తేదారు అనుమోలు కృష్ణారావు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయ నిర్మాణ వివరాలను జేఈని అడిగి తెలుసుకుంటున్న భట్టి

రెవెన్యూ వ్యవస్థ పటిష్టంగానే ఉంది

ఎర్రుపాలెం: తెలంగాణాలో రెవెన్యూ వ్యవస్థ పటిష్టంగానే ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ స్థానిక శాసన సభ్యులు మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జమలాపురంలో విలేకరులతో మాట్లాడుతూ జీవో తొమ్మిదికి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమన్నారు. గ్రామాలలో వీఆర్వో, ఆర్ఐ, డీటీ, తహసీల్దార్, ఆర్‌డీవో, జేసీ, కలెక్టర్, రెవెన్యూలో రికార్డులను పర్యవేక్షించి బధ్రపరుస్తారని అన్నారు. ఆ వ్యవస్థను రద్దు చేసి పట్వారి వ్యవస్థను తీసుకొచ్చేందుకే ఈ రైతు కమిటీలన్నారు. రెవెన్యూ రికార్డులన్నీ రైతు కమిటీలవద్ద ఉంచుకొని తమ భుమలను కొంత మంది అధికార పార్టీ నేతలకు లబ్ది చేకురేలా ఉన్నాయని రైతులు భయాందోళన చెందుతున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని హెచ్చరించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సుదాకర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

మాటలే.. మూటలు లేవు..!

● నీరుగారుతున్న 'వ్యవసాయ యాంత్రీకరణ' లక్ష్యం ● ఏటా కేటాయింపులే తప్ప నిధులు కరవు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి-ఖమ్మం)

వ్యవసాయ రంగానికి సాంకేతికతను అనుసంధానం చేసి ఉత్పాదకతను పెంచడంతోపాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేదుకు రూపకల్పన చేసిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంకోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న ఈ పథకానికి నిధుల కేటాయింపులు జరిగినా విడుదల మాత్రం ఇంకా జరగలేదు. గత ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా నిరాశే ఎదురవుతుందా అన్న సందేహాలు అన్నదాతల్లో వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇంకా ఈ పథకం అమలుపై అధికారులకు స్పష్టత మాత్రం రాలేదు. వాస్తవానికి ఈ ఏడాది జిల్లాకు యాంత్రీకరణ పథకం కింద రూ.15కోట్లను కేటాయించింది. అయితే నిధులు విడుదల కాకపోవడంతో వ్యవసాయ శాఖాధికారులు పథకం అమలుకు కార్యాచరణను ప్రారంభించలేదు. గత ఏడాది బడ్జెట్‌లో జిల్లాకు రూ.9కోట్లు కేటాయించగా కేవలం కోటి రూపాయలు మాత్రమే విడుదలయ్యాయి. ఆ నిధులు గతంలో వ్యవసాయ పరికరాలు అందించిన కంపెనీల బకాయిలు చెల్లించడానికే సరిపోయాయి. దాంతో గత సంవత్సరం సబ్సిడీ పరికరాలు అందించలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.15కోట్లు కేటాయించినా నిధులు రాకపోవడంతో దరఖాస్తులు తీసుకునే విషయంలో వ్యవసాయశాఖ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ పథకానికి జిల్లాలో రైతుల నుంచి డిమాండ్ బాగా ఉంది. జిల్లాలో సుమారు 2.5లక్షల మంది రైతులు ఉన్నారు.

వేలల్లో దరఖాస్తులు.. వందల్లో లబ్ధిదారులు

యాంత్రీకరణ పథకంలో ఇప్పటివరకు కొద్దిమందికి మాత్రమే లబ్ధిపొందారు. వేలల్లో దరఖాస్తులు వస్తుండగా వందల సంఖ్యలో మాత్రమే లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. వ్యవసాయ రంగంలో రోజురోజుకు పెరుగుతున్న పెట్టుబడులతో సాగు భారమై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి పలికించి ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానంతో సాగును లాభసాటిగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నాయి. ట్రాక్టర్లు, కల్టివేటర్లు, రొటివేటర్లు, వరి నాటే యంత్రాలు, ఎరువులు, విత్తనాలు వేసే పరికరాలు, పురుగుమందులు స్ప్రే చేసే పరికరాలు, వరి కోత యంత్రాలు, మొక్కజొన్న ఒలిచే యంత్రాలు, పప్పుదినుసుల యంత్రాలు, వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో రైతులు పొందే అవకాశం ఉంది.

చాలీచాలని నిధులు..

వ్యవసాయ యాంత్రీకరణ పథకం కోసం ఉమ్మడి జిల్లాలో రూ.20కోట్ల వరకు ప్రతి సంవత్సరం ఖర్చు చేస్తుండగా గత ఏడాది జిల్లా విభజన అనంతరం రూ.9కోట్లు కేటాయించారు. కేవలం కోటి రూపాయలు మాత్రమే విడుదల చేయడంతో ఈ పథకం అమలు చేయలేకపోయారు. ఎస్సీ ఎస్టీలకు 95శాతం సబ్సిడీపైన ఈ పరికరాలు అందించే సౌలభ్యం ఉంది. ట్రాక్టర్లపై రూ.3.50లక్షల వరకు సబ్సిడీ పొందే అవకాశం ఉండగా రైతు సంఘాలకు సబ్సిడీ మరింత పొందే సౌలభ్యం ఉంది. జిల్లాలో రెండేళ్ల క్రితం యంత్రలక్ష్మీ పథకం పేరుతో లబ్ధిపొందిన రైతులు ట్రాక్టర్లను, వరికోసే యంత్రాలను తిరిగి విక్రయించి సబ్సిడీని దుర్వినియోగం చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. దీనిపై విచారణలు జరిగాయి. గతంలో లబ్ధిదారుల ఎంపికలో నాయకుల సిఫార్సులకు ప్రాధాన్యం ఉండేది. ఇప్పుడు లాటరీ పద్ధతిలో ఎంపిక ప్రక్రియ రావడంతో అధికారులకు రాజకీయ ఒత్తిళ్లు తగ్గాయి. లాటరీ పద్ధతి ప్రవేశపెట్టడం కొంతవరకు అవినీతి నివారణకు అవకాశం ఏర్పడింది. అయితే జిల్లాలో ఈ పథకానికి డిమాండ్ భారీగా ఉంది. గ్రామాల్లో పశు సంపద తగ్గిపోవడం, దుక్కిటెద్దు లేకపోవడం, కర్రనాగళ్లతో వ్యవసాయం చేసేందుకు మనుషులు దొరకకపోవడం వల్ల ట్రాక్టర్లు తదితర యంత్రాల వినియోగం తప్పనిసరైంది. దీంతో వ్యవసాయ యాంత్రీకరణ డిమాండ్ ఏటికేడు పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాదైనా వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మండలంలో భట్టి పర్యటన నేడు

చింతకాని: మండలంలోని నాగులవంచ, నర్సింహాపురం, సీతంపేట గ్రామాలలో ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క గురువారం పర్యటించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగులవంచ గ్రామంలో జ్వరపీడుతులను పరామర్శిస్తారని తెలిపారు. సీతంపేట, నర్సింహాపురం గ్రామాలలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. అనంతరం చింతకాని గ్రామంలో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

జ్వరాలు తగ్గేవరకు వైద్యశిబిరాలు

● ప్రత్యేక వైద్యులతో నిత్యం రోగులకు పరీక్షలు: డీఎంహెచ్‌వో కొండల్‌రావు

చింతకాని: నాగులవంచ గ్రామంలో జ్వరాలు తగ్గుముఖం పట్టేంతవరకు వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్టు జిల్లా వైద్యాధికారి కొండల్‌రావు తెలిపారు. మండలపరిధిలోని నాగులవంచ గ్రామాన్ని సందర్శించి జ్వరపీడుతులకు అందిస్తున్న వైద్యసేవలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోగులకు వైద్యసేవలు అందించేందుకు నలుగురు ఆర్‌బీఎస్‌కే వైద్యులను డిప్యూటేషన్‌పై గ్రామానికి తీసుకువచ్చామని తెలిపారు. వారిని రెండు బృందాలుగా విభజించి జ్వరపీడుతులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. అలాగే బనిగండ్లపాడు, ఎంపీపాలెం, మాటూరిపేట తదితర పీహెచ్‌సీలకు చెందిన పారామెడికల్ సిబ్బందికి సైతం గ్రామంలో డ్యూటీలు వేశామన్నారు. ప్రస్తుతం గ్రామంలో జ్వరాలు అదుపులోనే ఉన్నాయని, ఎవ్వరూ భయాందోళనకు గురికావద్దని సూచించారు. దోమల నివారణకు ప్రతి ఇంట్లో మందు స్ప్రే చేయిస్తున్నట్టు వివరించారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఏవో డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ రాంబాబు, మండల వైద్యాధికారి సుబ్బారావు, శ్రీకాంత్, సర్పంచ్ పడిశాల లక్ష్మీనారాయణ, ఈవోఆర్డీ రామయ్య, పంచాయతీ కార్యదర్శి బత్తిన శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది జైపాల్, విజయకుమారి పాల్గొన్నారు.



జ్వరపీడితులను పరామర్శిస్తున్న కొండల్‌రావు, బావి పూడ్చివేతకు సన్నాహాలు

బావి పూడ్చివేతకు రంగం సిద్ధం

మండలపరిధిలోని నాగులవంచ గ్రామంలో కలెక్టర్ లోకేష్‌కుమార్ ఆదేశాల మేరకు పురాతన బావి పూడ్చివేసేందు కు మండల, జిల్లా అధికారులు బుధవారం ఏర్పాట్లు చేశారు. బావిని సీనియర్ క్వాలిటీ కాంట్రోల్ జిల్లా అధికారి సూర్యప్రకాష్ పరిశీలించారు. యుద్ధప్రాతిపాదికన బావిని పూడ్చనున్నట్టు తెలిపారు. గురువారం నుంచి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేసి పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో నవాబ్‌పాషా, ఈవోఆర్డీ రామయ్య, ఏపీవో కోటయ్యపంచాయతీ కార్యదర్శి బత్తిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపికలు



ఎంపిక చేస్తున్న అధికారులు

మధిర టౌన్: మధిర నగరపంచాయతీ పరిధిలోని ఎస్సీ కార్పొరేషన్‌కు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులను బుధవారం ఎంపిక చేశారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ నాగరాణి, కమిషనర్ రాజారావు ఆధ్వర్యంలో ఈఎంపికలు జరిగాయి. రూ.లక్షలోపు 18 మందిని, రూ.లక్ష నుంచి రూ.రెండులక్షలోపు ఏడుగురిని, రూ.రెండులక్షలకుపైబడిన ఇద్దరిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేసినట్టు కమిషనర్ తెలిపారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ దిరిశాల వినోద, వార్డు కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సామూహిక సెలవులపై ఏఆర్ఎస్ ఉద్యోగుల వినతి

మధిర టౌన్: మధిరలోని వ్యవసాయ పరిశోధనస్థానం ఉద్యోగులు సామూహిక సెలవు కోసం పరిశోధనాస్థానం అధికారి ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. నూతన సీపీఎస్ పింఛన్ విధానం ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. దీనికి నిరసనగా ఒకటి నుంచి సామూహిక సెలవుకోసం వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీధర్, వి.మురళీకృష్ణ, ఎం.నాగార్జున, వెంకటస్వామి, వెంకయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలి: వైరా ఏసీపీ

బోనకల్: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా అందరూ పనిచేయాలని వైరా ఏసీపీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో బుధవారం ఆయన మొక్కలను నాటారు. సామాజిక సేవాకార్యకర్త మరీదు బరకయ్య గ్రామంలో ముత్యాలమ్మ తల్లి దేవాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఏసీపీని ఆశ్రయించారు. పోలీసు శాఖ దత్తత గ్రామం కావడంతో విద్యుత్ అధికారులతో ఆయన మాట్లాడి వెంటనే విద్యుత్‌లైన్ వేయించి విద్యుత్ సౌకర్యం కల్పించారు. దేవాలయానికి విద్యుత్ ప్రసారాన్ని ఏసీపీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సేవామార్గంలో అందరూ పయనించాలన్నారు. నారాయణపురం రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఈకార్యక్రమంలో మధిర సీఐ శ్రీధర్, ఎస్ఐ వరాల శ్రీనివాస్, సర్పంచ్ వేల్పుల ఆనందరావు, ఎంపీపీ చిట్టుమోదు నాగేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు బాణోతు కొండ, కార్యదర్శి లక్ష్మి, బుంగా రాములు, పదిలం కొండ, గద్దల వెంకటేశ్వర్లు, మరీదు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న ఏసీపీ

ఉద్యోగభద్రత కల్పించాలని సాక్షరభారత్ ఉద్యోగుల వినతి

మధిర టౌన్: ఉద్యోగభద్రత కల్పించాలని సాక్షరభారత్ కోఆర్డినేటర్లు బుధవారం ఎంపీడీవో ఆల్బర్ట్, తహసీల్దార్ మంగీలాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 23గ్రామాల్లో పనిచేస్తున్న సాక్షరభారత్ కోఆర్డినేటర్లకు ఉద్యోగభద్రత కల్పించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు వెంకటేశ్వర్లు, రాజు, సుధీర్, కృష్ణ, మురళీ, ఆశాజ్యోతి, నస్రీమ్, బేగం పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి

తూటికుంట్లలో ఓపెన్ స్కూల్ కేంద్రం

బోనకల్: మండలంలోని తూటికుంట్ల చైతన్య విద్యాలయంలో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ మంజూరైందని ప్రిన్సిపాల్ షేక్.హుస్సేన్ తెలిపారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ కోర్సులకు సంబంధించి 10వతరగతిలో చేరబోయేవారు 14సంవత్సరాల వయస్సు నిండి ఉండాలన్నారు. పదోతరగతి పూర్తయిన వారు ఇంటర్‌లో చేరేందుకు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులకు ఫీజు రాయితీ ఇవ్వబడుతుందన్నారు. వీరికి ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెం9866153580, 9515714 676లను సంప్రదించాలని విజ్ఞప్తిచేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ఎర్రుపాలెం: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు డిమాండ్‌చేశారు. బుధవారం ఎర్రుపాలెంలో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విదానాన్ని అమలు చేయాలన్నారు.

వినాయకుడికి.. పూజలు.. అన్నదానాలు.. ఊరేగింపులు

కోలాహలంగా మండపాలు

మధిర టౌన్: మధిర పట్టణంలో వినాయక మండపాల వద్ద బుధవారం కోలాహలం కనిపించింది. పలు మండపాల వద్ద అన్నదానాలు నిర్వహించగా, బుధవారం కావడంతో ప్రత్యేకపూజలు, ఊరేగింపులు, నిమజ్జనాలు చేశారు. మధిరలోని రైల్వేమోరీ వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నదానాన్ని ప్రారంభించారు. సిద్ధారెడ్డి బజారులో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద అన్నదానాన్ని నగరపంచాయతీ చైర్‌పర్సన్ నాగరాణి, జడ్పీటీసీ సభ్యురాలు ప్రియాంక ప్రారంభించారు. ఎంప్లాయీస్ కాలనీలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని టీఆర్ఎస్ నాయకుడు మల్లాది వాసు ప్రారంభించారు. వైరా రోడ్డులోని టీవీఎస్ షోరూమ్ వద్ద, సాయిబృందావనం అపార్టుమెంట్ వద్ద అన్నదానాన్ని నిర్వహించారు. బులియన్ మర్చంట్స్ అసోసియేషన్, సాయిబృందావనం అపార్టుమెంట్స్, బంజారాకాలనీ ఫ్రెండ్స్ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మల్లు నందిని, చైర్‌పర్సన్, జడ్పీటీసీ సభ్యురాలు



ఊరేగింపుగా వెళుతున్న వినాయక విగ్రహం, పూజలు చేస్తున్న ఎంపీ, కొండబాల

అన్నదానాన్ని ప్రారంభించిన ఎంపీ పొంగులేటి, కొండబాల

మధిర రూరల్: మధిర మండలం మహాదేవపురం గ్రామంలో యాదవబజారులో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడి విగ్రహం వద్ద బుధవారం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ప్రత్యేక పూజలుచేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీ పొంగులేటి, కొండబాల ప్రారంభించారు. ఈకార్యక్రమంలో నాయకులు బట్టా గోవిందరాజు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, దొండపాటి వెంకటేశ్వరరావు, చిత్తారు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న యువకులు

మీ సేవలో 'ఆంధ్రజ్యోతి'

పాఠకులకు 'ఆంధ్రజ్యోతి'ని మరింత చేరువ చేయడానికి స్థానిక విలేకరుల ఫోన్ నంబర్లను ఇస్తున్నాం.. అవినీతి, అక్రమాల సమాచారాన్ని అందించండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం

మధిర	9985411342
మధిర టౌన్	9491890567
మధిర రూరల్	9963852263
బోనకల్	9701255161
ఎర్రుపాలెం	9492104750
వైరా	9866316711
చింతకాని	9492104828
ముదిగొండ	9866492332

సినిమాలు

మధిర

● శాంతి	జయ జానకీ నాయక
● శ్రీలక్ష్మీ శ్రీనివాస	ఫిదా
● వాసవి	అర్జున్‌రెడ్డి

'బాలికల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి'

కొణిజర్ల: బాలికల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సాలెబంజర సర్పంచ్ పోగుల నాగమణి తెలిపారు. బుధవారం సాలెబంజర ప్రాథమిక పాఠశాలలో స్కోప్ ఆర్టీ జీపీఏ చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో 'బాలికల అభివృద్ధిలో మన పాత్ర' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లలను కాపాడుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జమహర్‌బాబు, జీపీఏ జిల్లా సమన్వయ కర్త అరుణసందీప్, సిబ్బంది రఘురాం, అరుణ, ఉపాధ్యాయులు అచ్యుత్‌రావు, నీరజ, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

వైరా- వాసవీ

నేనే రాజు- నేనే మంత్రి

ఏన్కూరు- లక్ష్మీనరసింహా

నేనే రాజు- నేనే మంత్రి

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట

గ్రామస్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

కారేపల్లి: మండల పరిధిలోని చీమలపాడులో గల విద్యుత్‌సబ్‌స్టేషన్ వెదుట బుధవారం రైతులు, ప్రజలు ముట్టడించి ఆందోళన చేపట్టారు. చీమలపాడు పంచాయతీ చింతలపండా, బోటితండాలలో విద్యుత్ అధికారులు రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలివేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు.ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రాత్రిసమయల్లో దోమలుతో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు.విద్యుత్ విషయంపై అధికారులకు పోన్లు చేసిన పట్టించుకోవడంలేదన్నారు.ఇప్పటికైనా అధికారులు పట్టించుకోకపోతే జిల్లా కార్యాలయంల ఎదుట కుటుంబసభ్యులతో కలసి ఆందోళన చేస్తామన్నారు.

ప్రత్యేక పూజలు, అన్నదానాలు

గణేష్ మండపాల వద్ద కోలాహలం

వైరా: వైరాలో బుధవారం పలుచోట్ల ఘనంగా వినాయక పూజలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటుచేసిన మండపంలో ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు పొంగులేటిని సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కట్ల రంగారావు, నాగరాజు, కన్నెగంటి నగేష్, నీతోడు వెల్పేర్ సొసైటీ అధ్యక్షుడు నందిగామ మనోహర్, ఉత్సవ కమిటీ సభ్యులు కట్ల సంతోష్, పోలూరి సైదులు, గద్వాల రవి, ఏపూరి రాజారావు, మల్లు రామకృష్ణ, సాయి, లింగయ్య, రాఖీ, శరత్‌బాబు, మాలెంపాటి రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ రోడ్డులోని శ్రీలక్ష్మీసాయి ఉత్సవ కమిటీ మండపంలో జడ్పీటీసీ సభ్యురాలు బొర్రా ఉమాదేవి, మాజీ సర్పంచ్ బొర్రా పద్మావతి పూజలు చేశారు. మండలంలోని పూసలపాడులో వినాయక ఉత్సవ కమిటీవారు అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మదన్‌లాల్ ప్రత్యేక పూజలు చేశారు. సొసైటీ అధ్యక్షుడు కడియాల సతీష్, ఎంపీటీసీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



వైరాలో..

ఏన్కూరు: మండలంలో జరుగుతున్న గణేష్ ఉత్సవాలు ఆరోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏన్కూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన వినాయక ఉత్సవాల్లో ఖమ్మం ఇందుశ్రీ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్యప్రదర్శన జరిగింది. భరత నాట్యం, కుచిపూడి నాట్యం, జానపదం తదితర సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఏన్కూరులోని మరోచోట ఘనంగా కుంకుమపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొణిజర్ల: వినాయక నవరాత్రులు సందర్భంగా మండల పరిధిలోని తనికెళ్ల గరికపాటి కళామందిరం వేదిక వద్ద ఏర్పాటు చేసిన గణేష్‌ని మండపం వద్ద బుధవారం కమిటి నిర్వహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్థులు కృష్ణమూర్తి, సీతారామయ్య, పీవీరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని నిర్వహక కమిటి సభ్యులు కరెన్సీనోట్లతో బుధవారం అలంకరించారు. ఈకార్యక్రమంలో విగ్రహాదాత పోలాగాని శ్రీనివాస్, మంగతాయి, దంపతులు నిర్వహక కమిటి సభ్యులు గోడుగుశ్రీనివాస్‌రావు, నర్సింగ్ ఉమమాహేశ్వరరావు, తురకనారాయణ, రాందాసు, వాకాటి సురేష్ ,కంచి రమేష్‌నాయుడు, సంపత్, సారంగా, రామారావుతదితరులు పాల్గొన్నారు. నేడు పెద్దమతల్లి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.






వైరాలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఏన్కూరులో పూజలు, కొణిజర్లలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం, కారేపల్లిలో మండపం వద్ద పూజలు

ఏన్కూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

ఏన్కూరు: మండలంలోని మంగళవారం రాత్రి పదిగంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపుల శబ్దాలతో కురిసిన భారీ వర్షంతో ఆయా గ్రామాల సమీపంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. తిమ్మారావుపేట, నాచారం, రేపల్లెవాడ, రంగాపురం తదితర గ్రామాల సమీపంలోని వాగులు ప్రవహించాయి. చెరువుల్లోకి నీరు చేరింది. చెక్‌డ్యాంలు నిండాయి. పత్తిపొలాల్లో నీళ్ల నిల్చిపోయాయి. అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి.

ప్రజాసంక్షేమం కోసం సీఎం కృషి: మదన్‌లాల్

కారేపల్లి: ప్రజాసంక్షేమంకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే మదన్‌లాల్ అన్నారు. బుధవారం తాహసీల్దార్ కార్యాలయంలో 18 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల అభ్యున్నతి కోసం పలు సంక్షేమా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. తెల్లరేషన్‌కార్డు కలిగివున్న ఓసీలకు కూడ ముఖ్యమంతి కళ్యాణలక్ష్మీ వర్తింప చేస్తున్నట్లు ప్రకటించారని ఎమ్మెల్యే అన్నారు. మిషన్‌భగీరథ కార్యక్రమం పనులు వేగవంతంగా సాగుతున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో జడ్పీటీసీ ఉన్నం వీరేందర్, సర్పంచ్ మండెపుడి రాణి, ఎంపీటీసీ సభ్యురాలు బోడకృష్ణవేణి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్‌లాల్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు హరితహారంలో పాల్గొని పలు మొక్కలునాటారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌లాల్

మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంల ప్రారంభం

మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మదన్‌లాల్ బుదవారం ప్రారంభించారు. వారంలో ఓరోజు మండలంలో ఉంటుపార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటనన్నారు.

రైతు సమాచార కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

వైరా: మండలంలోని దాచాపురంలో బుధవారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శిక్షణ విద్యార్థినులు రైతు సమాచార అవగాహన కేంద్రాన్ని నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే మదన్‌లాల్ ఈఅవగాహన కేంద్రాన్ని సందర్శించారు. సర్పంచ్ వేల్పుల శౌరి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొమర్రాజు పాండురంగారావు, విద్యార్థినులు మౌనిక, నివేదిత, ప్రణయ, అనూష, ఇస్రా, జ్యోత్స్న, ఆదర్శ రైతు శీలం నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఒక్క అడుగుదూరంలో వైరా రిజర్వాయర్

వైరా: మధ్యతరహాకు చెందిన వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి కేవలం ఒకే ఒక అడుగుదూరంలో ఉంది. బుధవారానికి రిజర్వాయర్ నీటిమట్టం 17.6అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు దాటాల్సి ఉంది. రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురిసి వరదనీరు వచ్చిచేరితే రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండే అవకాశముంది.

క్రీడలతో మానసికోల్లాసం

ఏన్కూరు మండలం తిమ్మరావుపేటలో ప్రారంభమైన పాఠశాలల క్రీడలు

వైరాలో రెండోరోజు ఉత్సాహంగా

ఏన్కూరు: మండల పరిధిలోని తిమ్మారావుపేట హైస్కూల్లో బుధవారం మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. తొలుత ఆయా పాఠశాలల విద్యార్థినులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అధికారులు గౌరవవందనం స్వీకరించారు. తొలిరోజు బాలికలకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పాపారాణి మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని కోరారు. క్రీడలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. కార్యక్రమంలో ఎంఈవో జయరాజు, ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్, డాక్టర్ రామచంద్రనాయక్, పీడీ అరుణ, పీఈటీలు శోభన్ నాయక్, పద్మజ, సుజాత, రవి, రంగారావు, స్థానికులు గొందు శ్రీనివాసరావు, జనార్ధన్, సత్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ

మండల పరిధిలోని తిమ్మారావుపేటలో విద్యార్థులకు బుధవారం క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. గ్రామంలో బాలాజీ ట్రేడర్స్ యజమాని రాంబాబు పదిమంది విద్యార్థులకు క్రీడాదుస్తులను అతని తండ్రి వెంకట్రామ్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్, డాక్టర్ భూక్యా రామచంద్రనాయక్, సర్పంచ్ సరోజ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, గొంది శ్రీను, సత్యం, జనార్ధన్, పీఈటీ శోభన్‌నాయక్ పాల్గొన్నారు.

వైరా: వైరాలో రెండోరోజు బుధవారం మండలస్థాయి క్రీడలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. జడ్పీటీసీ సభ్యురాలు బొర్రా ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు ముళ్లపాటి సీతరాములు, క్రీడల నిర్వహణ కన్వీనర్ పారుపల్లి జయలక్ష్మీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అండర్-14, అండర్-17విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు అథ్లెటిక్స్ క్రీడలు ఉల్లాసంగా సాగాయి. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో క్రీడాపోటీల్లో పాల్గొన్నారు.




ఏన్కూరులో విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్, కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు



వైరాలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత ఎవరు?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. **'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?**
ఎ) మాడ్రిడ్(స్పెయిన్)
బి) కౌలాలంపూర్(మలేషియా)
సి) గ్లాస్గో(బ్రిటన్) డి) రోమ్(ఇటలీ)

2. **చైనా ఆటగాడు లిన్‌డాన్‌ను ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) చెన్‌లాంగ్(చైనా) బి) లీ చోంగ్ వి(మలేషియా)
సి) కిదాంబి శ్రీకాంత్(ఇండియా)
డి) విక్టర్ అక్సెల్‌సన్(డెన్మార్క్)

3. **పి.వి.సింధుని ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) సైనా నెహ్వాల్(ఇండియా)
బి) నోజోమి ఒకుహర(జపాన్)
సి) ఇంతియాన్ రచనోక్(థాయ్‌లాండ్)
డి) కరోలినా మారిన్(స్పెయిన్)

4. **ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే 50 మ్యాచ్‌లను అజేయంగా గెలిచిన ఏకైక ఆటగాడు?**
ఎ) ఫ్లాయిడ్ మెవెదర్(అమెరికా)
బి) ఏకియోవ్(ఫిలిప్పీన్స్)
సి) కానర్ మెక్‌గ్రెగర్(ఐర్లాండ్)
డి) రాకీ మార్షియానో(అమెరికా)

5. **ఇటీవల అమెరికాలోని టెక్సాస్, హూస్టన్ నగరాల్లో వరదలకి కారణమైన హరికేన్?**
ఎ) హార్వీ బి) చార్లీ సి) కోర్సన్ డి) కార్లా

6. **భారత సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయ మూర్తిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?**
ఎ) జస్టిస్ అబ్దుల్ నజీర్ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ ఉదయ్ లలిత్ డి) జస్టిస్ నారిమన్

7. **ఈశాన్య రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన 'సంగ్‌తాంగ్ తంపక్' గ్రామం ఏ రాష్ట్రంలోనిది?**
ఎ) మేఘాలయ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) అస్సాం డి) మణిపూర్

8. **తొలి ఎకో పార్కును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఏ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?**
ఎ) కుప్వారా బి) కథువా సి) కార్గిల్ డి) రాజౌరి

9. **అండర్-17 దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (SAFF) చాంపియన్‌షిప్-2017 విజేత?**
ఎ) ఇండియా బి) నేపాల్
సి) ఆఫ్ఘనిస్థాన్ డి) బంగ్లాదేశ్



10. **రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల రచించిన పుస్తకం?**
ఎ) ఫై మెమొరీస్
బి) ఐ డూ వాట్ ఐ డూ
సి) హాఫ్ లయన్ డి) ఎమర్జింగ్ ఇండియా

11. **జాతీయ క్రీడా దినోత్సవం?**
ఎ) ఆగస్టు 28 బి) ఆగస్టు 29
సి) సెప్టెంబరు 1 డి) ఆగస్టు 30

12. **ఇటీవల మరణించిన టోని డి బ్రమ్‌కి సంబంధించి సరైనది?**
ఎ) మార్షల్ ఐలాండ్స్‌కి చెందిన వ్యక్తి
బి) 2015లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు గ్రహీత
సి) పారిస్ పర్యావరణ ఒప్పందానికి మూలపురుషుడు
డి) పైవన్నీ

13. **101 ఏళ్ల వయసులో ఇటీవల మరణించిన రామనందసేన్ గుప్తా ఎవరు?**
ఎ) సాహితీవేత్త బి) సినిమాటోగ్రాఫర్
సి) మాజీ హాకీ క్రీడాకారుడు డి) టీవీ వ్యాఖ్యాత

14. **ఇటీవల భారత్‌లో పర్యటించిన నేపాల్ ప్రధాని?**
ఎ) ఖడ్గప్రసాద్ శర్మ ఓలి బి) పుష్పకుమార్ దహల్
సి) షేర్ బహదూర్ దేవ్‌బా డి) రాంభరణ్ యాదవ్

15. **ఫోర్బ్స్ పత్రిక-2017కి గాను ప్రకటించిన ఆసియాలో అత్యంత ధనవంతుల జాబితాలో తొలిస్థానం పొందింది?**
ఎ) ముకేశ్ అంబానీ బి) జాక్ మా
సి) తదాషి యనాయ్
డి) అల్ వలీద్ బిన్ తూల్

16. **దేశ చరిత్రలోనే తొలిసారి నేషనల్ స్పోర్ట్స్ మ్యూజియాన్ని ఇటీవల ఏ నగరంలో స్థాపించారు?**
ఎ) ముంబై బి) న్యూఢిల్లీ
సి) బెంగళూరు డి) చెన్నై

17. **ఇన్ఫోసిస్ నూతన ఛైర్మన్?**
ఎ) విశాల్ సిక్కా బి) సంజయ్ జంగర్
సి) నందన్ నీలేకని డి) ఇంద్రానూయి

18. **'గోప్యత పరిమితులతో కూడిన ప్రాథమిక హక్కు'గా తొమ్మిది మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనంలో లేనివారు?**
ఎ) జగదీష్‌సింగ్ ఖేహర్, ఎస్.ఎ.బాబ్డే, ఆర్.కె.అగర్వాల్
బి) నారిమన్, ఎ.ఎం.సప్రే, డి.వై.చంద్రచూడ్
సి) మదన్.బి.లోకూర్, ఎన్.వి.రమణ, రణబీర్‌సింగ్
డి) ఎస్.కె.కౌల్, అబ్దుల్ నజీర్, చలమేశ్వర్

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

19. **ఇటీవల ఏ ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకను విధుల నుంచి తొలగించారు?**
ఎ) ఐసిజిఎస్ వరుణ బి) ఐసిజిఎస్ రాజధాని
సి) ఐసిజిఎస్ సామ్రాట్ డి) ఐసిజిఎస్ జిజాబాయి

20. **దేశంలో అంతర్గత రవాణా కోసం భారతీయ ఎయిర్‌లైనర్ 'విస్తారా'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్న అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్?**
ఎ) ఖతార్ ఎయిర్‌లైన్స్(ఖతార్)
బి) కొరెండన్ డచ్ ఎయిర్‌లైన్స్(నెదర్లాండ్)
సి) బ్లూబర్డ్ ఎయిర్‌వేస్(గ్రీస్)
డి) ఎయిర్ కోర్సికా(ఫ్రాన్స్)

21. **రైల్వే బోర్డు నూతన ఛైర్మన్?**
ఎ) సుధా మిశ్రా బి) అతులేష్ జిందాల్
సి) స్మృతి నారాయణ్ కాకరే డి) అశ్వని లోహాని

22. **ఒడిశా ప్రభుత్వం అందించే 'బిజూపట్నాయక్ అవార్డు ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్'ని 2016కి గాను పొందింది?**
ఎ) ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావు
బి) ప్రొఫెసర్ దిగంబర్ బెహెరా
సి) ప్రొఫెసర్ మన్నెల్లి లక్ష్మీకాంతం
డి) డాక్టర్ ఎ.మోహన్‌రావు

23. **తమిళనాడు నూతన ఉపముఖ్యమంత్రి?**
ఎ) టి.వి.దినకరన్ బి) ఒ.పన్నీర్ సెల్వం
సి) జయరామన్ డి) ముత్తుస్వామి

24. **కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన 'స్వస్థ్ బచ్చే స్వస్థ్ భారత్'ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఎక్కడ ప్రారంభించాడు?**
ఎ) కొచ్చి(కేరళ) బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) పట్నా(బీహార్) డి) మజోలి(అస్సాం)

25. **ధర్మేంద్ర కుమార్ ఏ సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా ఎంపికయ్యారు?**
ఎ) బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బిఎస్ఎఫ్)
బి) రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్)
సి) సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)
డి) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటిబిపి)

26. **ఇటీవల సైన్యంలో చేరిన LR-SAM క్షిపణి ప్రత్యేకతలు?**
ఎ) భారత్ - ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి
బి) ఉపరితలం నుంచి గగనతలం ప్రయోగిస్తారు
సి) 2017 ఆగస్టులో నేవీలో ప్రవేశపెట్టారు
డి) పైవన్నీ

27. **ఎలక్ట్రానిక్ వ్యర్థాలను(e-waste) పాఠశాలల నుంచి తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించిన రాష్ట్రం?**
ఎ) కర్ణాటక బి) కేరళ సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్

28. **జన్యు పరివర్తన పంటలపై ఇటీవల సూచనలు చేసిన పార్లమెంటరీ కమిటీకి నేతృత్వం వహించింది?**
ఎ) రేణుకా చౌదరి బి) శంతను కుమార్
సి) ముకుల్ ముద్గల్
డి) టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్

29. **లింగ సమానత్వం కోసం 'జండర్' ప్రస్తావన లేకుండా పాస్‌పోర్టులు జారీ చేయాలని నిర్ణయించిన దేశం?**
ఎ) మెక్సికో బి) నెదర్లాండ్స్
సి) పోర్చుగల్ డి) కెనడా

30. **భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ తొలి 'విదేశీభవన్'ను ఏ నగరంలో ప్రారంభించారు?**
ఎ) ముంబై బి) అహ్మదాబాద్
సి) చెన్నై డి) బెంగళూరు

31. **ఆర్మీ నియామకాల్లో స్వలింగ సంపర్కులకు నిషేధం విధిస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు జారీ చేసిన దేశం?**
ఎ) ఐర్లాండ్ బి) నైజీరియా సి) ఫ్రాన్స్ డి) అమెరికా



32. **స్వలింగ సంపర్కుల కోసం తొలిసారిగా గురుగ్రాం (హర్యానా)లో నిర్వహించిన 'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత?**
ఎ) నటాషా బి) తొలాయ్
సి) రవీణ డి) లటిసియా

33. **ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ 2016 గణాంకాల ప్రకారం అతి తక్కువ పర్యాటకులు సందర్శించిన దేశం?**
ఎ) ఫిజి బి) నౌరు సి) ఆఫ్ఘనిస్థాన్ డి) తువాలు

34. **2017 ఆగస్టు 31న నిర్వహించనున్న హిందూ మహాసముద్ర దేశాల సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న నగరం?**
ఎ) సింగపూర్ సిటీ బి) కొలంబో
సి) బ్యాంకాక్ డి) న్యూఢిల్లీ

35. **నేపాల్ - భారత్ మధ్య ఏ నదిపై వంతెన నిర్మాణానికి భారత్ ఆమోదం తెలిపింది?**
ఎ) మోచి నది బి) తమూర్ నది
సి) అరుణ్ నది డి) కనకయ్ నది

36. **షాంఘై కేంద్రంగా బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ తన తొలి ప్రాంతీయ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేసింది?**
ఎ) పోర్టలెజా(బ్రెజిల్) బి) సోచి(రష్యా)
సి) హంగ్జౌ(చైనా)
డి) జోహాన్నెస్‌బర్గ్(దక్షిణాఫ్రికా)

37. **2017 ఆగస్టు 26న కేంద్రం ఏ దేశం నుంచి బంగారం, వెండి దిగుమతులను పూర్తిగా నిషేధించింది?**
ఎ) జపాన్ బి) దక్షిణాఫ్రికా
సి) దక్షిణ కొరియా డి) కజకిస్థాన్

38. **బెల్జియం గ్రాండ్‌ప్రి-2017 ఫార్ములావన్ విజేత?**
ఎ) సెబాస్టియన్ వెటెల్ బి) లూయిస్ హామిల్టన్
సి) డేనియల్ రిక్కార్డో డి) నికో రోజ్‌బర్గ్

39. **'జాట్'లను ఓబీసీ జాబితాలో చేర్చి ఇటీవల ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రం?**
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్

40. **2017 అక్టోబరులో భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?**
ఎ) సూర్యకిరణ్ బి) యుద్ధ అభ్యాస్
సి) ఏకువీరన్ డి) వజ్ర

సమాధానాలు

1) సి	7) డి	13) బి	20) ఎ	27) బి	34) బి
2) డి	8) డి	14) సి	21) డి	28) ఎ	35) ఎ
3) బి	9) ఎ	15) బి	22) బి	29) డి	36) డి
4) ఎ	10) బి	16) బి	23) బి	30) ఎ	37) సి
5) ఎ	11) బి	17) సి	24) ఎ	31) డి	38) బి
6) బి	12) డి	18) సి	25) బి	32) ఎ	39) డి
		19) ఎ	26) డి	33) డి	40) బి

JOBS ఉద్యోగాలు

ఎఎస్ఆర్‌బి

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఎఎస్ఆర్‌బి)- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సహకారంతో **స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, లోయర్ డివిజన్ క్లర్క్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టుల వారీ ఖాళీలు: స్టెనోగ్రాఫర్ 95, క్లర్క్ 78
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత + స్టెనోగ్రఫీ పరిజ్ఞానం + టైపింగ్ నాలెడ్జ్ ఉండాలి.
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టెనో అభ్యర్థులకు ప్రొఫెషనల్ ఎబిలిటీస్ టెస్ట్ కింద నిమిషానికి 80 పదాల వేగంతో 10 నిమిషాల డిక్టేషన్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఇంగ్లీష్ మేటర్‌ను 50 నిమిషాల్లో, హిందీ మేటర్‌ను 65 నిమిషాల్లో కంప్యూటర్‌మీద ట్రాన్స్‌స్క్రైబ్ చేయాలి. క్లర్క్ పోస్టులకు కంప్యూటర్ మీద నిముషానికి 35 ఇంగ్లీష్ పదాలు/ 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి.
అడ్మిషన్ సర్టిఫికెట్ డౌన్‌లోడింగ్: అక్టోబరు 14
సిబిటి నిర్వహించే తేదీ: అక్టోబరు 29
దరఖాస్తు ఫీజు: రూ.200(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మెన్/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 25
వెబ్‌సైట్: www.asrb.org.in, www.icar.org.in

ఐఐఐటి

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి)- కింది పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఆఫీసర్ - ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + 10 నుంచి 12 ఏళ్ల అనుభవం ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మన్‌కు ప్రాధాన్యం ఉంటుంది.
గర్ల్స్ & బోయ్స్ హాస్టల్ - కేర్ టేకర్స్ & సూపర్‌వైజర్స్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం + కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉండాలి
ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ఫర్ గర్ల్స్
అర్హత: ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ + బాలికలకు స్పోర్ట్స్ & ఫిజికల్ యాక్టివిటీస్ నిర్వహించడంలో కనీసం 5 నుంచి 7 ఏళ్ల అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి
ఇమెయిల్: recruitment@iiits.in
వెబ్‌సైట్: www.iiits.ac.in

ఎన్‌టిపిసి

ఎన్‌టిపిసి లిమిటెడ్ ఆధ్వర్యంలోని రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్- **మెడికల్ కన్సల్టెంట్స్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 5
పోస్టులు: జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 2, స్పెషలిస్ట్స్ (సర్జరీ 1, ఇఎన్‌టి 1, ఆర్థోపెడిక్స్ 1)
కాంట్రాక్ట్ వ్యవధి: ఆరు నెలలు
అర్హత - వేతనం: సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసినవారికి నెలకు రూ.75,000; ఎంబిబిఎస్ + సంబంధిత విభాగంలో పీజీ డిప్లొమా పూర్తి చేసినవారికి నెలకు రూ.63,000; ఎంబిబిఎస్ (జిడిఎంఒ) ఉత్తీర్ణులైనవారికి నెలకు రూ.53,000 చెల్లిస్తారు.
ఇంటర్వ్యూ: సెప్టెంబరు 13న
వేదిక: Dhanwantari Hospital, NTPC Ltd, Jyothinagar(PO), Railway Station: Ramagundam, Bus Station: Godavarikhani, Dt. Peddapalli
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి.
ఇ-మెయిల్: adhocrstps@ntpc.co.in

నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?

ద్రవ పదార్థాలు

1. ద్రవ ప్రియ కొల్లాయిడ్‌కు ఉదాహరణ?
ఎ) పాలు బి) బంక సి) పొగమంచు డి) రక్తం
2. జెల్ తయారీలో ఉపయోగించే సూత్రం?
ఎ) సస్పెన్షన్ బి) సినారసిస్
సి) స్టెనోసిస్ డి) అస్మోసిస్
3. కొల్లాయిడ్ సోల్ అంటే?
ఎ) నిజ ద్రావణం బి) అవలంభన ద్రావణం
సి) విజాతి సోల్ డి) సజాతి సోల్
4. పొగమంచు కొల్లాయిడ్ విధానం?
ఎ) గాలిలో విస్తరించిన ద్రావణం
బి) గాలిలో విస్తరించిన గాలి
సి) గాలిలో విస్తరించిన ఘనం
డి) ద్రావణంలో విస్తరించిన ఘనం
5. ఫొటో కెమికల్ స్మాగ్ దేని ఉత్పత్తి?
ఎ) పెరాక్సైడ్ నైట్రేట్ బి) కార్బన్ మోనాక్సైడ్
సి) కార్బన్ డై ఆక్సైడ్ డి) ఓజోన్
6. నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?
ఎ) ఆహార తయారీ
బి) సుగంధలేపన సి) రంగు తయారీలో
డి) ఫార్మాస్యూటికల్
7. వర్షం నీటి కన్నా నదీ జలాలు కఠినంగా ఎందుకుంటాయి?
ఎ) నది ఎల్లప్పుడూ ప్రవహిస్తుంది
బి) నది సోడియం క్లోరైడ్‌ను కలిగి ఉంటుంది
సి) నది కాల్షియం, మెగ్నీషియం లవణాలను కలిగి ఉంటుంది డి) పైవన్నీ
8. పేపర్ మీద వేలిముద్రలను కనగొనడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) సిల్వర్ నైట్రేట్ బి) నిక్‌హైడ్రిన్
సి) యూనివర్సల్ గ్రేపౌడర్ డి) ఏదీకాదు
9. ఇంజక్షన్‌ను స్టెరిలైజేషన్ చేయడానికి ఉపయోగించే పద్ధతి?
ఎ) ఆల్కహాల్‌లో కొద్దిసేపు నిల్వ ఉంచాలి
బి) నీటిలో వేడి చేయాలి
సి) ప్రెషర్ కుక్కర్‌లో వేడి చేయాలి డి) ఏదీకాదు
10. కింది వాటిలో నీటి శుద్ధ స్థితి ఏది?
ఎ) వర్షం నీరు బి) బావి నీరు
సి) కుళాయి నీరు డి) స్వేదన జలం
11. నీటిలోని ఆక్సిజన్ ఎన్ని Mg/liter కన్నా తక్కువ ఉండరాదు?
ఎ) 4 బి) 2 సి) 5 డి) 2
12. నూనె కలిపిన కాస్టిక్ సోడా ద్రావణాన్ని వేడి చేయగా వచ్చే పదార్థాన్ని దేని తయారీలో ఉపయోగిస్తారు?
ఎ) ఇంధనం బి) ఎరువులు
సి) సబ్బులు డి) ప్లాస్టిక్
13. ప్రభుత్వం సరఫరా చేసే నీటిని సాధారణంగా శుద్ధి చేసే పద్ధతి?
ఎ) క్లోరినేషన్ బి) అంశిక స్వేదనం
సి) వడపోత డి) డికాంటేషన్
14. చక్కెర కిణ్వన ప్రక్రియలో ఏర్పడే ప్రధాన ద్రవం?
ఎ) మిథైల్ ఆల్కహాల్ బి) ఈథైల్ ఆల్కహాల్
సి) మిథేన్ డి) బ్యూటేన్
15. రాకెట్ ఇంధనాన్ని మండించడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) లెడ్ పెరాక్సైడ్ బి) మెగ్నీషియం ఆక్సైడ్
సి) అమ్మోనియం పర్‌క్లోరేట్
డి) పొటాషియం క్లోరేట్
16. మంచు ముక్కలు గాలిలో కన్నా నీటిలో త్వరగా కరగడానికి కారణం?
ఎ) నీరు గాలి కన్నా ఎక్కువ బరువైనది
బి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో తక్కువ
సి) నీరు, మంచు సంఘటనం సమానం
డి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో ఎక్కువ
17. ఆర్ద్రతను కొలిచే పరికరం?
ఎ) థర్మామీటర్ బి) హైడ్రోమీటర్
సి) హైగ్రోమీటర్ డి) బారోమీటర్
18. చల్లని నీటిలో పూర్తిగా రూపాంతరం చెందనిది?
ఎ) బెంజోయికామ్లం బి) చక్కెర
సి) వంటసోడా డి) కాస్టిక్‌సోడా
19. పెట్రోల్ వల్ల కలిగే మంటలను ఆర్పేందుకు నీటిని ఉపయోగించరు ఎందుకు?
ఎ) నీటి చల్లదనం కన్నా మంటలు అధికంగా ఉంటాయి
బి) నీరు, పెట్రోల్ రసాయనికంగా చర్య జరుగుతుంది
సి) నీరు, పెట్రోల్ ఒకదానితో ఒకటి కలిసిపోయి పై పొరలోని పెట్రోల్ మండుతుంది
డి) ఏదీకాదు
20. నీరు మరిగే స్థానం?
ఎ) ఎల్లప్పుడూ 100°C
బి) వాతావరణ పీడనంపై ఆధారపడి ఉంటుంది
సి) సాపేక్ష ఆర్ద్రతపై ఆధారపడుతుంది
డి) సాంద్రతపై ఆధారపడుతుంది
21. వాతావరణం కలిగి ఉండే నీటిఆవిరి పరిమాణం కింది వాటిలో దేనిపై ఆధారపడుతుంది?
ఎ) ఉష్ణోగ్రత పెరిగితే నీటి పరిమాణం పెరుగుతూ ఉంటుంది
బి) ఉష్ణోగ్రత తగ్గితే ఆవిరి పరిమాణం తగ్గుతుంది
సి) ఉష్ణోగ్రతపై ఆధారపడదు డి) ఏదీకాదు



వేముల అశోక్
సీనియర్ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ

22. శరీరంపై మరుగుతున్న నీరు పడినప్పుడు కంటే వేడి నీటి ఆవిరి వల్ల ఎక్కువ బొబ్బలు ఎందుకు వస్తాయి?
ఎ) నీటి ఆవిరి శరీరంలోకి తొందరగా చొచ్చుకొని పోతుంది
బి) నీటి ఆవిరి అధిక ఉష్ణోగ్రతలను కలిగి ఉంటుంది
సి) నీటి ఆవిరికి వేడి నీటి కంటే శక్తి అధికం
డి) నీటి ఆవిరి అధిక పీడనాన్ని కలిగి ఉంటుంది
23. అరచేతిలో 'ఈథర్' ద్రావణం పోసినప్పుడు చల్లగా ఉండటానికి కారణం?
ఎ) ఈథర్ చల్లని ద్రావణం కనుక
బి) భాష్పీభవనం చెందుతుంది
సి) స్వేద రంధ్రాలను చేరుతుంది
డి) అరచేతిలో కందెనగా మారడం వల్ల
24. ఒక వ్యక్తి సముద్రపు నీటిలోకి ప్రవేశించగానే చల్లదనం పొందిన భావనకు గురవుతాడు. ఎందుకు?
ఎ) ఉష్ణ సంవహన ప్రవాహాలు
బి) శరీరంలో ఉష్ణ లవణాలు పేరుకుపోవడం
సి) దేహంపై నీరు భాష్పీభవనం వల్ల
డి) భూమికి, సముద్ర నీటికి మధ్య ఉష్ణోగ్రతల భేదం
25. థర్మో ప్లాస్క్‌లో చల్లని లేదా వేడి ద్రవాలు చాలాసేపటి వరకు అలాగే ఉండటానికి కారణం?
ఎ) థర్మో ప్లాస్క్‌లో రెండుగోడల నిర్మాణాలు అధమ ఉష్ణ వాహకంగా పనిచేస్తాయి
బి) ఈ రెండు గోడల నిర్మాణాలకు లోపలి భాగం సిల్వర్ పూత ఉంటుంది
సి) రెండు గోడల నిర్మాణాల మధ్య శూన్య ప్రదేశం ఉంటుంది డి) బి, సి
26. ఒక నదిలో ప్రయాణిస్తున్న నౌక సముద్రానికి చేరిన వెంటనే...
ఎ) కొద్దిగా పైకి లేస్తుంది
బి) కొద్దిగా మునుగుతుంది
సి) అదేవిధంగా కొనసాగుతుంది డి) ఏదీకాదు
27. సముద్రపు సాంద్రత దేనిలో పెరుగుతుంది?
ఎ) సముద్రపు లోతు, లవణీయత తగ్గుతూ ఉంటే
బి) సముద్రపు లోతు, లవణీయత పెరుగుతూ ఉంటే
సి) సముద్రపు లోతు పెరిగి లవణీయత తగ్గుతూ ఉంటే
డి) లవణీయత, సముద్రపు లోతు పెరుగుతూ ఉంటే
28. కింది ద్రవాల్లో ఉత్తమ ఉష్ణవాహకం ఏది?
ఎ) నీరు బి) పాదరసం సి) ఈథర్ డి) ఆల్కహాల్
29. ఘనీభవించిన సరస్సులో చేపలు జీవించి ఉండటానికి కారణం?
ఎ) చేపల రక్తం వేడిగా ఉంటుంది
బి) మంచు కింద భాగంలోని నీరు ఘనీభవనం చెందదు
సి) మంచు ఒక మంచి ఉష్ణవాహకం
డి) ఏదీకాదు
30. రెండు పాదరస బిందువులను కలపగా ఒక పెద్ద బిందువుగా మారడానికి కారణం?
ఎ) కనిష్ఠ ఘనపరిమాణం
బి) గరిష్ఠ తలతన్యత
సి) కనిష్ఠ తలతన్యత వైశాల్యం
డి) గరిష్ఠ ఘనపరిమాణం
31. ఘనీభవించిన సరస్సు పైభాగంలో -15°C ఉష్ణోగ్రత ఉంటే కింది పొరల్లో ఉండే ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 0°C బి) 4°C సి) -15°C డి) -7.5°C
32. శీతల ప్రదేశాల్లో ఉపయోగించే థర్మామీటర్‌లో పాదరసం కన్నా ఆల్కహాల్ ద్రావణాన్ని తీసుకోవడానికి కారణం?
ఎ) ఆల్కహాల్ ఉత్తమ ఉష్ణవాహనం
బి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం తక్కువ
సి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం ఎక్కువ
డి) ఏదీకాదు
33. 97% సముద్రపు నీరు, 3% శుద్ధమైన నీరు ఉండే లవణం?
ఎ) జలావరణం బి) స్ట్రాటో ఆవరణం
సి) శిలావరణం డి) వాతావరణం
34. నీరు అనేది ఒక?
ఎ) ఒక మూలకం బి) ఒక ద్రవం
సి) ఒక మిశ్రమం డి) ఒక సంయోగ పదార్థం
35. నీటిలో ఆక్సిజన్ ఎంత శాతం ఉంటుంది?
ఎ) 86% బి) 96% సి) 21% డి) 100%
36. చెమట ఎక్కువగా పట్టేస్థితి?
ఎ) వేడి అధికంగా ఉండి, గాలిలో తేమ ఉండటం
బి) వేడి అధికంగా ఉండి గాలి పొడిగా ఉండటం
సి) వేడి తక్కువగా ఉండి గాలిలో తేమ ఉండటం
డి) వేడి తక్కువగా ఉండి గాలి పొడిగా ఉండటం
37. వార్షిక గ్లోబల్ ఇన్నోవేషన్ బారోమీటర్‌లో ఇండియా స్థానం?
ఎ) 3 బి) 4 సి) 5 డి) 6
38. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం?
ఎ) ఏప్రిల్ 7 బి) మే 7
సి) ఆగస్టు 7 డి) సెప్టెంబరు 6
39. ఇండియాలో చమురు శుద్ధి కర్మాగారాల సంఖ్య?
ఎ) 19 బి) 18 సి) 17 డి) 16
40. వాటర్ గ్యాస్ అంటే?
ఎ) కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్
బి) కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్
సి) అల్యూమినియం హైడ్రేట్ డి) ఏదీకాదు
41. అనిమోమీటర్ ద్వారా దేన్ని లెక్కించవచ్చు?
ఎ) సముద్ర స్థాయిపైన ఎత్తుని బి) గాలి తేమను
సి) సముద్రపు లోతు డి) గాలి వేగాన్ని
42. వెంచురీ మీటర్ ద్వారా దేన్ని లెక్కిస్తారు?
ఎ) ప్రవాహిరేటు బి) గాలివేగం
సి) సాంద్రత డి) ఆర్ద్రత
43. మేఘాలు ఏర్పడటానికి కింది వాటిలో ఏది అవసరం లేదు?
ఎ) వాతావరణంలోని దుమ్ము కణాలు
బి) నీరు ఆవిరి కావడం సి) నీరు గడ్డకట్టడం
డి) గాలి
44. ద్రవ నైట్రోజన్‌లో దీర్ఘ అపరిశుద్ధమైనది?
ఎ) ద్రవ హీలియం బి) ద్రవ ఆక్సిజన్
సి) ఘన కార్బన్ డై ఆక్సైడ్ డి) ద్రవ హైడ్రోజన్
45. వేసవి ద్రవంగా పిలిచే పదార్థం?
ఎ) పాదరసం బి) నీరు సి) గాలియం డి) రేడియం

సమాధానాలు

1) బి	8) బి	15) సి	23) బి	31) ఎ	39) ఎ
2) బి	9) ఎ	16) డి	24) సి	32) సి	40) ఎ
3) సి	10) ఎ	17) సి	25) డి	33) ఎ	41) డి
4) ఎ	11) ఎ	18) ఎ	26) ఎ	34) డి	42) ఎ
5) డి	12) సి	19) సి	27) డి	35) ఎ	43) సి
6) సి	13) ఎ	20) బి	28) బి	36) ఎ	44) డి
7) సి	14) బి	21) ఎ	29) బి	37) డి	45) సి
		22) సి	30) సి	38) ఎ	

స్కాలర్‌షిప్

నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఎపిటి), హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్(హెచ్‌బిసిఎస్‌ఇ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్‌కు ప్రతిభావంతులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.

విభాగాలు: ఆస్ట్రానమీ, బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్
అర్హత: నవంబరు 30 నాటికి ఇంటర్ లోపు చదువుతున్న విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు
వయసు: 1998 జూలై 1 నుంచి 2003 జూన్ 30 మధ్య జన్మించి ఉండాలి
విభాగం: జూనియర్ సైన్స్
అర్హత: నవంబరు 30 నాటికి పదోతరగతి లోపు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: 2003 జనవరి 1 నుంచి 2004 డిసెంబరు 31 లోపు జన్మించి ఉండాలి.

ఈ ప్రోగ్రామ్‌లో అయిదు స్టేజ్‌లు ఉంటాయి. మొదటి స్టేజ్‌ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఎపిటి) నిర్వహిస్తుంది. మిగిలినవాటిని హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ (హెచ్‌బిసిఎస్‌ఇ) నిర్వహిస్తుంది.

స్టేజ్ 1 - ఫస్ట్ స్టెప్ టు ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్ 2018 ఎగ్జామ్స్: నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఇన్ ఆస్ట్రానమీ (ఎన్ఎస్ఇఎ), బయాలజీ (ఎన్ఎస్ఇబి), కెమిస్ట్రీ(ఎన్ఎస్ఇసి), జూనియర్ సైన్స్ (ఎన్ఎస్ఇజెఎస్), ఫిజిక్స్(ఎన్ఎస్ఇపి)
పరీక్ష తేదీలు: ఎన్ఎస్ఇజెఎస్ ఎగ్జామ్ నవంబరు 19న, మిగతావన్నీ నవంబరు 26న
ఎన్‌రోల్‌మెంట్‌నకు ఆఖరు తేదీ:సెప్టెంబరు 15
ప్రతి సబ్జెక్టులో అర్హత పొందిన మొదటి 300 మందిని స్టేజ్ 2కు అనుమతిస్తారు.
స్టేజ్ 2 ఎగ్జామ్స్: ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్స్ ఇన్ ఆస్ట్రోనమీ, బయాలజీ, కెమిస్ట్రీ, జూనియర్ సైన్స్, ఫిజిక్స్(ఐఎన్ఎఒ, ఐఎన్‌బిఒ, ఐఎన్‌సిహెచ్ఒ, ఐఎన్‌జెఎస్ఒ, ఐఎన్‌పిహెచ్ఒ)
స్టేజ్ 3: ప్రతి సబ్జెక్టులో ఓరియంటేషన్ కం సెలెక్షన్ క్యాంప్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందినవారిని స్టేజ్ 4 కింద ప్రి డిపార్చ్యూర్ ట్రైనింగ్‌కు పంపుతారు. తదుపరి స్టేజ్ 5 ఉంటుంది.
పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
వెబ్‌సైట్: www.iapt.org.in
olympiads.hbcse.tifr.res.in

అడ్మిషన్స్

ఎన్ఐఇఎల్ఐటి

కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఇఎల్ఐటి)- కింద పేర్కొన్న కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **పీజీ డిప్లొమా**

విభాగాలు: క్లవుడ్ కంప్యూటింగ్/ ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ
కాలవ్యవధి: 24 వారాలు
కోర్సులు ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి
విభాగం: ఇండస్ట్రియల్ ఆటోమేషన్ సిస్టం డిజైన్
కోర్సు వ్యవధి: 24 వారాలు
కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 25 నుంచి

జాబ్ ఓరియంటెడ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులు

- **బిగ్ డేటా అనలిటిక్స్**

కోర్సు కాలవ్యవధి: 16 వారాలు
కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి

- **ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ లెవెల్ 1, ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, జావా ఎంటర్‌ప్రైజ్ ఎడిషన్**

కోర్సుల కాల వ్యవధి: 12 వారాలు
కోర్సులు ప్రారంభం: సెప్టెంబరు 11 నుంచి
వెబ్‌సైట్: http://nielit.gov.in/calicut

రైతు బాంధవుడు కేసీఆర్

- రైతు కమిటీల్లో నెంబర్‌వన్‌గా నిలవాలి
- భవిష్యత్తు అవసరాల కోసం కరెంటుని నిల్వ చేసుకుంటున్నాం..
- పాలేరు నియోజకర్గ సమావేశంలో మంత్రి తుమ్మల

ఖమ్మం రూరల్: రాజ్యాధికారంపై ఇబ్బంది వచ్చినా రైతుకంట నీరు రాకుండా అన్నదాత తలెత్తుకుని బతకాలనేదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని.. కేసీఆర్ రైతు బాంధవుడు అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా పరిధిలోని రామ్‌లీలా ఫంక్షన్ హాలులో బుధవారం పాలేరు నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రైతు కమిటీల్లో జిల్లాను రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలపాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో 15మంది, మండల స్థాయిలో 24మంది, జిల్లాస్థాయిలో 24మంది, రాష్ట్ర స్థాయిలో 42మందితో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీల్లో మూడో వంతు మహిళలు, అన్ని సామాజిక వర్గాల రైతులు ఉండాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా 24గంటల కరెంటును, రైతుకు 9 గంటల కరెంటు అందించడం టీఆర్ఎస్ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. ఇరిగేషన్ పనులకు రూ.50వేల కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కోటి ఎకరాల మాగాణి తెలంగాణ కావాలన్నదే కేసీఆర్ లక్ష్యమన్నారు. ఉగాది నాటికి ప్రతి ఇంటింటికి మిషన్ భగీరథ నీటిని అందించి మహిళల కష్టాలు తీర్చనున్నట్టు పేర్కొన్నారు. ఆడపిల్ల పుడితే రూ. 13వేలు, మగబిడ్డ పుడితే రూ. 12వేలు వారి ఖాతాలో జమచేసి ప్రభుత్వం ఆదుకోవడం జరుగుతుందన్నారు. రెవెన్యూ రికార్డును సరిచేస్తేనే రైతు ఎవరి వద్దకు పోవాల్సిన అవసరం ఉండదనే ఉద్దేశ్యంతో రైతు కమిటీల ద్వారా భూసమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ఈ కమిటీలను వేయడం జరుగుతుం దని ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బ్యాంకు బ్యాలెన్స్‌లు ఏ విధంగా సెల్‌ఫోన్‌లో చూసుకుంటున్నారో అదే విధంగా భూమి వివరాలను కూడా ఫోన్‌లో చూసుకునే విధంగా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని, పరిశ్రమల శాఖ చైర్మన్ బేగ్, విత్తనాభివృద్ధి చైర్మన్ కొండబాల, డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ, జడ్పీ చైర్మన్ కవిత, మేయర్ పాపాలాల్, నియోజకవర్గ ఇన్‌చార్జి సాధు రమేష్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు గోపాల్, కార్యదర్శి పంతులునాయక్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బండి జగదీష్, కార్పొరేటర్ రామ్మూర్తినాయక్, జడ్పీటీసీ భారతి, యల్లయ్యనాయక్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు బీమా చెక్కు అందజేస్తున్న మంత్రి తుమ్మల



ఆదేశాల కాపీని అందిస్తున్న డీఈవో

జర్నలిస్టుల పిల్లలకు

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య

ఉత్తర్వులు జారీచేసిన డీఈవో

ఖమ్మం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మీబాయి ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు ఈ ఆదేశాలు అమలు చేయాలని సూచించారు. ఉచిత విద్యాబోధనకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసి వాటి ప్రతులను టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) నాయకులకు బుధవారం అందజేశారు. అధిక మొత్తంలో ఫీజులు చెల్లించి తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించే ఆర్థిక స్తోమత జర్నలిస్టులకు లేదని, ఉచిత విద్యాబోధనకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఇటీవల టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) నాయకులు కలెక్టర్ లోకేష్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తిచేశారు. ఆ మేరకు స్పందించిన కలెక్టర్ తగిన ఉత్తర్వులు జారీ చేయాలని డీఈవోకు సూచించారు. కలెక్టర్ ఆదేశాలమేరకు డీఈవో ఉచిత విద్యకు సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేశారు. అన్ని ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు ఈ ఉత్తర్వులను అనుసరించి జర్నలిస్టుల పిల్లల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్, ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ అధ్యక్షుడు అడపాల నాగేందర్, నాయకులు శ్రీనివాసరావు, సాంబశివరావు, రామకృష్ణ, యాకేష్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ గోపాలరావు

మిషన్ భగీరథ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను

పరిశీలించిన రాష్ట్ర సీఎండీ

వైరా: వైరారిజర్వాయర్ వద్ద మిషన్ భగీరథ మంచినీటి పథకం కోసం నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ట్రాన్స్‌కో సీఎండీ ఎం.గోపాలరావు సందర్శించి పరిశీలించారు. సబ్‌స్టేషన్ సామర్థ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌కో ఖమ్మం ఎస్ఈ కె.రమేష్, వైరా, సత్తుపల్లి డీఈఈలు బి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కన్‌స్ట్రక్షన్ డీఈ బాబూరావు, వైరా ఏఏఈ జగదీష్, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.



ఖమ్మం కలెక్టరేట్ గోదాములో ఉంచిన బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ అశోక్‌కుమార్, జిల్లా అధికారులు

బ్యాలెట్ బాక్సులను

పరిశీలించిన జాయింట్ సెక్రటరీ

ఖమ్మం కలెక్టరేట్: కలెక్టరేట్‌లో నిల్వ ఉంచిన ఈవీఎంలు, బ్యాలెట్ బాక్సులను బుధవారం ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ ఎం.అశోక్ కుమార్ పరిశీలించారు. అర్బన్ తహసీల్దారు కార్యాలయం, రూరల్ కార్యాలయంలో భద్రపరిచిన బాక్సులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 1969నాటి బ్యాలెట్ బాక్సులు ఉన్నాయని, అన్ని ఉపయుక్తంగా ఉన్నాయని డీఆర్వో శివశ్రీనివాస్ జాయింట్ సెక్రటరీకి వివరించారు. కార్యక్రమంలో ఎన్నికల కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ జయసింహారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీనివాసరెడ్డి, అర్బన్ తహసీల్దారు జి.శ్రీలత, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు రాంబాబు, రూరల్ ఆర్ఐ జగదీష్ తదితరులున్నారు.

మరోసారి భద్రాద్రి వైద్యశాలే ప్రథమం

- జనవరి నుంచి నిన్నటి వరకు 470ప్రసవాలు
- తన రికార్డులను తానే తిరగరాస్తున్న ఏరియా ఆసుపత్రి



భద్రాచలం: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు గణనీ యంగా పెరుగుతున్న నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల రాష్ట్రస్థాయిలో అధిక ప్రసవాలను నిర్వహించి మరోసారి ప్రథమస్థానంలో నిలిచింది. నెలకు 91 ప్రస వాలను నిర్వహించాలనే లక్ష్యం ఉండగా భద్రాద్రి వైద్యశాల వైద్యులు ఆగస్టు 30నాటికి 470 ప్రసవాలు చేశారు. గత నెల 455ప్రసవాలు నిర్వహించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన భద్రాద్రి వైద్యశాల బుధవారం నాటికి 470 ప్రసవాలను వైద్యులు చేయడం విశేషం. 2015 అక్టోబర్‌లో 431 ప్రసవాలను చేసి భద్రాచలం వైద్యశాల అధికారులు రాష్ట్రస్థాయిలో ప్రథమంగా నిలువగా.. 2016 అక్టోబర్‌లో 439 ప్రసవాలు చేసి రికార్డు సృష్టించారు. 2017 జూలైలో 455 ప్రసవాలు చేయడంతో మూడోసారి భద్రాద్రి వైద్యశాల ప్రథమస్థానంలో నిలువగా... ఆగస్టు 30 నాటికి 470 ప్రసవాలు చేయడంతో రాష్ట్రస్థాయిలో మరోసారి భద్రాద్రి ఖ్యాతి ఇనుమడించింది. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డా.ఎంవీ కోటిరెడ్డి, డా.మల్లేష్, డా.సరోజ, డా.భార్గవి, డా.శ్రావణిలతో కూడిన వైద్య బృందం ఈ రికార్డును సాధించారు.

నేడు హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ అధికారులతో

సీఎం సమావేశం

హాజరుకానున్న ఇరు జిల్లాల అధికారులు

ఖమ్మం వ్యవసాయం: క్షేత్రస్థాయిలో భూసర్వేలను నిర్వహించి వాస్తవ రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఫలాలను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న గ్రామ రైతు సమన్వయ సమితులపై ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు హైదరాబాద్ రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల నుంచి 100మంది వ్యవసాయశాఖ అధికారులు, ఏవోలు, ఏడీఏలు, డీడీఏ, జేడీఏ స్థాయి అధికారులు పాల్గొననున్నారు. వ్యవసాయశాఖ అన్ని వర్గాల అధికారులతో ముఖ్యమంత్రి నేరుగా సమీక్షా సమావేశం జరపడం ఇదే తొలిసారని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

- కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దుకు మూకుమ్మడి ఆందోళన
- రేపు ఉద్యోగుల సామూహిక సెలవు
- జేఏసీ ఆధ్వర్యంలో విస్తృత పోరాటానికి సమాయత్తం

సీపీఎస్.. నో


ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఉద్యోగుల భవితకు సంబంధించి వారి మెడపై కత్తిలా వేలాడుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేయాలనే డిమాండ్ ఉధృతమవుతోంది. దశలవారీ ఆందోళనల్లో భాగంగా ఇప్పటికే వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు, ఆందోళనలు జరుగుతుండగా.. ఈ కార్యక్రమం మరింత ఉధృతం చేసేందుకు ఉద్యోగులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏకంగా ఒకరోజు సామూహిక సెలవు పెట్టబోతున్నారు..!

- అశ్వారావుపేట రూరల్/ కొత్తగూడెం అర్బన్

సీపీఎస్ విధానం అంటే..?

సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగం చేసిన వ్యక్తి ఉద్యోగ విరమణ పొందిన తరువాత తన కుటుంబాన్ని పోషించుకోవటానికి ప్రభుత్వం నెలనెలా కొంత పెన్షన్ ఇస్తుంది. విరమణ పొందిన ఉద్యోగుల చివరి వేతనాన్ని బట్టి పెన్షన్ సౌకర్యం ఉండేది. దీని వల్ల ఇతర ప్రయోజనాలూ ఉండేవి. ప్రధానంగా అనారోగ్యంబారిన పడిన సమయంలో పెన్షన్ పథకం చాలా ఉపయోగం. కుటుంబ పెద్ద చనిపోయినా ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా ఉంటుంది. అయితే.. 2004 సెప్టెంబర్ ఒకటిన కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని రద్దుచేస్తూ దానిస్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తీసుకువచ్చింది. ఇందుకోసం జీవోలు 653, 654, 655 విడుదల చేసింది. వీటిప్రకారం.. 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ తరువాత ఉద్యోగాల్లో చేరిన ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తించదు. కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానం ప్రకారం ఉద్యోగం చేసే వ్యక్తి నెలనెలా తన వేతనంలో కొంతసొమ్మును జమచేస్తే ప్రభుత్వం మరికొంత సొమ్మును జతచేసి ఉద్యోగ విరమణ పొందే సమయంలో చెల్లిస్తుంది. ఆ తరువాత విశ్రాంతి పొందిన ఉద్యోగికి ప్రయోజనాలూ వర్తించవు. ఒక విధంగా సదరు విశ్రాంత ఉద్యోగికి, ప్రభుత్వానికి సంబంధంలేని సాధారణ వ్యక్తినే ఉంటారు. అంటే ఒక వ్యక్తి 36ఏళ్లపాటు సేవచేసినా కలిగే ప్రయోజనం శూన్యమనేది ఉద్యోగుల వాదన.

1న సామూహిక సెలవు..

నూతన పెన్షన్ విధానాన్ని అమల్లోకి తెచ్చిన నాటినుంచి ఉద్యోగులు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. తమకు ఉద్యోగ భద్రత లేదని, కనీస సదుపాయాలు లేవని, ఎవరైనా ఉద్యోగి మరణించినా సదరు కుటుంబానికి పెన్షన్ వచ్చే పరిస్థితి లేదని ఉద్యోగులు ఆందోళన చేపడుతూనే ఉన్నారు. అయితే.. ఆరంభంలో సీపీఎస్ పరిధిలోకి వచ్చే ఉద్యోగుల సంఖ్య చాలా తక్కువగా ఉండటంతో సమస్యపై పెద్దగా ఎవరూ స్పందించలేదు. ఆ తరువాత ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరగటంతో వివిధ సంఘాలు మద్దతు తెలిపి ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. దీంతో పాటు సీపీఎస్ ఉద్యోగులంతా రాష్ట్ర, జిల్లా, మండలస్థాయిలో కమిటీలు వేసుకుని పోరు ప్రారంభించారు. "సీపీఎస్ అంతం.. ఉద్యోగుల పంతం" అనే నినాదంతో ఉద్యోగ ఉపాధ్యాయులంతా ఆందోళనలకు దిగారు. ఇందులో భాగంగానే పెన్షన్‌ను తీసుకువచ్చిన సెప్టెంబర్ ఒకటో తేదీన సామూహిక సెలవుకు పిలుపునిచ్చాయి. ఇప్పటికే ఉపాధ్యాయులు, పీఆర్, ఆర్అండ్‌బీ, మండల పరిషత్ ఇలా అన్ని శాఖల్లోని ఉద్యోగులు అంతా సెలవు దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపారు. ఉద్యోగులంతా జిల్లా, డివిజన్‌స్థాయి, మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే 30న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు జరగ్గా.. 31న కార్యాలయాల ముందు నిరసన చేపట్టనున్నారు. టీఎన్‌జీవో, రాష్ట్ర సంఘాలు, జేఏసీ పిలుపు మేరకు చేపట్టిన ఈఉద్యమానికి జీపీఎస్ ఉద్యోగులు మద్దతు ప్రకటించారు. ఆందోళనలో తాము భాగస్వాములం అవుతామని ఇప్పటికే ప్రకటించారు.


సామూహిక సెలవు కోరుతూ వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో దాదాపు 15వేల మంది..

2004 తరువాత ఎక్కువగా పోలీస్, విద్యాశాఖలోనే నియామకాలు ఎక్కువగా జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానంలో దాదాపుగా 1.20లక్షల మంది ఉద్యోగులు ఉండగా.. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం దాదాపు 15వేల మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 4వేల మంది వరకు ఉపాధ్యాయులే ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో అటెండర్ నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు సీపీఎస్ విధానంలో విధులు నిర్వహిస్తున్నారు. రానురానూ కొత్తగా వచ్చే ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో.. సీపీఎస్ ఉద్యోగుల సంఖ్య అనతికాలంలో దాదాపు 20వేల వరకు చేరే అవకాశం ఉన్నట్లుగా ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

ఉపశమనమైనా కలిగితే..

సీపీఎస్ విధానంపై ఇచ్చిన ఉత్తర్వులను పూర్తిగా రద్దుచేయటం కేంద్రప్రభుత్వ పరిధిలోని అంశం. అయితే.. రాష్ట్ర పరిధిలో అవకాశం ఉన్నంత వరకు మార్పులు చేసే అవకాశం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీవోల్లో ఒకటైన 653ను ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వమే రద్దుచేసింది. దీని ద్వారా ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఫ్యామిలీ పింఛను వస్తుంది. ఈ సౌకర్యం ఆంధ్రప్రదేశ్‌లో అమల్లో ఉన్నా.. తెలంగాణ సర్కారు మాత్రం అమలు చేయట్లేదు. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదన చెందుతూ ఆందోళన బాట పట్టారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని గ్రాట్యూటీ, ఫ్యామిలీ పింఛను అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.. ప్రభుత్వం మిన్నకుండటంతో ప్రస్తుతం సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలనే లక్ష్యంతోనే ఉద్యోగులు పోరుబాట పట్టారు.

పాతపింఛన్ విధానాన్నే ఉద్యోగులు కోరుకుంటున్నారు అంటే..

2004కు పూర్వం ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు పదవీ విరమణ గ్రాడ్యూటీ, డెత్ గ్రాడ్యూటీ, సర్వీసు గ్రాడ్యూటీ ఉండేది. జీపీఎఫ్ ఖాతాలో మెచ్యూరిటీ మొత్తానికి ఆదాయం పన్ను లేదు. పదవీ విరమణ ముందు మిగిలిన సెలవులను జీతంగా మార్చుకునే అవకాశం ఉంది. కాంపెన్సేషన్ పింఛన్, ఇన్‌వాలిడ్ పింఛన్, సూపర్ యాన్యుమేషన్, పదవీ విరమణ పింఛన్ ఉండేది. పదవీ విరమణ తర్వాత డీఏ పెరిగితే పింఛన్‌కు డీఏ కలుస్తోంది. ప్రావిడెంట్ ఫండ్ సదుపాయం ఉంటుంది. పింఛన్‌కు ప్రభుత్వం గ్యారెంటీగా ఉండేది. ఉద్యోగ సమయంలో ఒక రూపాయి జమ చేయాల్సిన పరిస్థితి లేదు. ఆరోగ్య భద్రత జీవిత కాలం లభిస్తోంది.

కొత్త పింఛన్ (సీపీఎస్)ను ఎందుకు ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు అంటే..

2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి సీపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఉద్యోగి వేతనంలో 10శాతం (మూలవేతనం, డీఏ), ప్రభుత్వం దానికి 10శాతం కలిపి ఇస్తోంది. ఉద్యోగి పదవీ విరమణ సమయంలో జమ చేసిన మొత్తంలో 60శాతం తిరిగి చెల్లిస్తారు. దానిలో ఆదాయ పన్ను తీసుకుంటారు. 40శాతం యాన్యుటీ కొన్నక దీనిపై వచ్చే మార్కెట్ అధారిత ఆదాయం మాత్రమే ఉంటుంది. ప్రావిడెంట్‌ఫండ్‌కు అర్హత లేదు. ప్రభుత్వ గ్యారెంటీ లేదు. షేర్‌మార్కెట్‌పై ఆధారపడి ఉంటుంది. మూల వేతనం, డీఏ నుంచి ప్రతినెల 10శాతం జమచేయాలి. 70 సంవత్సరాల వరకు కల్పిస్తారు. పింఛన్ శాశ్వత గుర్తింపు సంఖ్య (ప్రాన్) చాలా కాలంగా కేటాయించలేదు. దీని ప్రభావం పింఛన్‌పై పడుతుంది. కేంద్ర ప్రభుత్వం గ్రాడ్యూటీపై నిర్ణయం తీసుకున్న, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. భవిష్యత్‌లో ఎలాంటి పింఛన్ ఉండదు. ప్రభుత్వ ఉద్యోగులకు భవిష్య భరోసా ఉండాలంటే పాత పింఛన్ విధానమే ఉండాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఐదేళ్లు పదవిలో ఉండే వాళ్లకు ఇస్తూ..
జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, అనంతారం, భద్రాద్రి జిల్లా

ఐదేళ్లు ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారికి పింఛను సౌకర్యం ఉన్నా.. దాదాపు 33ఏళ్లపాటు ప్రజలకు సేవలు అందించే ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం లేకపోవటం విచారకరం. ఉద్యోగుల జీవితాలకు ప్రతిబంధకమైన సీపీఎస్ విధానం తీసుకురావటమే పద్ధతి కాదు. ప్రభుత్వం వెంటనే స్పందించి సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దుచేయాలి.



రద్దయ్యే వరకు పోరాటం..
లక్ష్మణ్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సీపీఎస్ విధానంతో ఉద్యోగులకు మనశ్శాంతి లేకుండా పోయింది. పోటీపడి ఉద్యోగాలు సాధించిన వారికి పింఛను విధానం లేకుంటే ప్రైవేటు ఉద్యోగాలే మేలన్న అభిప్రాయం కలుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సీపీఎస్‌పై ఆందోళన తీవ్రతరం చేశాం. ఉపశమనాలు అనేవి కాకుండా పూర్తిగా రద్దయ్యే వరకు పోరాటం చేస్తాం.



తెలంగాణా ఉద్యమ తరహాలో..
హీరాలాల్, టీఎస్‌సీపీఎస్‌ఈఏ భద్రాద్రి జిల్లా కార్యదర్శి

ఉద్యోగ భద్రతలేని సీపీఎస్ విధానం అంతమయ్యే వరకు తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమించిన తరహాలోనే ఆందోళన కొనసాగిస్తాం. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏకతాటిపై నిలిచి సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చస్తాం. ఉద్యోగులంతా ఆందోళనల్లో భాగస్వాములుగా మారి ప్రభుత్వానికి గుణపాఠం నేర్పాలి.



సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- ఉద్యోగ జేఏసీ నిరసన ప్రదర్శన, ధర్నా
- ఉద్యోగుల హక్కులను కేంద్రం హరిస్తోందని ఆగ్రహం


కలెక్టరేట్‌లో ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకుల నిరసన

ఖమ్మం కలెక్టరేట్: 'ఉద్యోగుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని కాంట్రి బ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను పద్ధతిని కొనసాగించాలని' ఉద్యోగ జేఏసీ నాయకులు పి.రామయ్య, ఏ.శ్రీనివాస రెడ్డి, రవీంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉద్యోగ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఎస్ రద్దుకోరుతూ బుధవారం ఖమ్మంలో ఉద్యోగ సంఘాలు భారీ ప్రదర్శన నిర్వహించాయి. కలెక్టరేట్, జిల్లా పరిషత్ ఉద్యోగులు, ఎన్నెస్పీ, నీటిపారుదలశాఖ వంటి 30 శాఖల ఉద్యోగులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడు తూ... సీపీఎస్ విధానం ప్రభుత్వ ఉద్యోగులకు తీరని నష్టాన్ని కలిగిస్తోందన్నారు. ఉద్యోగ సంఘాలు పలుమార్లు కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ అభ్యంతరాలను వెల్లడిస్తున్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. దీనికి తోడు.. మరణిం చిన రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం తరపున చెల్లించకూడదనే నిర్ణయం దారుణమని అన్నారు. కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా ఉద్యోగులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తొలుత మోటారు సైకిళ్ల ర్యాలీ కలెక్టరేట్ నుంచి బయల్దేరి వైరా రోడ్ మీదుగా, బస్‌డిపో గట్టయ్య సెంటర్ నుంచి తిరిగి కలెక్టరేట్‌కు చేరుకుంది. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో శివశ్రీనివాస్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో ట్రాసా నాయకులు కె శ్రీనివాసరావు, నాల్గోతరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కోడి లింగయ్య, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ జనరల్ సెక్రటరీ మల్లెల రవీంద్రప్రసాద్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి వేల్పుల విజేత, టీజీవో కార్యదర్శి కస్తాల సత్యనారాయణ, టీఎన్జీవో పట్టణ నాయకులు వల్లోజి శ్రీనివాసరావు, ఆర్వీఎస్ సాగర్, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, రమణయాదవ్, బుల్లెట్ శ్రీను, ఎం శ్రీనివాసరావు, కిశోర్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసరావు, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు జి శేషప్రసాద్, నవాబ్‌పాషా, ఆల్బర్ట్, రమేష్, నాల్గోతరగతి ఉద్యోగ సంఘాల నాయకులు కె అచ్చయ్య, నాగేశ్వరరావు, బిక్కు, పెన్షనర్స్ సంఘం నాయకులు గుజ్జరు పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం


నీట మునిగిన స్నాన ఘట్టాలు

భద్రాచలం: ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది. మంగళవారం సాయంత్రం 17 అడుగులున్న గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 25 అడుగులకు చేరింది. ఇది మరికొద్దిగా పెరిగి అనంతరం నిలకడ కానుందని అధికారులు పేర్కొంటున్నారు. ఎగువన ఉన్న ఇంద్రావతి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు పడటంతో గోదావరి నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం పేరూరు వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుతుండగా దుమ్ముగూడెం, భద్రాచలం వద్ద స్వల్పంగా పెరుగుతోంది. బుధవారం భద్రాచలం గోదావరి నిమజ్జన ప్రాంతాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయకపోవడం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. అలాగే గోదావరిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఇష్టానుసారంగా స్నానాలు నిర్వహిస్తున్నారు.

ఇదేం మాయ..!


భక్తులకు విక్రయించే లడ్డూ

- కౌంటర్లలో 400 లడ్డూల లోటు..?
- ఉద్యోగితో డబ్బు కట్టించిన భద్రాద్రి దేవస్థానం అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సరికొత్తగా లడ్డూల లోటు తెరపైకి వచ్చింది. రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు విక్రయించేందుకు నిత్యం లడ్డూలను సిద్ధం చేసి కౌంటర్లకు సరఫరా చేస్తుంటారు. అందులో సుమారు 400 లడ్డూలు తక్కువగా వచ్చినట్లు దేవస్థానం ఈవో కె.ప్రభాకర శ్రీనివాస్‌కు సమాచారం అందడంతో.. వెంటనే దీనిపై విచారణ జరపాలని రామాలయ పర్యవేక్షకుడిని ఆదేశించారని సమాచారం. దీంతో బుధవారం ఉదయం లడ్డూలను లెక్కించగా సుమారు 400 లడ్డూలు తక్కువగా వచ్చినట్లు తెలిసింది. దీంతో వాటికి సంబంధించిన సొమ్మును సంబంధిత ఉద్యోగి నుంచి దేవస్థానం అధికారులు వసూలు చేసినట్టు సమాచారం. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వాస్తవానికి దేవస్థానం విక్రయించే రూ.15ల లడ్డూ బరువు 80 గ్రాములుండాల్సి ఉండగా దేవస్థానం అధికారులు తయారు చేసిన లడ్డూల బరువు కాంటాలో చూస్తే కొన్ని లడ్డూలు 85 నుంచి 90గ్రాముల మధ్య ఉన్నట్లు తెలిసింది. దీంతో కావాలనే ఎవరైనా తెర వెనుక ఉండి చేశారా అనే అనుమానాలను దేవస్థానానికి చెందిన పలువురు ఉద్యోగులు అంతర్గతంగా వ్యక్తం చేస్తున్నారు.

అమ్మో లడ్డూ విభాగమా....?


దేవస్థానంలో లడ్డూ విభాగంలో బాధ్యతలు నిర్వహించాలంటేనే దేవస్థానం ఉద్యోగులు హడలెత్తుతున్నారు. దశాబ్దంన్నర కాలంగా దేవస్థానంలో లడ్డూ కౌంటర్లో బాధ్యతలు నిర్వహించి చేతిలో డబ్బులు కట్టకుండా బయటకు వచ్చిన వారు లేరంటే అతిశయోక్తి కాదు. అయితే ఇందులో కొందరు చేతివాటం ప్రదర్శించిన వారు ఉన్నా మరికొంత మంది జరిగిన నష్టం ఏమిటో కూడా తెలుసుకునే లోపే భారీ మొత్తాల్లో దేవస్థానానికి డబ్బులు చెల్లించిన సందర్భాలున్నాయి. రెండు నెలల్లో ఇలా ఇరువురు ఉద్యోగులు లడ్డూల కొరత రావడంతో తమ డబ్బులను దేవస్థానానికి చెల్లించాల్సి వచ్చిందని దేవస్థానం ఉద్యోగులే అంతర్గతంగా పేర్కొంటున్నారు. దీంతో అసలు లడ్డూ విభాగంలో పని చేయాలంటేనే దేవస్థానం ఉద్యోగులు హడలెత్తుతున్నారు. అధికారుల ఉత్తర్వులతో పనులు చేయాల్సి వచ్చినా చివరకు క్రమశిక్షణ చర్యలకు గురవుతున్నారని తెలుస్తోంది.

ఇంకా మాన్యువల్ విధానమేనా?

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న నేటి కాలంలో భద్రాద్రి దేవస్థానంలో లడ్డూల విక్రయాల్లో ఇంకా మాన్యువల్ విధానంనే అనుసరిస్తుండటం గమనార్హం. అయితే ఇక్కడ ఈ విధానాన్ని అమలు చేయడంతో కొందరు సిబ్బందికి ఆర్థికంగా లబ్ధి చేకూరుతుండగా మరికొందరు నష్టపోతున్న సందర్భాలున్నాయి. వీటిని నిరోధించేందుకు ఆన్‌లైన్ టికెటింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే ఏపీలోని విజయవాడ కనకదుర్గ దేవస్థానంలో అమల్లో ఉన్న విధానం(ఇడ్లీపాత్ర మాదిరి) లడ్డూల తయారీకి వినియోగిస్తే దేవస్థానం ఉద్యోగులకు ఆర్థిక అవస్థలు తప్పే అవకాశాలున్నాయి. లేదంటే కొందరు చేస్తున్న అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

చేప పిల్లల పంపిణీకి సర్వం సిద్ధం

- ఉచిత కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి
- 2న ప్రారంభించనున్న మంత్రి తుమ్మల



ఖమ్మం వ్యవసాయం: చేప పిల్లల ఉచిత పంపిణీ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఖమ్మం జిల్లాలోని 1,166 జలాశయాల్లో రూ.3.71 కోట్లతో చేప పిల్లలను వదిలేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. వచ్చే నెల రెండో తేదీన మంత్రి తుమ్మల చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నది. జిల్లాలో మొత్తం 1162 చెరువులు ఉన్నాయి. మరో నాలుగు రిజర్వాయర్లు (పాలేరు, బేతుపల్లి గంగారం, లంకాసాగర్, వైరా) ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి ఆరు నుంచి ఎనిమిది వేల టన్నుల వరకు మత్స్య సంపద ఉత్పత్తి అవుతోంది. ఈ మొత్తాన్ని 20వేల టన్నుల వరకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు మత్స్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో చేపల మార్కెట్లను పెంచే దిశగా జిల్లా యంత్రాంగం ప్రణాళికలు తయారు చేస్తోంది.

మంత్రి తుమ్మల ప్రారంభిస్తారు..
- హనుమంతరావు, జిల్లా మత్స్యశాఖాధికారి

చేప పిల్లల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని లంకాసాగర్‌లో ఈ నెల 2న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో మత్స్య సంపద మరింత అభివృద్ధి చెందుతుంది. సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

వర్షం తెచ్చిన తంటా..

ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో వైరా మండలంలోని పెసర రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎడతెరపి లేకుండా రోజూ ఏదో ఒకసమయంలో వర్షాలు కురవడంతో కోతకు వచ్చిన పెసరకాయ మొత్తం తడిసి పోయింది. తప్పని పరిస్థితుల్లో యంత్రాలతో కోసిన పెసలను ఆరబెట్టుకునేందుకు కూడా ఎండ లేకపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈ పరిస్థితుల్లో చివరకు కూలర్లు, ఫ్యాన్ల సహాయంతో పెసలను ఆరబెడుతున్నారు. కేవలం బుధవారం మాత్రమే వర్షం రాలేదు. ఇప్పటికే.. పెసలు రంగుమారడతో ఆవేదనకు గురవుతున్నారు.

- వైరా


రంగుమారిన పెసలు


కూలర్‌తో పెసలు ఆరబెట్టిన దృశ్యం

వ్యక్తి అదృశ్యంపై కేసునమోదు

క్రైం: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసునమోదయ్యింది. మామిళ్ల గూడేనికి చెందిన సోమ శివప్రసాద్ మిల్క్ డెయిరీలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాక పోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో శివప్రసాద్ సోదరుడు మణిప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు

● ఆదిత్య	వీఐపీ - 2
● వినోద	ఫిదా
● సుందర్‌మ్యాక్స్	ఆనందోబ్రహ్మ
● నర్తకి	అర్జున్‌రెడ్డి
● తిరుమల	జయజానకినాయక
● కిన్నెరసాని	వివేకం
● శ్రీనివాస	నేనే రాజు నేనే మంత్రి

బస్సుల వేళలు



ఖమ్మం నుంచి హైదరాబాద్

● ఇంద్ర

● ఉదయం : 5.00, 6.00, 10.30, 1.00 (బీహెచ్‌ఈఎల్)

● మధ్యాహ్నం : 12.00, 1.00, 2.30 (బెంగళూరు)

● సాయంత్రం : 4.30, 6.00

● రాత్రి : 11.30, 12.30

● సూపర్ లగ్జరీ

● ఉదయం 4.00, 6.00, 9.30, 10.30, 11.30, 12.30, 1.00, 1.30, 1.45, 2.15, 2.30, 4.00, 4.15, 4.30, 5.15, 6.10

● విచారణ : 9959225979

-సాంస్కృతికం

ప్రధాన ఆసుపత్రి

ఆర్ఎంవో	8008553182
సూపరింటెండెంట్	8008553185

పోలీస్ సమాచారం

●డీఎస్పీ	9440795303
● వన్‌టౌన్	
ల్యాండ్	228333
సీఐ	9440795317
● టు టౌన్	
ల్యాండ్	224302
సీఐ	9440904888
● త్రీ టౌన్	
ల్యాండ్	223190
సీఐ	9440795339
● అర్బన్	
ల్యాండ్	223663
సీఐ	9440795309

గణేష్ మండపాల్లో అన్నదానాలు



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అజయ్‌కుమార్

సాంస్కృతికం: నగరంలో వివిధ డివిజన్లలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద బుధవారం అన్నదానం చేశారు. సాయిరాం థియేటర్ వద్ద గల కాణిపాక విఘ్నేశ్వర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ జి. కృష్ణ, వివిధ డివిజన్లలో ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. రాపర్తినగర్‌లోని గణేష్ మండపం వద్ద ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు జరిపించారు.



కాణిపాక విఘ్నేశ్వర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో...







గట్టయ్య సెంటర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో, ఖానాపురం అభయ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద, రాపర్తినగర్‌లో ఎమ్మెల్సీ పొంగులేటి పూజలు

'రాజకీయ లబ్ధికే నామినేటెడ్ రైతు సంఘాలు'

అర్బన్: ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే నామినేటెడ్ రైతు సంఘాలు ఏర్పాటు చేసిందని పలు రాజకీయ పార్టీలకు చెందిన రైతు సంఘాల నేతలు ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ (ఎన్డీ) పార్టీల అనుబంధ రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సమగ్ర భూ సర్వేను తాము స్వాగతిస్తున్నప్పటికీ స్పష్టమైన విధానాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రెవెన్యూ అధికారుల ద్వారా కాక తమ పార్టీకి చెందిన రైతులతో సర్వే చేయిస్తే గ్రామాల్లో భూ సమస్య మరింత జటిలం అయ్యే ప్రమాదం ఉందన్నారు. తాను నామినేట్ చేసే రైతు సంఘాలు ప్రభుత్వానికే అనుకూలంగా వ్యవహరించటం వల్ల భూ సర్వేలో అక్రమాలు చోటు చేసుకునే ప్రమాదం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందే ఉద్దేశంతోనే ప్రభుత్వం రైతు సంఘాలను తెరమీదకు తెచ్చిందన్నారు. ఎటువంటి మేలు కలిగించని భూ సర్వేను రైతులు వ్యతిరేకించాలన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని సమర్దవంతంగా అమలు చేయటం ద్వారా భూ ప్రయోజనాలనుకాపాడాలన్నారు. రైతుల సమక్షంలోనే క్లస్టర్‌లను ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులతో సర్వే జరపాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ అధికారలుకు వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. సమావేశంలో రైతు సంఘాల నాయకులు బండి రమేష్, మాదినేని రమేష్, గుర్రం అచ్చయ్య, సిద్దినేనికోటయ్య, అడపా రామకోటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నేత నున్నా నాగేశ్వరరావు

'రాష్ట్రంలో రాక్షస పాలన'

మయూరి సెంటర్: దళితులను నమ్మించి మోసం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్నాడని, నియంతలా వ్యవహరిస్తున్న కేసీఆర్‌కి తగిన మూల్యం చెల్లించక తప్పదని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ హెచ్చరించారు. బుధవారం నగరంలో అంబేద్కర్ భవనంలో జరిగిన జిల్లా స్థాయి జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళితులు అనేక రకాలుగా మోసపోతున్నారని, దళితుల మీద దాడులు అధికమయ్యాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు తోటపల్లి మురళీకృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి పేర్ల మధు, లంకా వెంకటేశ్వర్లు, ప్రవీణ్, రాము పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌ల పెంపు వాయిదా

కార్పొరేషన్: కార్పొరేషన్‌లోని వ్యాపార, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలకు ట్రేడ్ లైసెన్స్‌ల పెంపును వాయిదా వేశారు. బుధవారం జరిగిన నగర పాలక సంస్థ పాలకవర్గ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించగా ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ వాయిదా వేయాలని కోరారు. కొందరు వ్యాపారులు, కార్పొరేటర్లను కమిటీగా వేసి చర్చించిన తరువాతే ట్రేడ్ లైసెన్స్‌లను పెంచుదామని ఎమ్మెల్యే ప్రతిపాదించడంతో కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని తీర్మానం :

కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలను రూ. 12వేలకు పెంచాలని పాలకవర్గ సమావేశంలో తీర్మానించారు. వారి వేతనాన్ని రూ. 7600 నుంచి 12వేలకు పెంచాలని ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ తీర్మానం చేయగానే కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపుతామని మేయర్ పాపాలాల్ తెలిపారు.

'మహిళల అభివృద్ధితోనే సమాజంలో మార్పు'

మయూరి సెంటర్: మహిళా అభివృద్ధితోనే సమాజంలో మార్పు వస్తుందని, అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో మహిళల అభివృద్ధికి కృషి చేయాలని రిటైర్డ్ ఉపాధ్యాయురాలు పారుపల్లి ఝాన్సీ అన్నారు. బుధవారం నగరంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన యంగ్ ఉమెన్ సభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. బషీరుద్దీన్, చరణ్య, నందిని, ప్రశాంతి, భాను, వసంత, ఉమాదేవి పాల్గొన్నారు.

డ్రైవర్ కం ఓనర్‌కు క్యాంపు

చర్చికాంపౌండ్: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ వర్గాల ఆర్థిక సాధికారత కోసం డ్రైవింగ్‌లో నైపుణ్యం గల వారికి రాయితీ రుణం అందిస్తూ డ్రైవర్ కం ఓనర్ అయ్యే అవకాశం కల్పించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి జి. రమేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ అభ్యర్థులకు డిస్ట్రిక్ లెవల్ క్యాంపు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3 వరకు నగరంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహిస్తామని తెలిపారు.

నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలి

● ఆర్డీవో పూర్ణచంద్ర

టౌన్: గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు సజావుగా చేయాలని ఆర్డీవో పూర్ణచంద్ర కోరారు. గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై బుధవారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

నిమజ్జన నిబంధనలు....

- నిమజ్జనోత్సవం రోజున ఉదయం 11 గంటలలోపే విగ్రహాలకు పూజలు నిర్వహించి వేదిక నుంచి కదిలించాలి.
- మధ్యాహ్నం ఒంటిగంట వరకు సభ నిర్వహణ ప్రాంతం గాంధీ చౌక్‌కు చేరుకోవాలి.
- నిమజ్జనంలో డీజే సౌండ్లు, బాణ సంచా పేల్చటం నిషేధం.
- విగ్రహాలను తరలించే వాహనాలకు ఆర్‌సీ బుక్‌లు, ఇతర ధ్రువ పత్రాలు ఉండాలి. డ్రైవర్లకు లైసెన్స్ ఉండాలి.


మాట్లాడుతున్న ఆర్డీవో

- నిమజ్జన ఊరేగింపులో మద్యపానం, ధూమపానం నిషేధం. అతిక్రమించేవారిపై చర్యలు తీసుకోనున్నారు.
- నిమజ్జన రూట్‌లో వేలాడే విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలను తప్పించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.
- నిమజ్జనోత్సవం రోజున నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాట్లు.
- నిమజ్జన ప్రాంతాల్లో డ్రెస్ కోడ్ కలిగిన గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలి.
- నిమజ్జన రూట్లలో దారి పొడవునా పలు చోట్ల మంచినీటి సదుపాయం, నిమజ్జన ప్రాంతాల్లో జనరేటర్, క్రేన్‌ల ఏర్పాటు.
- నిమజ్జన ప్రాంతాల్లో అంబులెన్స్, ఫస్ట్ ఎయిడ్ వసతి.
- నిమజ్జన ప్రాంతాల్లో అగ్నిమాపక యంత్రాలు, అగ్ని నిరోధక పరికరాలు సిద్ధం.
- తగిన పోలీస్ బందోబస్తుతో రక్షణ కల్పించడంతోపాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే ఏర్పాట్లు.

ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, కార్పొరేషన్ కమిషనర్ బి. శ్రీనివాస్, అర్బన్ తహసీల్దార్ శ్రీలత, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముర్తుజా, త్రీటౌన్ ఎస్‌హెచ్‌వో వెంకన్న, ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రభాకర్‌రావు, టుటౌన్ ఎస్‌ఐ సర్వయ్య, రెవెన్యూ శాఖ ఆర్‌ఐలు రాజేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

'ఒకటిన పెన్షన్ విద్రోహ దినం పాటించాలి'

ఎడ్యుకేషన్: సెప్టెంబర్ 1వ తేదీన పెన్షన్ విద్రోహ దినం పాటించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యూఎస్‌పీసీ పిలుపునిచ్చింది. బుధవారం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సీపీఎస్ వ్యతిరేక ధర్నా సన్నాహక సమావేశంలో యూటీఎఫ్ వీరబాబు, టీపీటీఎఫ్ నాగిరెడ్డి, విజయ్, ఎస్‌టీఎఫ్ సైదులు, మహబూబాబాద్, పీటీఏ హసన్ పాల్గొని మాట్లాడారు. కలెక్టరేట్ ఎదుట ఒకటో తేదీన జరిగే ధర్నాకు ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు.ఉదయం తొమ్మిది గంటలకు పెవిలియన్ గ్రౌండ్ నుంచి భారీ ర్యాలీ జరుగుతుందన్నారు.


మాట్లాడుతున్న ఉపాధ్యాయ నేతలు

కరాటే చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్

ఎడ్యుకేషన్: ఇటీవల మలేషియాలో జరిగిన అండర్ - 14 7వ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థి వూరడి విశ్వాస్‌రెడ్డి గోల్డ్‌మెడల్ సాధించారని నగరంలోని బ్లోసమ్‌కిడ్స్ కరస్పాండెంట్ నలజాల రుక్మిణి తెలిపారు. అలాగే వరంగల్‌లో జరిగిన అండర్ - 12 విభాగం 4వ నేషనల్ షొటోఖాన్ కరాటే చాంపియన్ షిప్ - 2017 ఆధ్వర్యంలో నిర్వహించిన బాలికల స్పారింగ్ విభాగంలో చెలమల శ్రావ్య, చాంపియన్స్ ట్రోఫీలు గెలుచుకున్నారని తెలిపారు. విద్యార్థుల్ని డీఈవో విజయలక్ష్మీబాయి బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరాటే మాస్టర్ వినోద్ పాల్గొన్నారు.


అభినందిస్తున్న డీఈవో

నగరంలో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన


నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిటీ

సాంస్కృతికం: సెప్టెంబర్ 4వ తేదీన అనంత చతుర్ధశి సందర్భంగా గణేష్ నిమజ్జనం జరుగుతుందని స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లహోటీ, కన్వీనర్ ప్రసన్నకృష్ణ, ప్రధాన కార్యదర్శి కీసర జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని మున్నేరు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను వారు పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గజ ఈతగాళ్లను, విద్యుత్తు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేందుకు క్రేన్స్ ఏర్పాటు చేయాలని, మున్నేరులో నీటిని ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు మోత్కూరి నారాయణరావు, కోశాధికారి గోపాల్, సభ్యులున్నారు.

'సమ్మెను విజయవంతం చేయాలి'

మయూరి సెంటర్: రాష్ట్రంలో కాలపరిమితి ముగిసిన 52 షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్స్ జీవోలను వెంటనే సవరించి కనీస వేతనం రూ.18000గా నిర్ణయించాలని సెప్టెంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం కేవీసీఎం హాలులో జిల్లా అధ్యక్షుడు కే. నర్సింహారావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్డ్ పరిశ్రమల్లో వేతనాలు పెంచడం వల్ల రాష్ట్రప్రభుత్వానికి ఎలాంటి ఖర్చు ఉండదని అన్నారు. 19న జరిగే సమ్మెకు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు టి. లింగయ్య, సీహెచ్. విఠల్‌రావు, నర్సింహారావు, గోపాల్, తిరుమల్, బాబురావు, నాగేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

చర్చికాంపౌండ్: ప్రముఖ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఈ నెల 29న జిల్లాస్థాయిలో నిర్వహించిన క్రీడల్లో తమ కళాశాల విద్యార్థులు జి. సాయి భవ్యశ్రీ, ఎ. రాధా స్నేహలక్ష్మి, విక్రమ్ యాదవ్, ఏడీ జునైద్ ప్రతిభ చూపి స్వర్ణం, వెండి, కాంస్య పతకాలు సాధించారని నగరంలోని కృష్ణవేణి కళాశాల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్‌లు మాచవరపు కోటేశ్వరరావు, గొల్లపూడి జగదీష్, ప్రిన్సిపాల్ జి. రామచంద్రరావు, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.


ప్రతిభ చూపిన విద్యార్థులు

10క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

కలెక్టరేట్: నగరంలోని దానవాయిగూడెంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్‌సప్లై అధికారులు బుధవారం దాడిచేసి పట్టుకున్నారు. దానవాయిగూడెం కాలనీలో మందాడి నరేష్ అనే వ్యక్తి కిరాణాదుకాణంలో అక్రమంగా రేషన్‌బియ్యాన్ని నిల్వచేసారన్న సమాచారం మేరకు సివిల్‌సప్లై డీటీ సునీల్‌రెడ్డి, ఆర్‌ఐ అశోక్ దాడి చేసి పట్టుకున్నారు. పంచనామా నిర్వహించి అతనిపై 6ఏ కేసును నమోదు చేశారు.



గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 'ఆంధ్రజ్యోతి' ఖమ్మం యూనిట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడి విగ్రహం వద్ద ఆరో రోజైన బుధవారం పూజలు నిర్వహిస్తున్న సిబ్బంది

వ్యాన్ ఢీ, వ్యక్తికి తీవ్రగాయాలు

క్రైం: వేగంగా ప్రయాణిస్తున్న వ్యాన్ ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఉల్లిపాయల వ్యాపారం చేసే మస్తాన్ బైపాస్ రోడ్‌లో ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎన్టీఆర్ సర్కిల్ వైపు నుంచి వెళ్తున్న వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమైంది. బాధితుడి తల్లి జహీర్‌బీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోలకు రంగు పడుద్ది...

- క్రమబద్ధీకరణకు రంగం సిద్ధం
- కంప్యూటీకరణకు ఏర్పాట్లు

క్రైం: 'ఆటో వాలా రాంగ్‌రూట్‌లో వచ్చి యాక్సిడెంట్ చేసి పరారయ్యాడా....?, రాత్రి వేళల్లో ఆటోలో ప్రయాణించే ఒంటరి మహిళ పట్ల ఆటో డ్రైవర్ అనుచితంగా ప్రవర్తించాడా....?, ఆటోలో మీ విలువైన వస్తువులను మరిచి పోయారా....? ఆ ఆటోను, ఆటోవాలను ఖచ్చితంగా గుర్తించ లేకపోతున్నారా....?' ఇక నుంచి ఆ సమస్య లేకుండా ట్రాఫిక్ పోలీసులు సరికొత్త చర్యలు చేపట్టారు.. ఆటోలను క్రమబద్ధీకరించే చర్యలు అమల్లోకి వస్తే ఇకపై నిరక్షరాస్యులు సైతం ఆటో వల్ల తమకు కలిగిన అసౌకర్యంపై తేలికగా ఫిర్యాదు చేయవచ్చు. సంబంధిత ఆటో ఆనవాళ్లను పక్కాగా వివరించవచ్చు. ఇది ఎలా అనుకుంటున్నారా..?

ఆటోలకు ప్రత్యేక కలర్ కోడ్..

నిరక్షరాస్యులు సైతం ఆటోలను పక్కాగా గుర్తించేందుకు ఆటోలకు కలర్ కోడ్ అమలు చేయనున్నారు. నగరంలో తిరిగే ఆటోలకు ఒక రకం రంగు, అదే విధంగా ఇతర రూట్‌లకు సంబంధించిన ఆటోలకు వేర్వేరు రంగులను ఇవ్వనున్నారు. దీని వల్ల ఆటో రంగు పేరు చెప్పగానే ఆ ఆటో ఏ రూట్‌కు చెందినదో సులువుగా గుర్తించవచ్చు.

ఆటోకు యూనిక్ నెంబర్

ప్రతీఒక ఆటోకు యూనిక్ నెంబర్‌నుకేటాయిస్తారు. ఈ నెంబర్ ద్వారా ఆటోకు సంబంధించిన సమాచారం తెలిసి పోతుంది..

కంప్యూటరీకరణ

ఆటోలకు సంబందించిన సమగ్ర సమాచారాన్ని కంప్యూటరీకరించనున్నారు. ఆటోకు ఇచ్చిన కలర్, కేటాయించిన నెంబర్, బండినడిపే డ్రైవర్, ఓనర్‌కు సంబంధించిన సమాచారం కంప్యూటర్లలో చేర్చనున్నారు.

సమాచారమంతా ఆటోలో..

ఆటోకు సంబంధించి ట్రాఫిక్, రవాణా శాఖల సమాచారాన్ని ఇకపై ప్రతీ ఆటోలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఆటో డ్రైవర్ సీటు వెనుక ఆటోనెంబర్, ఓనర్ పేరు, డ్రైవర్ పేరు, డ్రైవర్ ఫొటో, ఆటో లైసెన్స్ నెంబర్, ఇన్సూరెన్స్ నెంబర్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి పేర్కొనాల్సి ఉంది.

నియంత్రణకు సహకరించండి: ట్రాఫిక్ సీఐ

నగరంలో ఆటోల నియంత్రణకు సహకరించాలని ట్రాఫిక్ సీఐ నరేష్‌రెడ్డి ఆటో యూనియన్ల ప్రతినిధులు, ఆటో డ్రైవర్లను కోరారు. ఆటోల కంప్యూటరైజేషన్ చర్యలను వివరించేందుకు బుధవారం కమాండ్ కంట్రోల్ రూంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు ఆటో యూనియన్లకు చెందిన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..ట్రాఫిక్ విభాగం సూచించిన సమాచారాలను సమకూర్చుకోవటంతో పాటు ఆటోలకు కలర్, కంప్యూటరైజేషన్ తదితర చర్యలకు సహకరించాలని కోరారు.

'పరిసరాల పరిశుభ్రత పాటించాలి'

కామేపల్లి: గ్రామంలోని ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కామేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు జితేందర్ అన్నారు. మండలంలోని పాతలింగాల గ్రామంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను ఆయన పరీక్షించారు. గ్రామంలో ప్రజలు బాధ్యతతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

టీఆర్ఎస్వీ దాడులు ఖండిస్తూ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మయూరి సెంటర్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేడు నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ప్రచారం చేస్తున్న పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులపై టీఆర్ఎస్, టీఆర్ఎస్వీ నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సురేష్, రంజిత్ కుమార్ మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిబాటలో అడుగులు వేస్తోందని డప్పు కొట్టుకుంటున్న టీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆజాద్, వెంకట్, వర్ధన్, కిరణ్ పాల్గొన్నారు.

'గణిత శాస్త్రంపై అవగాహన పెంచుకోవాలి'



మాట్లాడుతున్న బాలకిషన్

చర్చికాంపౌండ్: బాల్యదశ నుంచే గణితశాస్త్రంపై అవగాహన పెంచుకుని ముందుకు సాగాలని, దీనిని అన్నింటికంటే సులువుగా అర్థం చేసుకోవచ్చని ఖమ్మం ఇంటెలిజెన్స్ డీఎస్పీ బాలకిషన్ పేర్కొన్నారు. నగరంలోని శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలలో బుధవారం మ్యాథ్స్ క్లబ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలకిషన్ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే గణితశాస్త్రంలో మెళకువలు నేర్చుకుని అంతర్జాతీయస్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య, ప్రిన్సిపాల్ రాజారావు, గణిత ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎల్ఆర్ఎస్ నిధుల కేటాయింపులు పెంచండి'


వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శీలంశెట్టి రమ

కార్పొరేషన్: 33వ డివిజన్‌కు ఎల్ఆర్ఎస్ నిధుల కేటాయింపు పెంచాలని కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం బుధవారం మేయర్ డాక్టర్ జి. పాపాలాల్‌కు వినతిపత్రం అందజేశారు. 33వ డివిజన్ నుంచి ఎల్ఆర్ఎస్ కింద 300కు పైగా దరఖాస్తులు వచ్చాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ డివిజన్ నుంచి రూ. 1.25 కోట్లు ఆదాయం ఎల్ఆర్ఎస్ ద్వారా రాగా 2 లేదా 3 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చిన డివిజన్లకు రూ. 1.50 కోట్ల నుంచి రూ. 2 కోట్లు కేటాయించారని, 33వ డివిజన్‌కు కేవలం రూ. 50 లక్షలే కేటాయించారని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఎన్నో సమస్యలున్న 33వ డివిజన్‌కు ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు.

దొనబండలో మెగా హెల్త్ క్యాంప్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపూడి పంచాయతీ దొనబండ గ్రామంలో బుధవారం పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో సుమారు 20 మంది జ్వరంతో బాధపడుతున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన విషయం విధితమే. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పువ్వాడ ఫౌండేషన్ స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసింది. అదేవిధంగా మండలపరిషత్ అధికారులు గ్రామంలో పర్యటించారు. మురుగు గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు.


టాబ్లెట్‌లు అందిస్తున్న తహసీల్దార్

గ్రామంలో ఉద్రిక్తత

దొనబండ గ్రామ పరిస్థితి గురించి తెలుసుకున్న అధికారులు గ్రామానికి రాగా స్థానికులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు చనిపోతున్నా పట్టించుకోరా అని నిలదీశారు. గ్రామం మొత్తం మురికికూపంలా ఉన్నా ఎవరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం వారికి సర్ధిచెప్పి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధిపై చర్చ జరిపారు. అనంతరం రోగాల బారిన పడ్డవారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలాచారి, మండల వైద్యాధికారి సునంద, జడ్పీటీసీ సభ్యుడు వీరూనాయక్, ఈవోఆర్‌డీ నజ్మాసుల్తాన్, కార్యదర్శి రాజేశ్వరి, ఆర్ఐ నర్సింహారావు, మమత ఆస్పత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దుచేయాలి వీఆర్వోల సంఘం ప్రదర్శన

కలెక్టరేట్: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్ రావు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఐక్యంగా ఉండి ఉద్యమాల ద్వారానే తమ హక్కులను సాధించుకునే వీలుందన్నారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ ప్రదర్శనలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సున్నం రామారావు, షేక్ నాగుల్‌మీరా, ధారావత్ భాస్కర్,శీలం నరేంద్రప్రసాద్, బియ్యం నర్సింహారావు, మేడికొండ బాలయ్య, తాటి ఇందిర, బంకా భాస్కర్‌రావు, నాగులపాటి రమేష్, రాజారత్నం పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్సీ, జడ్పీ చైర్‌పర్సన్ అభినందనలు


అభినందిస్తున్న ఎమ్మెల్సీ, జడ్పీ చైర్‌పర్సన్

చర్చికాంపౌండ్: మలేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన నగరంలోని బ్లోసమ్‌కిడ్స్ పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత అభినందించారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం బుధవారం జరిగిన కార్యక్రమంలో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థి విశ్వాస్‌రెడ్డిని, వరంగల్‌లో నేషనల్ కరాటే పోటీలో బాలికల విభాగంలో ట్రోఫీని సాధించిన శ్రావ్యను ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత, జిల్లా క్రీడా స్పోర్ట్స్ అధికారి పరందామిరెడ్డి తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రుక్మిణి, కరాటే మాస్టర్ వినోద్ పాల్గొన్నారు.

'గులాబిరంగు పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలి'

రఘునాథపాలెం: గులాబిరంగు పురుగులను ముందస్తుగా గుర్తించి వాటి నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని ఖమ్మం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కొంగర వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం రఘునాథపాలెం మండలం బాలపేట గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో ప్రదర్శన క్షేత్రంలో గులాబిరంగు పురుగుల ఉత్పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరైన రైతులకు పురుగుల ఉధృతిని నివారించేందుకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకునే విధానాన్ని వివరించారు. ఎకరాకు కనీసం నాలుగు చొప్పున వీటిని ఏర్పాటు చేస్తే పురుగులు వీటికి ఆకర్షితులై చనిపోతాయని చెప్పారు. సంప్రదాయ పద్ధతులను అవలంబిస్తేనే మంచి ఫలితాలు వస్తాయని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శిరిణ్మయి, జైరాములు తదితరులు పాల్గొన్నారు.


లింగాకర్షక బుట్టల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

వేతనాల పెంపు పట్ల కార్మికుల హర్షం


కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

మయూరి సెంటర్: మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంపు పట్ల టీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు బుధవారం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం జరిగిన కౌన్సిల్‌లో కార్మికులకు రూ. 12,500 వేతనం పెంపు తీర్మానాన్ని ప్రవేశపెట్టి పాలకపక్షంతో ఎమ్మెల్యే ఆమోదింపజేయడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. వేతనాలు పెంచిన పాలకపక్షం మేయర్, ఎమ్మెల్యేకి కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బుర్రి వినయ్‌కుమార్, దాసరి లక్ష్మీనారాయణ, పల్లెపొంగు రాజు, వెంకటేష్, వెంకటేశ్వర్లు, సతీష్, చిరంజీవి, శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు బుధవారం ఎంఈవో సత్యనారాయణ క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. జిల్లేపల్లి కాంప్లెక్స్ నిధులతో కొనుగోలు చేసి అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు వెంకట్రామిరెడ్డి, మక్బూల్ ఆలీ, రవికిషోర్, ఉప్పలయ్య, రవికుమార్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన ఇళ్లు..

- డ్రయినేజీ వ్యవస్థలేక పోవడంతో ఇళ్లలోకి చేరుతున్న నీళ్లు
- రోడ్డుపైనే వంటచేసుకుంటున్న బాధితులు
- పట్టించుకోని అధికారులు




కోరట్లగూడెంలో నీట మునిగిన ఇల్లు, రోడ్డుపైనే వంటచేసుకుంటున్న బాధితులు



మోర్లబండ వాగు ఉధృతితో నీట మునిగిన వరి పొలాలు

కోరట్లగూడెం(నేలకొండపల్లి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోరట్లగూడెంలో మూడుఇళ్లల్లోకి వరద నీరు చేరింది. ఇళ్లల్లోకి నీరు చేరటంతో బాధితులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. బుధవారం వర్షం లేనప్పటికీ, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటంతో పాటు, రోడ్డుపై పారే వర్షపు నీరు కూడ ఇళ్లలోకి వచ్చి చేరింది. దీంతో రెండు ఇళ్లల్లోనుంచి నీరు బయటకు వెళ్ళినప్పటికీ, మీసాల విజయ్ ఇంటిలోని నీరు ఉండటంతో ఇంటి సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంట్లో ఉండటానికి వీలు లేకపోవటంతో, రోడ్డుపైనే వంటా-వార్పు చేసుకుంటున్నారు. ఇళ్ళల్లోకి. నీరు చేరినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోలేదని ఇంటి యజమాని విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు.

వాగు ఉధృతితో నీట మునిగిన పొలాలు

నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. గంగమ్మ గుడి సమీపంలోని మోర్లబండ వాగు ఉధృతంగా వస్తుండటంతో వాగు పొంగి, వాగు సమీపంలో నాట్లు వేసిన దాదాపు 50 ఎకరాలు నీట మునిగాయి. నేలకొండపల్లితో పాటు పైన వర్షాలు పడటంతో మోర్లబండ వాగుకు వరదనీరు వస్తున్నది.వాగుతో పాటు చెరువులు జలకళను సంతరించుకున్నాయి

రేపు సామూహిక సెలవులు



సెలవుపత్రాలు అందిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉపాధ్యాయ, ఉద్యోగులు సామూహిక సెలవు పత్రాలు సంబంధిత శాఖాధికారులకు బుధవారం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ మాట్లాడుతూ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక, ఆర్థిక భద్రత కొరవడుతుందన్నారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు కిరణ్‌కుమార్, సంపత్, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాములు, యుటీఎఫ్ మండల అధ్యక్షుడు రవికుమార్, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నె గురుమూర్తి పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వం: టీడీపీ



మాట్లాడుతున్న స్వర్ణకుమారి

ఖమ్మం రూరల్: రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని టీడీపీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ స్వర్ణకుమారి విమర్శించారు. మండల పరిధిలోని మద్దులపల్లిలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పనులు కేవలం కమీషన్ల కోసమే నిర్వహించే పనులని ఆరోపించారు. పాలేరులో నిర్మించిన భక్తరామదాసు పథకం కేవలం కాంట్రాక్టర్లకు లబ్ది చేకూర్చేందుకే నిర్మించారని ఆరోపించారు. ఈ సందర్భంగా మద్దులపల్లి గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ నుంచి కొందరు టీడీపీలో చేరినట్టు ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రెడ్యానాయక్, నాగేశ్వరరావు, కాకి శ్రీను, బండి సతీష్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

సేవా మండలి అధ్యక్షురాలికి అవార్డు పట్ల హర్షం

నేలకొండపల్లి: నేలకొండపల్లి సేవా మహిళామండలి అధ్యక్షురాలు మచ్చా రేణుకకు పెందుర్తి మధుసూధన్‌రావు అవార్డు ఇవ్వటం పట్ల సేవా మహిళా మండలి, భక్తరామదాసు సర్వీస్ సొసైటీలు హర్షం ప్రకటించాయి. భవిష్యత్తులో రేణుకకు మరిన్ని అవార్డులు రావాలని , అభినందనలో తెలిపారు. సేవా మహిళామండలి గౌరవ అధ్యక్షుడు నెల్లూరి వీరబాబు, భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మచ్చా రఘుపతిరావు, వెల్లంపల్లి శ్రీనివాసరావు, సేవా మండలి కార్యదర్శి సుంకర ఉజ్వల, కొంగర ప్రభావతి, భక్తరామదాసు సర్వీస్ సొసైటీ మాజీ అధ్యక్షుడు గెల్లా జగన్మోహన్‌రావు, తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్‌కు బ్రహ్మయ్య రాజీనామా



మాట్లాడుతున్న బ్రహ్మయ్య

నేలకొండపల్లి: కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముజ్జుగూడేనికి చెందిన ఉన్నం బ్రహ్మయ్య పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, మండల కన్వీనర్ పదవికి రాజీనామా చేశారు. బుధవారం ముజ్జుగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బ్రహ్మయ్య రాజీనామాను ప్రకటించారు. బ్రహ్మయ్యతో పాటు ముజ్జుగూడెం సర్పంచ్ ఐతనబోయిన వీరమణి, ఎంపీటీసీ సభ్యుడు ఖాజీమెయినుద్దీన్, నాచేపల్లి పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు తన్నీరు రవి తదితరులతో పాటు గ్రామానికి చెందిన మరో వంద మంది కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బ్రహ్మయ్య రాజీనామాతో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుందనటంలో ఎటువంటి సందేహం లేదు

త్వరలో టీఆర్ఎస్‌లోకి?

కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన బ్రహ్మయ్య త్వరలో టీఆర్ఎస్ చేరనున్నట్టు సమాచారం. బ్రహ్మయ్య కారెక్కనున్నట్లు ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన విషయం విదితమే. బ్రహ్మయ్య, అతని అనుచరులు అధికారపార్టీలో చేరనున్నట్టు సమాచారం.

లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలు

నేలకొండపల్లి: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను గ్రామసభల్లో లాటరీ పద్దతి ద్వారా, నాలుగు నుంచి ఏడువరకు ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సభల షెడ్యూల్‌ను విడుదల చేశారు.నాలుగున అప్పలనర్సింహాపురం, కట్టుకాచారం, రావిగూడెం, బుద్దారం, చెర్వుమాధారం, భైరవునిపల్లిలో ఐదున పైనంపల్లి, కొత్తకొత్తూరు, అనాసాగరం, ముజ్జుగూడెం, నాచేపల్లి, నేలకొండపల్లి, ఆరున గువ్వలగూడెం, కోనాయగూడెం, కోరట్లగూడెం, బోదులబండ, ఏడున రామచంద్రాపురం, సుర్దేపల్లి, మంగ్రాజుపల్లి, చెన్నారం, రాజేశ్వరపురం, మూటాపురం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రకటనలో తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న మండల అధ్యక్షుడు

నేలకొండపల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మండలంలో ముగ్గురుకు టీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాములు బుధవారం లబ్ధిదారులకు అందచేశారు. రావిగూడేనికి చెందిన నంబూరి కోటయ్యకు రూ.22వేలు, చెర్వుమాధారంకు చెందిన పి.అనిల్‌కుమార్‌కు రూ.48వేలు, కోరట్లగూడేనికి చెందిన దండ్యాల గోపికి రూ.ఐదువేల చెక్కులను అందచేశారు. ముగ్గురూ అనారోగ్యంతో బాధపడుతుండగా మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్ళటంతో, తుమ్మల కృషితో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందినట్లు సీతారాములు చెప్పారు. కార్యక్రమంలో మండల మాజీ కార్యదర్శి నల్లాని మల్లికార్జున్, కార్యదర్శి కోటి సైదారెడి, జడ్పీటీసీ సభ్యురాలు తేజావత్ అనిత, ఎంపీపీ కవితారాణి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

రూరల్ సీఐ తిరుపతిరెడ్డి

తల్లంపాడు, సుబ్లేడులో అన్నదానం

ఖమ్మం రూరల్: అన్ని దానాల కంటే అన్నదానం మహాదానమని ఖమ్మం రూరల్ సీఐ తిరుపతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తల్లంపాడు గ్రామంలోని శ్రీ మహాత్మ యువక మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వీఆర్వో పాపారావు, గ్రామ సర్పంచ్ దరగయ్య, మాజీ ఉపసర్పంచ్ శ్రీకాంత్, గ్రామ పెద్దలు జే. శ్రీధర్, రమణ, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, లింగయ్య, కొండలు, కృష్ణమూర్తి, కొండమీది సత్యం, యూత్ కమిటీ సభ్యులు శ్రీలాల్, శ్రీరాం, నవీన్, నంద్యాల ఉపేందర్, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. వరంగల్‌క్రాస్‌రోడ్డులో ఫ్రెండ్స్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో పద్మశ్రీ వనజీవి రామయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి రామయ్య మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత, వెంకటరెడ్డి, రమేష్, శేషిరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుబ్లేడులో అన్నదానం

తిరుమలాయపాలెం: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని కాకరవాయి, మేడిదపల్లి, సుబ్లేడు తదితర గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు. సుబ్లేడులో గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని టీఆర్ఎస్ జిల్లా నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిదానాల్లో కంటే అన్నదానం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వనవాసం సురేష్‌రెడ్డి, పి. సంజీవులు, సుమన్‌రెడ్డి, గంధసిరి శ్రీను, వీరన్న, నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మయ్య, వెంకటనారాయణ పాల్గొన్నారు.



తల్లంపాడులో అన్నదానం ప్రారంభిస్తున్న సీఐ



తిరుమలాయపాలెంలో..